

ఆంధ్రప్రదేశ్

అక్టోబరు 2, 1969   25 పైసలు

మన కాలపు ఋషి

తన ప్రజలమకుటం లేని మహారాజు.
రాజకీయ చాతుర్యంవల్లకాక కేవలం
తన వ్యక్తిత్వ ప్రభావంచేత ఆకర్షించిన
మహా నాయకుడు. . . . .

విదేశీయుల క్రూరత్వాన్ని మాన
వత్వంతో ఎదిరించి గెలచిన ధీశాలి.

ఇటువంటి సకలాతీత శక్తి సంపన్నుడు
కేవలం మానవ మాత్రుడుగా యీ
భూమీద పుట్టి పెరిగాడంటే
ముందు తరాలవారు నమ్మడం కష్టం.

—ప్రఖ్యాత శాస్త్రవేత్త ఐన్‌స్టీన్

ఆంధ్రప్రదేశ్

సంపుటి: 13] అక్టోబరు 1969 [సంచిక: 12
ఆశ్వయుజం_కార్తీకం 1891 శా.శ

ప్రధాన సంపాదకులు
వి. వామనరావు

గాంధీజీ శతజయంతి ప్రత్యేక సంచిక

ముఖచిత్రం: గాంధీజీ అడుగు జాడలలో
(చిత్రకారుడు : సూరి)

మూడవ అట్ట: శ్రీశైలం వద్ద కృష్ణవేణి జలతరంగాలు

నాలుగవ అట్ట: హైదరాబాదులో గాంధీజీ (1929)

వెల: 25 పైసలు

Regd. No. H. 133.

ఈ సంచికలో...

పేజీ

సంపాదకీయం:

నవ శకానికి నాంది

ఆంధ్రప్రదేశ్‌లో, తెలంగాణా ప్రాంతంతో సహా అన్ని చోట్లా, గాంధీ జయంత్యుత్సవాలు ప్రశాంత పరిస్థితులలో జరగడం ముదావహమైన విషయం. గడచిన జనవరి నెలలో తెలంగాణా ఉద్యమం ప్రారంభమైన తర్వాత యింతటి ప్రశాంత పరిస్థితి ఎప్పుడూ మనం చూడలేదు. ఇంతకాలం తర్వాత మళ్లీ విద్యార్థులు కళాశాలలకూ పాఠశాలలకూ వెళ్లుతున్నందున ప్రశాంత పరిస్థితులు ఏర్పడినట్లుగా మనం భావించవచ్చు. తెలంగాణా ప్రాంతం యిప్పుడు ప్రశాంతంగా వుంది. క్రమక్రమంగా ప్రశాంత పరిస్థితులు ఏర్పడుతూ వుండడమూ, రాష్ట్రపతి ఉత్తర్వును సవరించి తెలంగాణా ప్రాంతీయ సంఘం అధికార పరిధిని పెంచడానికి ఉద్దేశించడం వంటి వివేకవంతమైన చర్యలు తీసుకొని సుస్థిరత సాధించే ప్రయత్నం ప్రారంభంకావడమూ మొదలగు వాటికి విజ్ఞుల హర్షామోదాలు లభిస్తున్నవి. ఇటువంటి అనేక చర్యలు పరస్పర సహకారం, సదవగాహనలతో కూడిన ఒక నూతన శకానికి నాంది అయి ఆంధ్రప్రదేశ్ ప్రశాంత పరిస్థితులలో సౌభాగ్యవంతమైన రాష్ట్రంగా వృద్ధి చెందడానికి దోహదకారులవుతున్నవి.

రాష్ట్రపతిగా ఎన్నికైన తర్వాత మొదటి సారిగా శ్రీ వి.వి. గిరి మన మధ్యకు విచ్చేశారు. ప్రజలకు ఆయన పట్ల గల గాఢాభిమానం వల్ల నేమి ప్రముఖ పౌరులతో ఆయన చేసిన సంప్రదింపుల ఫలితంగా నేమి మన సమస్యలను కొత్త దృక్పథంతో పరిశీలించుకొనే ప్రయత్నం ప్రారంభమైంది. శ్రీ గిరి ప్రదర్శించే నిష్కాపట్యమూ, స్నేహవైఖరీ, రాష్ట్రపతి హోదా కలిగి వుండడం వల్లనేకాక జాతికి అర్ధశతాబ్దం పాటు చేసిన నిస్వార్థ సేవా ఫలితంగా ఆయనకు ప్రజలపై గల నైతిక ప్రభావమూ, –వీటన్నిటి వల్లా ఆయన రాకతో వాతావరణంలో చీకట్లు తొలగి వెలుగులు ప్రసరించినట్లయింది.

ఇరవై రెండేండ్ల తర్వాత మళ్లీ మనదేశానికి సరిహద్దుగాంధీ, ఖాన్ అబ్దుల్ గఫర్ ఖాన్ రావడం నిజంగా వర్తమాన చరిత్రలో అపూర్వమైన సంఘటన. గాంధీజీ గఫర్ ఖాన్‌ను "దేవుని మనిషి" అని వర్ణించారు. గఫర్ ఖాన్ కాకలుతీరిన స్వాతంత్ర్య యోధుడు. గాంధీజీ ప్రబోధాలను పూర్తిగా అవగాహన చేసుకున్న గొప్ప అహింసా తత్వవేత్త. ఆంధ్రప్రదేశ్ సందర్శించనున్న గఫర్ ఖాన్ రాకకోసం ప్రజలు వేయికండ్లతో ఎదురుచూస్తున్నారు. సరిహద్దు గాంధీకి ఉచితరీతిని స్వాగతమిచ్చి సత్కరించడానికి స్వామీ రామానందతీర్థ అధ్యక్షతన ఏర్పడిన సన్నాహక సంఘం కృషిచేస్తున్నది. ఖాన్ అబ్దుల్ గఫర్ ఖాన్ ప్రజా సేవకూ, త్యాగనిరతికీ మారుపేరు. అక్టోబరు 2వ తేదీన కొత్త ఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతినిధులు ఆయన్ను కలుసుకున్నప్పుడు వారిపట్ల ఆయన ఎంతో ప్రేమ వాత్సల్యాలు ప్రదర్శించారు. గాంధీ, సరిహద్దుగాంధీ లిరువురిని చిత్రించిన నిర్మల్ కళాఫలకం ఒకటి ఆయనకు బహూకరించబడింది. దానితోపాటు "భగవంతుని సేవకుని"గా భావించుకొని ప్రజా సేవచేసిన ఆ మహనీయుని పట్ల మన ప్రేమ గౌరవాలకు చిహ్నంగా రాష్ట్రంలోని చేతి పరిశ్రమలలో తయారైన మరికొన్ని కళాఖండాలు కూడా సమర్పించడం జరిగింది.


శతజయంతి సందర్భంగా ప్రపంచ ప్రజల మహానాయకుడు గాంధీజీకి దేశదేశాలలో నివాళులర్పించారు. "ప్రజలపై సమ్మోహనకరమైన ప్రభావమూ, అనంతమైన ఆకర్షణా కలిగిన ఎంత అద్భుతమైన మహావ్యక్తి యీయన" అని జవహర్‌లాల్ నెహ్రూ ఆశ్చర్యం ప్రకటించారు. రాజఘాట్‌లో యిప్పుడు జరుగుతున్న "గాంధీ దర్శన్" ప్రదర్శన ఆ మహనీయుని బోధనలనూ ప్రజలపై వాటి ప్రభావాన్నీ మరొకమారు జ్ఞాపకం చేసుకోవడానికి ఉద్దేశించబడినదే. ఆయన బోధలను అనుసరించడంకంటె మిన్నఅయిన స్మృతి చిహ్నం ఆయనకు ఏదీ మనం నెలకొల్పలేము. ఆయన చెప్పిన ఆదర్శాన్ని మనం అక్షరాలా అనుసరిద్దాం.

"నీకు మంచీ చెడులను గురించి అనుమానం వస్తే లేక నీలో స్వార్థ భావన పెరిగితే నీకు నువ్వే యీ పరీక్ష పెట్టుకో. నీవు చూసిన ఒక నిరుపేద లేక ఒక నిర్భాగ్యుని మనస్సులో గుర్తుకు తెచ్చుకో. నీవు చేయదలచిన పని అతనికి ఏవిధంగానైనా ఉపయోగపడుతుందా, దీనివల్ల అతడు లాభపడతాడా అని ప్రశ్నవేసుకో."

—పి. వి. ఆర్.



గాంధీజీ
శతజయంతి
శ్రద్ధాంజలి



న భూతో న భవిష్యతి

ముదిగొండ వీరభద్రమూర్తి

స్వాతంత్ర్యామృతమున్ సమస్తజనతాసంపీతమున్ జేసి, చా
రిత్రాతీతయుగాంతరాగతము ఘూర్ణీభూతదుగ్ధాబ్ధి ను
ద్భూతం బైన మిఠాయి పంచు కథతో తోతెంచు నా మచ్చ సం
ధౌతంబుం బచరించుకోగలిగె దైత్యారాతి తా గాంధి యై.

అతని బోధరసమ్మున నార్ద్రి మగుచు
జాతిరత్నమ్ములన్ గనె భూతధాత్రి
'జాతిపిత' యిటు లైనాడు తాత గాంధి
'బాపుజీ' యయ్యె 'బాపురే' పలుక జగము.

మోహనమున దాసునిగా నెపుడు నెదిరిని
జేసికొనవలె వాక్క్రియాసిద్ధి కరము
చందుగా నొప్పవలె నని మందలించు
మనల నెవని నామ మతండె మార్గదర్శి.

కారాగారము జేసి భారతము ప్రాకారమ్ము తా నైన యాం
గ్లోరు ప్రాభవ మోడువారె, నెటియల్ గొాట్బెన్, పడెన్, వేని వి
స్తారస్ఫీత విచిత్రభూత విలసత్సత్యాగ్రహాఖ్యాతనా
గారద్ధప్రతిశబ్దఘాతమున వా డాద్యుండు పూజ్యావళిన్.

అవియించె న్నిజబోధచంద్రికలచే నస్పృశ్యతాధ్వాంతమున్
కవియించెన్ కవితావితానములచే కల్హారగంధమ్ములన్
ఇవతాళింపగ జేసె నెల్ల కడలన్ హేరాళ మౌ శాంతిచే
సవ్యతా గాంధికి భారతేందున కదృశ్యం బెందు గాలించినన్.

వెతకి "న భూతో న భవి
ష్యతి" యని చాటించె గాంధి సామ్యవివక్షన్
ప్రతి మనుజుండును సర్వమ
హితలంబున మహితు డొక్కడే 'బాపూజీ'.

గాంధీజీ - నేటి భారతదేశం

కె. సంతానం

అధికారమూ, సంపదా కూడా వికేంద్రీకృతమై ఉన్నప్పుడే స్వేచ్ఛకూ, సమాన ఆత్మ ప్రతిపత్తికీ గౌరవానికీ, పరువు ప్రతిష్ఠలకూ దారి ఏర్పడుతుందని గాంధీజీ వాదం. పంచాయతీ రాజ్య వ్యవస్థ, సహకారోద్యమాల ద్వారా వికేంద్రీకరణకు కృషి జరుగు తున్నది.



మహాత్ముని ప్రబోధాలు ఎందరెందరో వ్యక్తులకూ, ఎన్నో సందర్భాలకూ వర్తిస్తాయి. మానవులకు సంబంధించిన వ్యవహారాలు వేటిలోనైనా ఆయన వ్యక్తిని ప్రాతిపదికగా పరిగణించేవారు అందుకే, ప్రతి వ్యక్తీ నైతికంగా, ఆధ్యాత్మికంగా వికాసం చెందాలని, శారీరికంగా బలపడాలనీ అభిలషించేవారు. అందుకు సర్వదా యథాశక్తిని పాటు పడేవారు. అయితే ఒకే రకమైన ఆదర్శాలూ నమ్మకాలూగల బృందాలూ, అనేక అశక్తతలకు లోనవుతూన్న జన సముదాయాలూ, చివరకు ఆయా ప్రభుత్వాల పాలన క్రింద ఉండే దేశ ప్రజలూ కార్యాచరణకు పూనుకునేందుకు తగ్గ విధానాలను సైతం ఆయన రూపొందించకపోలేదు.

మహాత్ముని అహింసా సిద్ధాంతం

గాంధీజీ అహింసా సిద్ధాంతమే ఆయన ఇతర ప్రబోధాలన్నిటికీ ప్రాతిపదికగా కన్పిస్తుంది. జంతు దశ నుంచి పరిణామం చెందిన మానవునిలో హింసా ప్రవృత్తి ఇంకా కొంత మిగిలి ఉన్నదనీ, క్రమశిక్షణతో ఈ ధోరణిని అదుపులోకి తెచ్చి క్రమబద్ధం గావించడం మన ధర్మమనీ ఆయన ఉద్ఘాటిస్తూ ఉండే వారు.

ఈ పని మనకు తెలియకుండా ఏదో జరిగిపోవటం కాదనీ, ప్రయత్న పూర్వకంగా జరగాలనీ బాపూ కోరేవారు, శరీరంపై అదుపు విధించే అధికారం మనస్సుకూ, మనస్సుపై అదుపు విధించే అధికారం ఆత్మశక్తికీ ఉండేట్లు చూడటమే లక్ష్యంగా వ్యక్తులూ, జన సముదాయాలూ, వివిధ జాతులు కూడా పాటుబడా లనేవారు. సహజంగా ఈ పరిణామ దశను చేరుకోవటానికి ఒక్కొక్కరికీ కొంత కొంత వ్యవధి అవసరమవుతుంది. అనేకమంది వ్యక్తులు కలిసి ఒక సముదాయంగా వ్యవహరించే సందర్భాలలో అందులోని ప్రతివారూ అత్యున్నత స్థాయిలో అహింసాయుత వైఖరిని అవలంబించ జాలరు. అయితే వారిలో వారు పరస్పరం ఒక సముచిత స్థాయి అంటూ నిర్ణయించుకుని ఆ మేరకు అహింసా విధానాన్ని అనుసరించవలసి ఉంటుంది అనే వారు. అంటే ఆయన నిర్వచించిన ఈ అహింసా విధానం అనేది ఆయా సందర్భాలకూ, పరిస్థితులకూ అనుగుణమైనదీ, అర్థవంతమైనదీ అని చెప్పుకోవలసి ఉంటుంది.

దేశ స్వాతంత్ర్య సాధన కోసం జరిగిన సమరంలో, వ్యక్తిగతంగానూ సాముదాయికంగానూ కూడా తాము అనుకున్న పద్ధతి అహింసా విధానం ఎలా అమలు జరిగేదీ ప్రత్యక్షంగా ఆచరణలో చూపారు గాంధీజీ.

ఈనాడు దేశంలో అనేక రకాల ఆందోళనలకూ ప్రదర్శనలకూ హింస, దౌర్జన్యం తోడవుతూఉండటం ఎంతో దురదృష్టం. ఈ ధోరణినే కనక అదుపులోకి తేకపోయినట్లయితే వ్యక్తి స్వేచ్ఛ, దేశ స్వాతంత్ర్యమూ కూడా మనం కోల్పోవలసి రావచ్చు. రష్యా, చైనాలలోని కమ్యూనిస్టు విప్లవాల మోస్తరు హింసాయుత విప్లవాన్ని మన దేశంలో కూడా తేవచ్చునని గనక ఎవరైనా భావిస్తూ ఉన్నట్లయితే, వారు భ్రమపడుతున్నారనే చెప్పవలసి వస్తుంది. ఆర్థికంగానూ, సామాజికంగానూ మన మాసిస్తున్న మార్పులను శాంతియుతమైన, ప్రజాస్వామిక వ్యవస్థా బద్ధమైన పరిణామం ద్వారానే సాధ్యం. దేశంలో ప్రజలు ఏర్పాటు చేసుకునే సంఘాలూ, సంస్థలూ ఏదైనా చట్ట విహితంగా మనుగడ సాధించడానికి ప్రధానమైన షరతుగా అహింసా విధానాన్ని అమలు జరిపేందుకు ప్రజాస్వామికమైన శాసన సభా వ్యవస్థను ఉపయోగించ బూనుకోవడం గాంధేయ సూత్రాలకు భిన్నమవుతుందని నేను భావించడంలేదు.

ఏదైనా ఒక సంఘం లేక సంస్థ, సామాజిక లేదా ఆర్థిక లక్ష్యాలను హింస ద్వారా సాధించ బూనుకున్నా అలాంటి ప్రయోజనాల నిమిత్తం హింసాయుత పద్ధతులను ఉపయోగిస్తున్నట్లు రుజువైనా, చట్టరీత్యా అది చెల్లుబాటు కాదు అని నిర్దేశిస్తూ శాసనం చేయటం రాజ్యాంగ బద్ధమే అవుతుంది. నక్సలైట్ల ఉద్యమం బయలు దేరటం, కొన్ని కార్మిక సంఘ లు "ఘెరావో"ను ఎదటి వారిపై వత్తిడి తెచ్చేందుకు ఉద్దేశించిన ఇతర విధానాలనూ ఉపయోగిస్తూ ఉండటం దృష్ట్యా ఇలాంటి నిషేధం ఏదైనా సమర్థనీయమే అవుతుంది.

హింసాయుత పద్ధతుల ననుసరించే సంస్థలను చట్టరీత్యా నిషేధించినంత మాత్రాన చాలదు. ఇలాంటి నిషేధాలను ధిక్కరించి హింసాయుత చర్యలకు పాల్పడే వ్యక్తులూ, బృందాలూ ఎటూ ఉండక తప్పదు. ఇలాంటి వారిని పోలీసు బలగంతోనూ, అవసరమైతే సైనిక సహాయంతోనూ అణిచివేయ బూనుకోవడం ఎంతో సులభంగానూ, తెలివిగల పనిగానూ తోచవచ్చు. అయితే ఒక పక్షం వారి హింసను అణచడానికి ఈవిధంగా ప్రతి హింసపై పూర్తిగా ఆధారపడినట్లయితే అసలు ఆ హింసావాదుల ఉచ్చులో చిక్కుకున్నట్లే కాగలదు.

దేశమంతటా విద్యార్థులూ, కార్మికులూ, కర్షకులూ హింసాపరులతో సహాయనిరాకరణం జరిపేట్లుగానూ, హింసను అహింసాయుత పద్ధతుల ద్వారా నిరోధించేట్లుగానూ చూడటం అవసరం. పోలీసులు, లేదా సైనికుల ద్వారా ప్రతిహింసకు పూనుకోవడమనేది ప్రజాస్వామిక వ్యవస్థా పరిరక్షణలో కనీసపు మేరకు మాత్రమే ఉండేట్లు చూడటం మంచిది

సామర్థ్యం

హింసను నిరోధించడం తర్వాత ఈనాడు అత్యవసరమైనది సామర్థ్యం. గాంధీజీ మొత్తంమీద వెనకటి వ్యవస్థనూ, పద్ధతులనూ అనుసరిస్తూండినప్పటికీ కొందరు ఆయనను అభివృద్ధి నిరోధకుడుగా పరిగణించినప్పటికీ కూడా నిజానికి ప్రపంచం మొత్తం మీద అత్యంత సమర్థవంతంగా పని సాగించిన రాజకీయ నాయకులలో గాంధీజీ ఒకరు. తన రాజకీయ జీవితంలో ఆయన ఎన్నడూ వేళ తప్పనిచ్చేవారు కాదు. అనుకున్న పని ఏదయినా సరిగా ఆ వేళకు జరగవలసిందే. నిర్ణయాలు వేటినైనా బహు త్వరగా తీసుకోగలిగేవారు. వృథాకాలయాపన ఏదీ లేకుండా ఎప్పటికప్పుడు తగు చర్యలు తీసుకుంటూ ఉండేవారు. డబ్బు వసూళ్ళకూ, ప్రజాహిత కార్యాలకు చేసిన ఖర్చుకూ సంబంధించిన లెక్కలన్నిటినీ పూర్తి వివరాలతో, పొరపాట్లు కాకుండా వ్రాసి ఉంచాలని నిష్కర్ష చేసేవారు. మన దేశనాయకులందరూ గాంధీజీ మోస్తరే సామర్థ్యంతో పని చేసే వారే అయితే, మనం ఇంకా ఎంతో ఎక్కువ ప్రగతిని సాధించి ఉండేవారం. ప్రజా జీవనంలోనే కాక వ్యక్తిగత జీవితంలో సైతం నిజాయితీ అన్నది అతి ముఖ్యమని బాపూ భావించేవారు. నిజానికి ఆయనకు వ్యక్తిగత జీవితమన్నదిలేదు. ఆయన ఏది చేసినా బహిరంగంగా చేసేవారు. దాపరికం అనేది ఉండేదికాదు. ప్రతివారూ ఈమేరకు ఆయనను అనుసరించటం అవసరం. ప్రతివారూ జీవితంలో నీతి నిజాయితీలను చూపడం, నిష్కళంక వర్తన నలవరుచుకోవటం ముఖ్యం.

నైతిక విలువలను పాటించనిదే నిజమైన పురోభివృద్ధి సాధ్యపడదనీ, ఈ విలువలను పునరుద్ధరించాలీ అంటే. కష్టించి పని చేయటం, నిష్కామకర్మకు పూనుకోవటం, నిరాడంబర జీవితం గడపటం, ఐహిక వాంఛలకంటె ఆధ్యాత్మిక ధ్యేయాల పట్లనే హెచ్చు శ్రద్ధ చూపడం అవసరమని గాంధీజీ అభిప్రాయం.

అధికార వికేంద్రీకరణ జరగాలని కూడా గాంధీజీ అనేవారు. గ్రామాలూ, పట్టణాలూ స్వయం సమృద్ధిని సాధించి వాటి వ్యవహారాలనవి చూసుకోగలిగి ఉండాలనీ, అనేక గ్రామాలకూ పట్టణాలకూ ఉమ్మడిగా సంబంధించిన అంశాల విషయంలోనే రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలనీ, అలాగే వేర్వేరు రాష్ట్రాలకు సంబంధించిన ఉమ్మడి వ్యవహారాల్లోనే కేంద్రం జోక్యం చేసుకోవాలనీ ఆయన చెప్పేవారు.

పెడదారి పట్టకుండా, సక్రమంగా, అనుకొన్న పని జరిగే విధంగా ఈ కృషిని సాగించవలసి ఉన్నది.



ఆర్థిక వేత్తగా గాంధీజీ

డా॥ వి. ఆర్. భట్టాచార్య

మన దేశపు ఆర్థిక వ్యవస్థ, ఆ మాటకు వస్తే యావత్ప్రపంచపు ఆర్థిక వ్యవస్థ అనేది, ఎవరూ కూడా అన్న వస్త్రాలకు బాధపడని విధంగా ఉండాలనే అంటే, జీవయాత్ర సాగించడానికి చాలినంత ఒరుమానం లభించేందుకు తగిన పని ప్రతివారికి దొరకాలని భావం. అత్యావసర వస్తూత్పత్తి సాధనాలు యావత్తు సమాజం అదుపాజ్ఞలలో ఉన్నప్పుడే ఈ ఆదర్శం నెరవేరడానికి వీలుకలుగుతుంది.

మానవజాతి అందరి పట్లా గాంధీ మహాత్మునికి అపారమైన ప్రేమాభిమానాలు ఉండేవి. వ్యక్తికీ వ్యక్తికి మధ్య వ్యత్యాసం చూపటం ఆయనకు కష్టమవుతూ ఉండేది. సమతాదృష్టి అనేది ఆయన సహజగుణం, సామ్యవాదులుగా పేరెన్నికగన్న వారందరి కంటె చాలా విధాల ఆయన మిన్న అని చెప్పవలసి వస్తుంది. 'వ్యక్తికి సహజమైన అవసరాలు మాత్రం (అంతకు మించికాదు) తీరేందుకు కావలసిన హంగులన్నీ ఆ వ్యక్తికి లభ్యమయ్యేట్లు చూడటమే, వనరులను సమానంగా పంపిణీ చేయడమనే సూత్రాన్ని నిజంగా ఆచరించి చూపడం అవుతుంది. ఉదాహరణకి, ఒక వ్యక్తికి జీర్ణశక్తి తక్కువ అనుకోండి. అతనికి పావుకిలో బియ్యం చాలు. మరొకరికి అర్థకిలో అవసరమవుతాయి. వీరిద్దరూ తమ అవసరాలను తీర్చుకో గలిగి ఉండాలి. ఈ ఆదర్శస్థితి నిజంగా ఏర్పడాలి అంటే, సామాజిక వ్యవస్థ రూపురేఖలనే మార్చివేయవలసి ఉంటుంది' అన్నారు గాంధీజీ.

అయితే ఈ సూత్రాన్ని అమలు పరచడంలో ఉండే ఇబ్బందులను సైతం ఆయన గ్రహించారు. ఆర్థిక వ్యవస్థాపరమైన తన సిద్ధాంతాలు వేటినైనా, కేవలం వల్లెవేయటం కాక, ఆచరణలో పెట్టిచూపెట్టారు. ఇతరులు కూడా అందుకు శ్రద్ధగా ప్రయత్నించా లనేవారు. ఏదైనా ఒక దేశంలో సంపద సమానంగా పంపిణీ కావాలంటే అక్కడి ప్రజలు ఎదుర్కొవలసి వచ్చే బ్రహ్మాండమైన కష్టాలు ఏమిటో గాంధీజీ గ్రహించక పోలేదు. అందుకై, ఆర్థిక పరమైన తన ధ్యేయాన్ని సవరించుకున్నారు. 'సంపద స… సమానంగా పంపిణీ కావాలనే నా అభిమతం. అయితే అ… సాధ్యపడుతుందని తోచదు. కనుక సంపద, న్యాయమైన విధంగా పంపిణీ అయ్యేట్లు చూడడానికి పాటుబడతాను' అన్నారు.

సామ్యవాది

వస్తూత్పత్తి సాధనాలేవైనా, యావన్మంది ప్రజల యాజమాన్యంలో ఉండాలని గాంధీజీ భావించేవారు. ఆ మేరకు, ఆయన సామ్యవాది లక్షలాది దేశవాసులతో ముఖాముఖి పరిచయం ఉండటంవల్ల ఆయనకు, పేదవారి, తదితర దళిత వర్గాలవారి దైనందిన సమస్యలూ, కష్టాలూ ఏమిటో స్వయంగా గ్రహించేందుకు చక్కటి అవకాశం లభించేది. జనబాహుళ్యానికిగల ఆర్థిక సమస్యలను పరిష్కరించడానికై ఏదో ఒక సిద్ధాంతాన్ని సూచించడం అనేది ఆయన పద్ధతికాదు. లక్షలాది ప్రజల ఆక్రందనలను, ఆవేదనలను, ఆయన బహిర్గతం చేసేవారు. వాటికి రక్షణ పరిష్కారం లభించాలనేవారు

సంపద యావత్తు, ఏ ఒక్క దేశంలోనో ఏ కొద్దిమంది చేతులలోనో కేంద్రీకృతం కారాదనీ, ఒక దేశం, తన స్వప్రయోజనార్థం ఇతర దేశాలను అన్యాయం చేసి కొల్లగొట్టరాదనీ గాంధీజీ ఉద్ఘాటించారు. ప్రజాబాహుళ్యానికి నిత్యజీవితంలో అవసరమైన సరుకు సామగ్రుల విషయంలో

ఏ ఒక్క దేశానికో, ఒక వర్గానికో గుత్తాధికారాలు ఉండటం అన్యాయంగా పరిగణించేవారు. శ్రామిక వర్గాలకూ, ఇతర దళిత వర్గాలకూ జరుగుతూ వస్తున్న అన్యాయాలు తొలగి పోవాలనీ, సమాజంలో ఒకరికి, మరొకరికి మధ్య వ్యత్యాసాలు సమసి పోవాలనీ వాదించేవారు.

సామ్యవాదం కంటె మానవతావాదం మిన్న

గాంధీజీ ఆలోచనలూ, సిద్ధాంతాలూ, సామ్యవాదం కంటె మానవతా వాదం వైపే చివరకు మొగ్గుచూపుతాయి. జనబాహుళ్యం యోగక్షేమాల పట్ల ఆయన ఎంతో ఆసక్తి కనబరిచేవారు. దేశంలోని కోట్ల కొలది ప్రజాసామాన్యాన్ని ముఖాముఖి కలుసుకుని ప్రత్యక్ష సంబంధం ఏర్పరుచుకున్న బహు కొద్ది మంది నాయకులలో గాంధీజీ ఒకరు. ఆర్థికపరమైన గాంధేయ సిద్ధాంతాలను పరిశీలించేప్పుడు, ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకోవలసి ఉంటుంది. తన దేశం ఆర్థికంగా పునరుజ్జీవితం కావాలి, అని ఆయన అన్నారూ అంటే, అది కేవలం ఒక మేధావిగా, సూత్రకారుడుగా చెప్పిన మాటకాదు. ప్రజలందరి పట్ల, వారి శ్రేయస్సు పట్ల తనకుగల ఆవేదననూ, ఆరాటాన్నీ వెలిబుచ్చటమే అది. ఈ దృష్ట్యానే, సమాజానికి జరుగుతున్న అన్యాయాలను ఆయన పేర్కొన్నప్పుడు, మన దృష్టికి ఆయన సామ్యవాదిగా గోచరిస్తారు. అయితే మనదేశంలో వేర్వేరు మతాలు, వాటివి పురస్కరించుకుని ఆచారాలు, సంప్రదాయాలు ఎంతగాఢంగా వేళ్ల పాతుకు పోయినది ఆయన విస్మరించలేదు. దేశంలో ప్రతివారికి మనుగడ సాగించే హక్కు ఉన్నదనీ, అన్న వస్త్రాలనూ, వసతి సదుపాయాన్నీ సమకూర్చుకునేందుకు కావలసిన వనరులు వారికి లభించాలనీ గాంధీజీ ఏనాడో అన్నారు. అయితే ఈనాడు మన ఆర్థిక వేత్తలు,పారిశ్రామికంగా ముందుకు సాగిన ఇతర దేశాలతో సమంగా ప్రగతి సాధించాలనే ఆరాటంలో ఈ విషయాన్ని పట్టించుకోనేలేదు. ఫలితంగా నిరుద్యోగ సమస్య అంతకంతకు తీవ్రతరమవుతున్నది.

మన దేశానికి స్వాతంత్ర్యం లభించడానికి కొద్దిరోజులుముందు ఒకానొక సందర్భంలో, సామ్యవాదం అన్న పదం ఎంతో ఇంపైనది. నాకు బోధపడినంతవరకు, సామ్యవాద వ్యవస్థలో, సమాజంలో యావన్మంది సరి సమానులే. ఒకరు ఎక్కువ లేదు, మరొకరు తక్కువలేదు; మానవ శరీరంలో, తల పైన ఉంటుంది కనుక అది ఉన్నతమవలేదు. అలాగే, మడమలు నేలకు ఆనుతవి కనుక అవి నీచము కాలేదు. శరీరంలోని అన్ని అంగాలు సరిసమానమయినట్లుగానే, సమాజంలోని వారందరూ సరిసమానులే. సామ్యవాదమంటే ఇదే అని గాంధీజీ వ్రాశారు.

నిర్మల వర్తనం ద్వారానే ఈ అపూర్వ లక్ష్యాన్ని సాధింపవీలున్నది. "సామ్యవాదమన్నది స్ఫటికమంత నిర్మలమయింది. దానిని సాధించేందుకు స్ఫటికమంత స్వచ్ఛమైన సాధనాలే పనికి వస్తాయి. విధానాలు కల్మషమైనవయితే, ఫలితం కూడా అలాగే ఉంటుంది. రాజునూ పేదనూ సమానులుగా చేయడానికి రాజు తల నరికివేయము. అలాగే, యజమానికి కార్మికునికి మధ్యగల అంతర్యాన్ని తొలగించడానికిసైతం, ఈ'నరికివేత' పనికి రాదు. సత్యాన్ని అసత్య వర్తనం ద్వారా సాధించలేము. సత్యమనే గమ్యాన్ని సత్యాశ్రయమైన ప్రవర్తన ద్వారానే చేరుకోగలం" అన్నారు గాంధీజీ.

సింహావలోకనం

ఆర్థికశాస్త్ర పరంగా గాంధీజీ భావాలనూ, సిద్ధాంతాలనూ పరిశీలించినప్పుడు తేలింది ఏమిటి ? వారి "విలువను గురించి నిర్ణయించినప్పుడు" ఒక్క విషయం స్పష్టమవుతుంది. మనదేశంలోనే కాక యావత్ ప్రపంచంలోనే కోట్లకొలది జనబాహుళ్యం భాగ్యవంతులవడానకి, వారి స్థితిగతులు మెరుగవడానికి ఒక సరికొత్త మార్గం మనకు ఆయన బోధలలో,సిద్ధాంతాలలో, కన్పిస్తుంది. ఇప్పుడు కాకపోయినా, మరి ఒకటిరెండు దశాబ్దాల తర్వాతనైనా, మనఆర్థికశాస్త్ర వేత్తలు, భారత దేశం ఆర్థికంగా పునరుజ్జీవనం పొందడంగురించి ఆయన ప్రవచనాలను వివరంగా పరిశీలించినప్పుడె నా గాంధీజీ ఆర్థిక సూత్రాలకు సముచితస్థానం లభించకపోదు.

రాజకీయవేత్తల కృషి ముగిసినప్పుడు గాంధీజీ కృషి మొదలవుతుంది. ప్రజల ప్రాపంచిక వాంఛలు అవసరాలు తీరడానికి రాజకీయవేత్తలు ప్రధానంగా పాటుబడరాదు. మానవునిలో సంపూర్ణ వికాసం సాధించాలని గాంధీజీ ఆశయం. ఆయన దృష్టిలో మానవుడు దైవసమానుడు. అనంతుడు. కాని ఇంతమాత్రంచేత మానవ జీవితంలో యదార్థాలు ఆయనకు తెలియకపోలేదు. ఆయన దృష్టి సుదీర్ఘమైనది. తక్షణ ప్రయోజనాలతోనో, సమస్యలతోనో కుంచించుకు పోయేదికాదు.

భారత దేశ ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయమే వెన్నముక అని ఆయన విశ్వసించేవారు. భూమి, దున్నేవారిది కావాలనీ, సహకార సంఘాలు వ్యవసాయరంగంలో సముచిత పాత్ర వహించాలనీ అనేవారు. పరిశ్రమల విషయంలో, కేంద్రీకరణ జరగాలనీ, ఏ ప్రాంతానికి ఆ ప్రాంతం స్వయం సమృద్ధిని సాధించాలనీ అనేవారు. కార్మికులకెవరికైనా, జీవనం గడపడానికి అవసరమైన కనీస వేతనం తప్పనిసరిగా లభించాలనేవారు.

సమాజంలో ఒకరి పట్ల ఒకరు అభిమానంతో, సామరస్య పూర్వకంగా, నమ్మకంతో వ్యవహరించాలన్నదే గాంధీజీ ఆర్థిక సిద్ధాంతాలన్నిటిలోని ప్రధానసూత్రం. భారతీయ సంస్కృతికి ప్రాతిపదిక అనదగిన ఈ ప్రేమాభిమానాలూ, సదవగాహనే ఆయన ఆర్థిక సిద్ధాంతాలకు సైతం ఆయువు పట్టు.

బాపూ

కలుషపు పిస్తోలు గుండు కడుపులోన దాచి
కారుణ్యపు క్షమాకరము గగనవీథి జాచి
మహిని ప్రసారితమొనర్చి అహింసయను నీతి
దీవించి, గతించితీవు, భావి భారతజాతి.

సత్యాగ్రహ ఖడ్గమ్మున సంకెలలను త్రెంచి
రాట్నచక్రమున దాస్యపు రాటను ఛేదించి
భారతమున నవ స్వతంత్ర భూరుహమును నాటి
ప్రజల కొసగి, చేరితి నిస్వార్థ స్వర్గవాటి.

శిలువ మీది ఏసు వీవె, చిరంజీవి బాపూ !
విషచషకపు సోక్రటీసు నీవు కావా బాపూ !
కాళరాత్రతగర్భదీప్తి, కలి కృతయుగ సంధీ
కరుణాకంధి, శాంతి పంథి, కర్మ వీర గాంధీ !

నీ చితికడ భారతమె వినీత శిరస్కమ్మై
పాప ప్రక్షాళనకై ప్రార్థించును సతము
నీదు చితా భస్మమే పునీత జీవదమ్మై
ఫలప్రదమొనర్చుత మా స్వాతంత్ర్య వ్రతము.

అరిగితీవు స్వాతంత్ర్యము అడుగు మోపినంత,
అరిగి రిరువదేండ్లలోన అతిరథులంతంత
అనాథమై నవభారత మంతరింపకుండ
ఆశీస్సుల నొసగి బాపు, అగుము మాకు అండ !

జాతి పితా, కైమోడ్పుల్చేతుమోయి నేడు
శ్రద్ధాంజలి ఘటించి నీ శత జయంతి నాడు
ప్రజా హృదయ ఫలకమ్మున ప్రత్యక్షము కమ్మ,
సత్యమార్గమనుసరించు శక్తిని మాకిమ్మ.

సమభావము, సమయోగ్యత, సమ సంపదగూర్చి
సమాజమును సామరస్య సంపూర్ణ మొనర్చి
సర్వమనుజ సౌభ్రాత్రము సంతరించి జగతి
వరమొసగుము వర్ధిలగా భారతీయ ప్రగతి !

మల్లవరపు విశ్వేశ్వరరావు

తెలుగు వారిపై మహాత్ముని ప్రభావం

చాపలి రామమూర్తి

భారతదేశంలో జన్మించిన ప్రతి మతానికీ ఉద్యమానికీ సంఘర్షణకూ 'లేదు కాదు' అనకుండా తెలుగువారికి ప్రత్యక్ష సంబంధము వుంది. ఇది చరిత్రనుండి సూక్ష్మంగా తెలుసుకొనుటకు వీలైన సత్యం. బౌద్ధమతం ఉద్భవించినప్పుడు తెలుగు దేశంలో చిరకాలం రాజాదరణ పొంది ఆచార్య నాగార్జునుని చేతులలో పరాకాష్ఠనందుకొన్నది. అందుచేతనే మన తెలుగు దేశంలో కృష్ణా, గుంటూరు మండలాలలో లెక్క లేనన్ని బౌద్ధస్తూపాలు, గుహలు వున్నవి. శంకర్ భగవత్ పాదులు తమ జైత్రయాత్ర సాగించినప్పుడు తెలుగు దేశంలో వారికి లభించిన ఆదరణ, శిష్యపరంపర వేరొకచోట లభించలేదు. వంగదేశంలో రాజా రామమోహనరాయల వారితో ప్రారంభమైన సంఘ సంస్కరణ ఉద్యమాలు అన్నీ తెలుగు దేశంలో విశేషమైన ఆదరణ పొందినవి. కందుకూరి వీరేశలింగం పంతులుగారు సంఘ సంస్కరణకై చూపిన శ్రద్ధ, కృషి అనన్య సామాన్యమైనదై, జాతి చరిత్ర యందు ఆయన పేరు సువర్ణాక్షర లిఖితమై శాశ్వతస్థాన మాక్రమించుకొన్నది. గాంధీమహాత్మునికి చాలాకాలం క్రిందటనే, గురజాడ అప్పారావు పంతులుగారు మానవతావాదులై అస్పృశ్యతను ఆక్షేపిస్తూ వ్రాసిన పంక్తులు తెలుగు జాతికి అభ్యుదయంపట్ల కల అభిమానమును వేనోళ్ల వ్యక్తపరచినవి.

"మలిన దేహుల మాలలనుచును
మలిన చిత్తుల కధిక కులముల
నెల వొసంగిన వర్ణధర్మ మధర్మ ధర్మంబే"

గాంధీ మహాత్ముడు ప్రారంభించి సాగించిన ఉద్యమాలన్నీ తెలుగు వారిచే ఆదరింపబడినవి. తెలుగు వారు మహాత్ముని అడుగు జాడలలో నడచి, ఎవ్వరికి తీసిపోక, భారత మాత దాస్య విమోచన కొరకు అనన్య సామాన్యమైన కృషితో త్యాగాలు చేశారు, పాఠశాలలు విడచి, కోర్టులు బహిష్కరించి, కచేరీలు వదలి, మిల్లు బట్ట కట్టుటమాని సూత్రయజ్ఞము స్వీకరించి, హరిజనోద్ధరణకు కంకణము కట్టి జీవితము తృణప్రాయంగా ఎంచి ఇంగ్లీషు వారి తుపాకీ గుండ్లకు ఎదురు తిరిగి నిలిచారు తెలుగువారు. వృత్తి ఏదీ



స్వీకరించక స్వతంత్ర సమరంలో అహర్నిశలు నిమగ్నులై పోవుటవల్ల అనేక తెలుగు కుటుంబాలు ఆస్తిపాస్తులు పోగొట్టుకొని కడకు నిలువ నీడ లేక, ఆదరించు వారు లేక పోయిననూ మాతృదేశ విమోచనకు కృషిసల్పిధన్యజీవుల మైనామనుసంతృప్తిని పొంది సంతోషించ కలిగినారు. గాంధీమహాత్ముడు భారత రాజకీయ రంగమున ప్రవేశించడానికి పూర్వమే పలువురు ఆంధ్రులు భారత జాతీయ కాంగ్రెస్‌తో సన్నిహితులుగా వుండేవారు. వీరిలో కొందరు తిలకు మహాశయుని ఆదరణ, మరికొందరు గోఖలే మహోదయుని అభిమానమును చూరగొన్నారు పప్పూరి ఆనందాచార్యులు, టంగుటూరి ప్రకాశం పంతులుగారు మొదలైన తెలుగు మేధావులెందరో 1907వ సంవత్సరపు సూరతు కాంగ్రెస్‌లో

పాల్గొన్నారు. వీరందరు కాంగ్రెస్ సంస్థయందు ఎక్కువ అభిమానం కలవారై అతివాదులుగానో మితవాదులుగానో వుండేవారు. గురజాడ అప్పారావుగారు తెలుగులో వ్యవహారిక భాషలో వ్రాసిన "కన్యాశుల్కము" నాటకంలో జాతీయ కాంగ్రెస్‌ను, సురేంద్రనాథ్ బెనర్జీమహాశయుని పొగిడారు. కన్యాశుల్కము 1892 వ సంవత్సర ప్రాంతమున వ్రాయబడిన సాంఘిక భాషావిప్లవ నాటకము.

తెలుగు వారిలో గాంధీమహాత్మునిచే ఎక్కువగా కొనియాడబడిన వారు కొండా వెంకటప్పయ్య పంతులుగారు. వీరు గాంధీ మహాత్మునికన్న వయస్సున పెద్దవారు. మహాత్ముడు సాగించిన ఉద్యమాలన్నిటిలోనూ వెంకటప్పయ్య పంతులుగారు నాయకులుగా వున్నారు. వారు కొంత కాలము భారతజాతీయ కాంగ్రెస్‌కు కార్యదర్శి గానూ, కొంత కాలము తాత్కాలిక అధ్యక్షులు గానూ వ్యవహరించారు. మహాత్మునికి సన్నిహితులగుటకు పూర్వము వీరు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రంకోసం కృషిచేశారు. మహాత్ముని సాహచర్యమువలన, తమ అభిమతములో మార్పును కలిగించుకొని, స్వరాజ్యము ముందర రావలయుననియు, తరువాత స్వరాష్ట్రము ఏర్పడగలదనియు విశ్వసించారు. వారి దేశ భక్తికి చిహ్నముగా మహాత్ముడు వారికి 'దేశభక్త' అను బిరుదము నిచ్చి తమ ప్రేమను వ్యక్తపరచారు. వెంకటప్పయ్య పంతులుగారు 1948వ సంవత్సరము ఆగస్టు 15 వ తారీఖున ఈశ్వర సాన్నిధ్యము చేరారు.

కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు గొప్ప దేశభక్తులు, నిరాడంబరజీవి, గాంధేయవాది, దాత, కర్మిష్ఠి, హరిజనోద్ధారకుడు, సాహిత్యవేత్త, భాషాభిమాని, భాషాపోషకుడు. ఆంధ్ర పత్రికను స్థాపించి, తద్వారా ప్రజల్లో మహోజ్వలమైన చైతన్యమును రేకెత్తించారు. వెంకటప్పయ్యగారి వలెనే వీరును మహాత్మునికన్న పెద్దవారే. వారి దాతృత్వమునకు మెచ్చి మహాత్ముడు 'విశ్వదాత' బిరుదు యిచ్చారు.

భాష్యకారుడు పట్టాభి

తెలుగు మేధావులలో డాక్టరు భోగరాజు పట్టాభి సీతారామయ్యగారు అగ్రగణ్యులు. వీరు వైద్యశాస్త్రమున పట్టము పొంది బందరులో వైద్యవృత్తి చేస్తుండేవారు. ఆయన బహుభాషావేత్త, చమత్కారి, హరిజనోద్ధారకుడు, జాతీయవాది. మహాత్ముని, ఆంతరంగికులలో నొకరుగా వుండి గాంధీ సిద్ధాంత భాష్య కారుడుగా ప్రసిద్ధికెక్కారు. కాంగ్రెసు అధ్యక్షుడుగా పోటీచేసి ఓడినప్పుడు పట్టాభిగారి అపజయమును తనదిగా మహాత్ముడు స్వీకరించాడు.

గాంధేయ సిద్ధాంతములను తూ.చా. తప్పక జీవితాంతము పాలించిన మరొక తెలుగువ్యక్తి మహర్షి బులుసు సాంబమూర్తిగారు. వీరు కాకినాడలో పుష్కలంగా డబ్బు లభించే న్యాయవాద వృత్తిని త్యజించి భారత స్వాతంత్ర్య సమరరంగములో దుమికారు. 1924 వ సంవత్సరంలో కాకినాడలో మహమ్మదాలీ అధ్యక్షతను జరిగిన భారతజాతీయ కాంగ్రెస్ మహాసభల ఆహ్వాన సంఘకార్యదర్శిగా విశేషమైన కీర్తి ప్రతిష్ఠలు సంపాదించారు. మహాత్ముల ప్రశంసలు అందుకొన్న ప్రథమశ్రేణి నాయకులువీరు. 1937 వ సంవత్సరంలో ఉమ్మడి మద్రాసురాష్ట్రంలో, 1935 వ సంవత్సరపు రాజ్యాంగచట్టము ననుసరించి, శ్రీమాన్ చక్రవర్తి రాజగోపాలాచార్యులు వారు ఏర్పాటు కావించిన ప్రభుత్వంలోని శాసనసభకు వీరు 'స్పీకరు' గా ఎన్నుకొనబడ్డారు. వారు మహాత్మునివలె ఖద్దరు కొల్లాయిగుడ్డ ధరించి, అంగవస్త్రము వేసుకుని నిరాడంబర వేషధారణతో గడిపేవారు.

ఆంధ్ర కేసరి

టంగుటూరి ప్రకాశం పంతులుగారు మహాత్ముని పిలుపు ననుసరించి సాలుకు నలుబదివేలు వచ్చే న్యాయవాదవృత్తికి స్వస్తిపలికి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని, పలుబాధలకు లోనై స్వపర జనులచే, "ఓహో" అనిపించుకొన్న మానవకేసరి. స్వతస్సిద్ధముగా అతివాది అయినా మహాత్ముని బోధనలకు లోనై నమ్రతతో మితవాదిగా మారినారు. త్యాగధనుడు. స్వాతంత్ర్య పిపాసి. వారికి తెలుగునాట గల పలుకుబడి విశేషమైనది. ప్రజలలో స్వరాజ్యకాంక్ష పెంపొందించడానికి "స్వరాజ్య" అను ఆంగ్ల దినపత్రికను స్థాపించి, అపారమైన కీర్తి నార్జించి "ఆంధ్రకేసరి" కాగలిగారు. ప్రకాశమే ప్రజలు, ప్రజలే ప్రకాశము అనిపించుకొన్నారు. 1946 లో ఉమ్మడి మద్రాసు రాష్ట్రమునకు ముఖ్యమంత్రిగా, గాంధేయమార్గము ననుసరించి, ఆర్థిక, సాంఘిక అసమానతలు వైదొలుగుటకు ఫిర్కా డెవలప్‌మెంట్ పథకమును, హరిజనోద్ధరణ కార్యక్రమమును చేపట్టారు.

శ్రీమతి సరోజినీనాయుడు మహాత్ముని కన్నకూతురువలె మెలగిన హైదరాబాదు వాస్తవ్యురాలు. ఆంగ్లభాష యందు అద్వితీయమైన ప్రవేశం కలిగిన సరోజినీ దేవి తన గాన మాధుర్యంతో ప్రజలలో ఉత్తేజము కలుగు ఉపన్యాసాలుచేసి ప్రజలు స్వాతంత్ర్య సమరంలో పాల్గొనునట్లు చేసింది. 1925 వ సంవత్సరమున కాంగ్రెసు అధ్యక్ష పీఠమలంకరించింది.

మహాత్ముని ప్రబోధాలలో ముఖ్యమైనది హరిజనోద్ధరణ, రెండవది సత్యాగ్రహము. వీటికొరకు తెలుగు దేశంలో చాలా కృషి జరిగింది. ఈ ప్రబోధం ప్రజలలో విస్తరింపజేయుటకు డా. బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యంగారు, రాజమహేంద్రవర సమీపంలో సీతానగర గ్రామమున సత్యాగ్రహ ఆశ్రమం ఏర్పాటు చేశారు. ఈఆశ్రమం హరిజనోద్ధరణకు, సత్యాగ్రహోద్యమము జయప్రదమగుటకు కీలక స్థానంగా పనిచేసింది. గొల్లపూడి సీతారామ శాస్త్రి గారు గుంటూరు మండలంలో ఆశ్రమం స్థాపించారు.

శ్రీ శాస్త్రి గారు గృహస్థాశ్రమము విడిచి స్వామీ సీతారాములై నిర్యాణము నొందువరకు గాంధేయ తత్వమును ప్రబోధించారు.

దుగ్గిరాల గోపాల కృష్ణయ్య స్వాతంత్ర్య పిపాసి. అఖిల భారత కాంగ్రెసుకు కొంతకాలం కార్యదర్శిగా వున్నారు. "శ్రీరామదండు" అను పేర ఒక విప్లవ సంఘమును స్థాపించారు. 1921 వ సంవత్సరమున మహాత్ముడు విజయవాడ వచ్చినప్పుడు శ్రీరామ దండు చేసిన సేవలు మహాత్ముని ప్రశంసలను చూర కొన్నవి. అహింస, పాతివ్రత్యము, బ్రహ్మచర్యము, భగవత్ భక్తి, స్వయం కృషి, పరిశుభ్రత, సౌభ్రాతృత్వము, సహనము మొదలగు గాంధేయ భావములే గోపాల కృష్ణయ్య గారి బోధనలు.

జాతీయ పతాక నిర్మాత

పింగళి వెంకయ్య గారు గొప్ప దేశ భక్తుడు. కృష్ణా జిల్లా నివాసి. మనకు జాతీయ పతాకమును సమర్పించిన మహనీయుడు. జీవితాంతము కష్టములైనను భరించెనుకాని గాంధేయ ప్రబోధములను విడనాడలేదు.

పొట్టి శ్రీరాములు గొప్ప హరిజన సేవకుడు. స్వామి శీతారామ్ ప్రియ శిష్యులు. నిరాడంబర జీవి. మహాత్ముని ప్రవచనములలో ముఖ్యమైన నిరాహార దీక్షను వహించి ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం ప్రసాదించారు.

మా కొద్దీ తెల్లదొరతనము

గరిమెళ్ళ సత్యనారాయణగారు గాంధేయ మతమును తూ.చా తప్పక ఆచరించిన వారు. ఈయన వ్రాసిన "మా కొద్దీ తెల్ల దొరతనము" "దండాలోయి బాబు దండాలోయి" వంటి గేయాలు స్వాతంత్ర్యాభిమానాన్ని రేకెత్తించి, ప్రజలను సమర రంగంలో పాల్గొనునట్లు చేసినవి.

మాగంటి బాపినీడు గారి భార్య అన్నపూర్ణా దేవి మహాత్ముని ప్రశంసలను పొందిన మహిళామణి. మహాత్ముని కోరికననుసరించి సమస్త ఆభరణములను దేశాభ్యుదయానికై కానుకగా సర్పించిన త్యాగశీలి. బీదల అభ్యుదయము కొరకు హరిజనుల ఉద్ధరణ కొరకు విశేషమైన కృషిచేసినది. ఈ మెను మహాత్ముడు తన దత్త పుత్రికగా చూచుకొన్నాడు.

బందరులో ఆంధ్ర జాతీయ కళాశాలను స్థాపించిన కొంపెల్ల హనుమంతరావు గారు, నెల్లూరు మండలమున పినాకినీ సత్యాగ్రహ ఆశ్రమమును నెలకొల్పిన దిగుమర్తి హనుమంతరావు గారు, పశ్చిమ గోదావరి జిల్లా వాస్తవ్యులు, హరిజన సేవకులు అయిన చక్రయ్య గారు, మహాత్ముని ప్రశంసల నందుకొనిన వారిలో ముఖ్యులు.

దక్షిణ భారతంలో_అందునా, ముఖ్యంగా ఆంధ్రదేశంలో హిందీ ప్రచారానికి కృషిసల్పినవారు శ్రీ మోటూరు సత్యనారాయణ గారు. మహాత్ములు హిందీని జాతీయభాషగా నిర్ణయించిరి. ఈ విషయంలో సత్యనారాయణగారు చేసినకృషి అనన్య సామాన్యమైనది.

దండి సత్యాగ్రహి

శ్రీ సాధు సుబ్రహ్మణ్యంగారు దండి సత్యాగ్రహంలో పాల్గొనిన ఏకైక ఆంధ్రుడు. గొప్ప గాంధేయవాది. అచంచల దేశభక్తుడు. హరిజనోద్ధరణ బద్ధకంకణుడు. సర్వోదయవాది.

శ్రీ వావిలాల గోపాల కృష్ణయ్యగారు ప్రస్తుతం ఆంధ్ర ప్రదేశ్ శాసనసభ సభ్యులు. గాంధేయులు. నిరంతర ఖద్దరు వస్త్ర ధారి. విదేశాలలో సైతం దేశీయ వస్త్రధారణతో మాత్రమే పర్యటించి మన సంస్కృతికి నాగరికతకు వన్నెతెచ్చిన వారు. నిరాడంబరజీవి. నిష్కల్మష హృదయుడు. నిరంతర ప్రజా సేవకుడు.

శ్రీ తల్లాప్రగడ నరసింహశర్మగారు తొలుత, వీరేశలింగముగారి శిష్యులై తరువాత సత్యాగ్రహ ఉద్యమమున పాల్గొన్నారు. గాంధీస్మారక నిధి సభ్యులు. హరిజనోద్ధారకులు. రాజమహేంద్రవర నివాసి.

సుప్రసిద్ధ సర్వోదయ నాయకులైన ప్రభాకర్‌జీ అనంతపురం జిల్లాలో ఒక పేద హరిజన కుటుంబంలో జన్మించారు. బందరు జాతీయ కళాశాలలో విద్య అభ్యసించి మహాత్మునిజేరి వారి పాద సేవచేయు భాగ్యమును పొందారు. ప్రస్తుతం సర్వోదయ నాయకులుగా ప్రజాసేవ చేయుచున్నారు

శ్రీ వేముల కూర్మయ్యగారను నొక తెలుగు హరిజనుని అయ్యదేవర కాళేశ్వరరావు గారు పుత్రప్రేమతో ఆదరించి విద్యాభ్యాసమునకు ప్రోత్సహించిరి. కాళేశ్వరరావు గారు శ్రీ కూర్మయ్య గారిని ఆదరించుట మహాత్ముని ఆశయ ప్రభావమే. శ్రీ కూర్మయ్య గారు ఉమ్మడి మద్రాసురాష్ట్రంలో కొంతకాలం మంత్రిగా వున్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీమంత్రి శ్రీ తాసేటి వీరరాఘవులు గారను హరిజనుని, బందరు వాస్తవ్యులైన వేమూరి రాంజీ పంతులుగారు ఆదర అభిమానములు చూపి విద్యార్జనకు ప్రోత్సహించిరి. ఈ ప్రోత్సాహానికి కారణం మహాత్ముని ఆశయాల ప్రభావమే.

మహాత్ముని అనుచరులలో గోపరాజు రామచంద్రరావుగారు ప్రముఖ సర్వోదయవాది. వీరిని గోరా అంటారు. గోరాగారు పరమ నాస్తికులు. గోరా, మహాత్ముని మానవతా వాదమునకు ప్రాముఖ్యం ఇచ్చినారు.

గోరాగారు మహాత్మునివలెనే, ఒక్కదోవతి మాత్రమే ధరిస్తారు అంగవస్త్రము వేసుకొంటారు. చొక్కాధరించరు. నిరాడంబర జీవి. ఖద్దరుతప్ప వేరొక బట్ట ముట్టరు. గొప్ప సంఘ సంస్కర్త. గాంధీ స్మారకనిధి సభ్యులు. మహాత్ముని ఆదర్శములను ప్రజాభ్యుదయముకోసం హరిజనోద్ధరణకోసం వినియోగిస్తున్నారు గోరాదంపతులు. ప్రముఖ జాతీయకవి హరిజనులు

అయన శ్రీ జాషువాగారి కుమార్తె శ్రీమతి హేమలతను తమకు కోడలుగా స్వీకరించి తమ కుమారుడగు లవణమున కిచ్చి వివాహం చేశారు.

ఇంకా యెందరో మహాత్మునికి సన్నిహితులైనారు. మహాత్మునితో ప్రత్యక్షంగా సంభాషించి సన్నిహితులైన వారిలో, శ్రీయుతులు అయ్యదేవర కాళేశ్వర రావు, తెన్నేటి విశ్వనాథం, ఆచార్య రంగా, బెజవాడ గోపాల రెడ్డి, కళా వెంకటరావు, కలూరి చంద్రమౌళి, పప్పూరి రామాచార్యులు, కడప కోటిరెడ్డి దంపతులు, కల్లూరి సుబ్బారావు, వరహగిరి వేంకట గిరి, దుర్గా బాయమ్మ, అనంతశయనం అయ్యంగారు ప్రముఖులు.

మాలపల్లి

మహాత్ముని బోధనలను వేనోళ్ళ కొనియాడుచు తెలుగు కవులెందరో మహాత్ముని ఉద్యమములకు సాహితీ సహకారం యిచ్చారు. వీరిలో విశ్వనాథ, తుమ్మల, రాయప్రోలు, జాషువా, దేవులపల్లి, శివ శంకరులు, చిలకమర్తి, బాపిరాజు ముఖ్యులు. గాంధీ మహాత్ముని స్వీయ చరిత్రను ఆత్మకథ అను పేర శ్రీ తుమ్మల సీతారామ మూర్తిగారు పద్యాత్మకముగా రాశారు. దానిని శ్రీ వేలూరి శివరామ శాస్త్రి గారు గద్యంగా వ్రాశారు. ఉన్నవ లక్ష్మీనారాయణగారు 'మాలపల్లి' అను సాంఘిక నవలను వ్రాసి సంఘ సంస్కరణమును, హరిజనోద్ధరణను ప్రచారము చేశారు.

సుప్రసిద్ధ పండితులు వేటూరి ప్రభాకరశాస్త్రి గారు మహాత్ముని ఆశయములచే ప్రభావితులై హరిజనోద్ధరణకు విశేషమైన కృషి చేశారు.

బసవరాజు అప్పారావుగారు తమ కవితా మాధుర్యాన్ని ఊతగా కొని,

"కొల్లాయి కట్టితేనేమి మా గాంధి
కోమటై పుట్టితేనేమి :
వెన్నపూసా మనసు
కన్న తల్లీ ప్రేమ
పండంటి మోముపై
బ్రహ్మ తేజస్సు
బోసినోర్విప్పితే
ముత్యాల తొలకరే
చిరునవ్వు నవ్వితే
వరహాల వర్షమే
చకచక నడిస్తేను
జగతి కంపించేను
పలుకు పలికితేను
బ్రహ్మ వాక్కేను."

అని కొనియాడగా

శ్రీ దేవులపల్లి కృష్ణ శాస్త్రిగారు

"మతమన్నది గాంధీ జీవితమైతే
మతమన్నది లోకానికి హితమైతే
హిందువులం ముస్లిములం
హిందువులం క్రయిస్తవులం
అందరమూ సోదరులం
అందరమూ మానవులం – నారాయణ నారాయణ

అని గాంధీ తత్వాన్ని ప్రచారము చేసారు.

మహాత్మునికి తెలుగువారి యెడల చాలా అభిమానము వుండేది. 1938 లో డాక్టరు సర్వేపల్లి రాధాకృష్ణ గారికి వ్రాసిన లేఖలో తాము ఆంధ్ర రాష్ట్ర స్థాపనకు సుముఖులమని చెప్పారు. 1921 వ సంవత్సరమున తెలుగు దేశంలో పర్యటించిన పిదప, ఆంధ్రులు పౌరుషవంతులనియు, గొప్ప సాంప్రదాయము కలవారనియు, మతము మీద, భగవంతునిమీద విశ్వాసం కలవారనియు త్యాగధనులనియు, వీరివలన దేశానికి జరుగవలసినది చాలా కలదనియు కొనియాడారు.

మహాత్ముడు 1915 వ సంవత్సరమున నెల్లూరును, 1919 వ సంవత్సరమున విజయవాడను దర్శించారు. 1921 లో సర్కారు జిల్లాల్లో పర్యటించారు. 1929 లో సర్కారు జిల్లాలు, తెలంగాణము, రాయలసీమను దర్శించారు. 1933 లో సర్కారు, రాయలసీమ జిల్లాలలోని కొన్ని ప్రాంతములందు పర్యటించారు. 1946 వ సంవత్సరమున ఆఖరిసారిగా సర్కారు, తెలంగాణా ప్రాంతములను దర్శించారు.

ప్రజలకొరకు ప్రజలద్వారా ఏర్పాటుచేయబడిన ప్రజాస్వామ్యం, ఎంత గొప్పవాడైనప్పటికీ ఏ ఒక్క వ్యక్తి ఆజ్ఞానుసారమూ నిర్వహింపబడదు.

మానవ జీవితానికి గాంధీజీ చూపిన కొత్త వెలుగు

—ఆర్. ఆర్. దివాకర్

ఆర్థిక విషయాలమీదా, సాంఘికాభ్యుదయంమీదా గాంధీజీ విధానాలకీ, పద్ధతులకీ యీ నాడు కాలదోషం పట్టిందని చాలా మంది యిటు భారతదేశంలోనూ, అటు విదేశాల్లోనూ భావిస్తున్నారు. 'కొంతమంది అవి అర్థరహితమనీ, అసంగతమైనవనీ అంటూ వుంటారు. అయితే అనేకమందిని కలుసుకుని, అనేక దేశాల్ని సందర్శించి. అనేక మందితో సంభాషించి తెలుసుకున్నది ఏమంటే గాంధీజీని గురించి తెలుసుకోవాలనీ, ఆయనను అర్థం చేసుకోవాలనే కోరిక ప్రజలలో వెనకటికన్న యీనాడు ఎక్కువగావుంది.

ప్రసంగాలనేవి ఎప్పుడూ ఒకరి అభిప్రాయలనే ప్రతిబింబిస్తాయి. ప్రశ్నలువేసి, దానికి సమాధానాలు చెప్పి, చర్చలు జరిపితే విషయాన్ని విపులంగా అర్థం చేసుకోవడానికి వీలవుతుంది. హృదయాల మధ్య సాన్నిహిత్యం, అవగాహన పెంపొందుతుంది. ఒకరిని ఒకరు తెలుసుకోవడానికి వీలవుతుంది.

శ్రీ దేవేంద్ర కుమార్ గుప్త, గాంధీ స్మారక నిధికి కార్యదర్శి. గాంధీ శతజయంతి ఉత్సవ సాధారణ సంఘానికి నిర్వాహక కార్యదర్శి కూడా. మేమిద్దరం కలిసి పర్యటించాం. మా ప్రధాన లక్ష్యాలు రెండు. ఒకటి—మేము సందర్శించే దేశాలలో గాంధీ శత జయంతి ఉత్సవాలను నిర్వహించే సంస్థలను, వ్యక్తులను కలుసుకోవడం. రెండు—సమాజంలో సాంఘికపరమైన ఆర్థికపరమైన మార్పును తీసుకురావడానికై గాంధీ మార్గంలో శాంతి, ప్రజాస్వామ్యం, అహింసలకై కృషిచేస్తున్న వ్యక్తులను, సంస్థలను కలుసుకుని వారితో సంబంధాలను ఏర్పాటు చేసుకోవడం. గాంధీజీని గురించీ, ఆయన పద్ధతులను గురించీ తెలుసుకోవాలన్న ఆసక్తి సర్వత్రా కనిపించడం మాకు ఎంతయినా ఆనందంగా వుంది.



లండన్ అహింసా పాఠశాల

రివరెండ్ కానన్ కూలిన్స్ నెలకొల్పిన "డాక్టర్ మార్టిన్ లూథర్ కింగ్ ఫౌండేషన్" అని ఒకటి వుంది. అహింసాయుత

విధానాలద్వారా సాంఘికపరమైన మార్పులు తేవచ్చునని గాఢంగా విశ్వసించే వ్యక్తి ఆయన, దానికి ఆయన 'క్రిస్టియన్ ఏక్షన్' అని పేరు పెట్టారు. భారత దేశానికి చెందిన శ్రీ సతీష్ కుమార్ సహాయంతో రివరెండ్ కానన్ కూలిన్స్ గారు 'లండన్ అహింసా పాఠశాల'ను ప్రారంభించారు. ఇక్కడ తరచు ప్రసంగాలు, చర్చలు సంభాషణలు కొనసాగుతుంటాయి. ఇటీవల జరిగిన సెషన్‌కు, అరవై-డెబ్బయ్ మంది హాజరవుతూ వచ్చారు. కొన్ని నెలల పాటు యిది జరిగింది.

గత జూన్ 26వ తేదీ సాయంకాలం నాలుగు గంటలవేళ లండన్‌లో నేను కాలు పెట్టడంతోనే ముందుగా నేను చేసిన పని యీ పాఠశాలకు వెళ్ళడం.

అక్కడ ఓ వందమంది మమ్మల్ని కలుసుకోడానికి ఎంతో ఆతృతతో ఎదురు చూడడం మాకు చాలా ఆశ్చర్యాన్ని కలిగించింది. అక్కడ యువకులు వున్నారు, ముసలివాళ్లు వున్నారు. బీదవారూ, ధనవంతులూ, విద్యార్థులూ, విద్యార్థులు కానివారూ—అన్ని రకాల వారూ వున్నారు. గాంధీజీని గురించీ, ఆయన సంఘంలో మార్పులు తేవడానికి అహింసను ఆయుధంగా వాడిన పద్ధతిని గురించీ మా నుంచి తెలుసుకోవాలని ఎంతో ఆతృతతో, ఆసక్తితో మా చుట్టు ముట్టారు. వారితో ఓ నలభై నిమిషాలసేపు మాట్లాడాను. ఆ తర్వాత వాళ్ళను సంభాషణలోకి దింపాను. గాంధీ శత జయంతి ఉత్సవాలను భారత దేశం జరుపుతున్నదంటే అర్థంవుంది. మరి యునెస్కో ఎందుకు జరుపుతుంది? గాంధీ మానవతావాదంలోని సత్యము, అహింసల మీద అంతర్జాతీయ సదస్సులను నిర్వహించడం, తమ తమ దేశాలలో గాంధీ శత జయంతి ఉత్సవాలను జరిపించాల్సిందిగా తను నూట యిరవై అయిదు సభ్య దేశాలను కోరడం, ఎన్నిక చేసిన గాంధీజీ రచనలను వివిధ భాషలలో ప్రచురించడానికి నిధులను కేటాయించడం — ఇవన్నీ యునెస్కో ఎందుకు చేస్తున్నట్లు?

యునెస్కో పిలుపును పురస్కరించుకుని సుమారు వంద దేశాలు అప్పుడే గాంధీ శతజయంతి ఉత్సవాలను యథోచితంగా ఎందుకు జరుపుకుంటున్నాయి?

మార్పునుకోరుతున్న ప్రపంచం

మునుపెన్నడూ లేనంతగా ప్రపంచం యీనాడు ఆర్థిక, సాంఘిక, రాజకీయ రంగాల వ్యవస్థలోనే మార్పురావాలని అభిలషిస్తోంది. యువకులు ముఖ్యంగా విద్యార్థులుకూడా మునుపెన్నడూ కోరనంత గాఢంగా మార్పును కోరుతున్నారు. వారి మనసులు అసంతృప్తి, ఆందోళనతో ఊగులాడుతున్నాయి. దౌర్జన్యాలు, హింసాకాండ, అసంతృప్తి మొదలైనవి వారి ఆలోచనల్లో చోటు చేసుకుంటున్నాయి. ప్రభుత్వాలూ, అధికారంలోవున్న వ్యక్తులూ స్వేచ్ఛా వికాసాలకు ప్రతిబంధకాలుగా వున్నాయని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

గాంధీజీ విలువలు - పద్ధతులు

వీటన్నిటికీ పరిష్కారమార్గం గాంధీజీ అని చెప్పాను వారికి. భారత దేశ స్వాతంత్ర్యానికై గాంధీజీ పోరాడి వుండడంవల్ల గానీ, ఆయన యోగివంటివాడు కావడంవల్లగానీ, హిందువు అవడంవల్ల గానీ, మతంవల్ల ఉద్దీపితుడైన వ్యక్తి కావడంవల్లగానీ దీనికి అర్హుడని నేనుచెప్పడంలేదు. ఆయన క్రొత్త విలువలను ప్రతిష్ఠించారు. ప్రస్తుత పరిస్థితులతో అసంతృప్తి చెందినవారుసైతం ఆ విలువల గురించే మాట్లాడుతుంటారు. అసలు ఆ విలువలనుగురించి వారికే తెలీదు. ఏ విధానాలను, ఏ పద్ధతులను మనం అనుసరించినా అవి సర్వోత్కృష్టమైన ప్రమాణాల పరీక్షకు నిలవగలిగి వుండాలి. మనిషే వీటన్నిటికీ ప్రమాణం. మానవ విలువలే సర్వోత్కృష్టమైనవి. మనిషి స్వేచ్ఛ. ఆత్మగౌరవం, తన శక్తి సామర్థ్యాలను అభివృద్ధి చేసుకునే అవకాశాలు, తను నివసిస్తున్న సమాజాన్నీ, తననూ ఉన్నత పథంలోకి తీసుకుపోయే పరిస్థితులు — యివి ఎట్టి పరిస్థితులలోనూ దెబ్బ తినడానికి వీలులేదు.

మరో ముఖ్య విషయం, తన అంతరాత్మను, తన ఆలోచనలను దృఢ పరచుకొని తనలోని దుష్టశక్తులతో మనిషి పోట్లాడటం ఎలాగో గాంధీజీ నేర్పారు.

ఇంకొక విషయం. వ్యక్తి ఏకాంత జీవి కాదని గాంధీజీ భావించారు. వ్యక్తి తన స్వంత ప్రయోజనానికి కాక సంఘ ప్రయోజనానికి, సంఘ విముక్తికి తోడ్పడాలని బోధించారు. ఆర్థిక, సాంఘిక, నైతిక, ఆధ్యాత్మిక రంగాలలో సైతం సమిష్టి ప్రయోజనానికే పూనుకోవాలి. నలుగురితోనూ పంచుకోవడం, నలుగురితోనూ కలిసి పనిచేయడం ఒక నియమం కావాలి. అంటే ఒక సంస్థలోగాని, దేశంలోగానీ, అంతర్జాతీయ విషయాలలోగానీ ప్రజాస్వామిక పద్ధతే మనకు శరణ్యం అన్నమాట.

మరొక ముఖ్యమైన అంశం — సత్యాన్ని శోధించడానికి' దానిని ప్రతిష్ఠించడానికి జరిపే పోరాట పద్ధతి ఎలా వుండాలో గాంధీజీ చెప్పారు. సత్య ప్రతిష్ఠాపనకై సాగించే పోరాటం చెడుకు వ్యతిరేకంగానూ, అన్యాయానికీ, దోపిడీతనానికీ, అణచివేతకూ వ్యతిరేకంగా సాగించే పోరాటం అహింసాయుత మార్గంలో వుండాలన్నారు గాంధీజీ. అందుకుగాను సమాజంలోని శాంతియుత శక్తులన్నిటినీ సమీకరించాలన్నారు.

అహింస అనేది ఏ ఒక్క వ్యక్తికో, ఏ సన్యాసికో అవసరమని భావించరాదు. వ్యక్తుల సమూహానికీ, మొత్తం మానవాళికీ అది అవసరమని తెలుసుకోవాలి.

గాంధీ వేదం నుండి...

* నేను హిందువుడిని, నువ్వు ముసల్మానువి అనీ, నేను గుజరాతీని నువ్వు మద్రాసీవి అనీ మరిచిపోదాం. భారత జాతీయతా దృష్టితో 'నేను' 'నాది' అనే భావాన్ని విస్మరిద్దాం. అంతా కలిసి కట్టుగా వున్నప్పుడే స్వాతంత్ర్యం లభిస్తుంది.

* సమాజంలోని బలహీనుడికి కూడా బలవంతునితోపాటు సమానావకాశాలు లభించాలి. నా దృష్టిలో ప్రజాస్వామ్యమంటే అదే.

* మనస్ఫూర్తిగా చేయని సేవ సేవకాదు. నలుగురికీ తెలియడానికో, ప్రజలకు భయపడో చేసే సేవలో ఆనందం వుండదు. అది మనిషిలోని ఉత్సాహాన్నే నీరు గార్చేస్తుంది.

* జాతీయభావం కలిగి వుండడం తప్పేమీ కాదు. సంకుచితత్వము, స్వార్థపరత్వము' వేర్పాటు ధోరణి - యివి తప్పు.

* విధ్యుక్త ధర్మ నిర్వహణద్వారానే హక్కులు సంక్రమిస్తాయి. పనిలేకుండా, తిండి లేకుండా దేశంలో ఒక మనిషి వున్నా విశ్రాంతి తీసుకునే హక్కు గానీ, కడుపు నిండా తినే హక్కుగానీ మనకు లేదు.

* డాబూ, దబాయింపూ, దర్జా, దర్పాలు పురుషలక్షణాలుకావు. సాంఘిక రంగంలో గానీ రాజకీయాది రంగాలలోగానీ సరియైన పనిచేసి, దాని ఫలితాలను ఎదుర్కొనడమే పౌరుషం. మాటలు చెప్పడంకాదు ; పనులుచేసి చూపాలి.

* చక్కటి గ్రామీణ వ్యవస్థ ఏర్పడాలంటే మంచి చట్టం వుండాల్సిన పనేం లేదు క్రియాశీలురైన మనుషులు వుంటే చాలు.

* స్వేచ్ఛా జీవులుగా మనలేకపోతే మరణించడమే మేలు.

* ఒక ఆదర్శం కోసం పోరాడడంలోనూ, ప్రయత్నించడంలోనూ, బాధపడడంలోనే ఆనందం వుంది, విజయ సిద్ధిలో కాదు.

* సత్యం అనేది ఏ ఒక్క మతానికి సంబంధించినది కాదు

* అస్పృశ్యత అనేది హేతువాదానికి నిలువదు. కరుణ రసానికీ, జాలిగుండెలకూ అది విరుద్ధం.

* మనిషి వ్యక్తిగత జీవితానికి రాజకీయ జీవితం ప్రతిబింబం కావాలి. ఈ రెంటిమధ్య భిన్నత్వం వుండడానికి వీల్లేదు.

* మనం ముందుకు పోవాలంటే కొత్త చరిత్రను సృష్టించాలేగాని చరిత్రను పునరావృతం చేయరాదు.

* అహింస అనేది నామట్టుకు నాకు ఏదో ఒక విధానం వంటిది కాదు. అదొక విశ్వాసం, అదొక మతం.

* ఆదర్శ విశ్వాసం వుండి, దానివల్ల అబ్బిన శక్తి కలవాడు యితరులు తనను నిరాదరించినా లెక్కచేయడు.

* లోకంలోని కోర్టులన్నింటికంటే పెద్దకోర్టు ఒకటి వుంది - అదే మనిషి అంతరాత్మ.

* ఒక జాతి సంస్కృతికి ఆ జాతి ప్రజల హృదయాలూ, ఆత్మలే దర్పణాలు.

* మనం కలలు కనే స్వరాజ్యంలో జాతి మత విచక్షణలకు ఏ మాత్రం తావులేదు

గాంధీ జయంతి సందర్భంగా ఖైదీల విడుదల

దోపిడీ బందిపోటు నేరాలు తప్ప ఇతర నేరాలకు శిక్షలు అనుభవిస్తున్న మహిళా ఖైదీలనూ, అరవైఏండ్ల వయస్సు పైబడిన ఖైదీలనూ, క్షయ, కేన్సర్, కుష్ఠు, పక్షవాతం, అంధత్వంతో బాధపడుతున్న ఖైదీల నందరినీ గాంధీజీ శతజయంత్యుత్సవ సందర్భంగా అక్టోబరు 1 వ తేదీన విడుదల చేశారు.


ఈ ఏడాది అక్టోబరు 2 వ తేదీ అంతకు ముందు విధించబడిన మరణ శిక్షలను తగ్గించారు.

యావజ్జీవ శిక్షను అనుభవిస్తున్న వారితో సహా ఏడేండ్ల కంటే ఎక్కువ శిక్ష విధించబడిన వారి శిక్షలను వారు రెమిషనుతో సహా శిక్షా కాలంలో మూడింట ఒక వంతు కాలం అనుభవించడం పూర్తి చేసి వున్నవారిని విడుదల చేశారు. అయితే అనుభవించిన శిక్ష రెమిషనుతో సహా అక్టోబర్ 2 వ తేదీనాటికి మూడున్నర ఏళ్ళ కంటె తక్కువ కారాదు. ఏడేండ్లకు అంతకు తక్కువ కాలానికి శిక్ష విధించబడినవారిలో ఆనాటికి రెమిషన్‌తో సహా సగం శిక్ష పూర్తి చేసినవారిని విడుదల చేశారు

దోపిడి, బందిపోటు నేరాల క్రింద శిక్ష లనుభవిస్తున్న వారికి తగ్గింపులు, మినహాయింపులు వర్తించవు.

ఈ తగ్గింపులు వర్తించని ఖైదీలందరికీ వారి శిక్షలో మూడింట ఒక వంతు శిక్షను ప్రత్యేకంగా తగ్గించారు.

కేంద్ర చట్టం క్రింద కానీ, రాష్ట్రం వెలుపలి న్యాయస్థానాల చేత కానీ శిక్ష విధించబడిన వారికి ఈ ఉత్తర్వులు వర్తించవు.



గాంధీతో

— ముల్కరాజ్ ఆనంద్

అస్పృశ్యుడు అనే నవలను మళ్ళీ తిరిగి వ్రాయాలనిపించింది. అందుకని మహాత్మాగాంధీ సలహాలు తీసుకుందామని 1929లో ప్రత్యేకంగా లండన్ నుంచి భారత దేశానికి వచ్చాను. అస్పృశ్యతను గురించి ఆయన 'యంగ్ ఇండియా'లో వ్రాసిన వ్యాసాలను కొన్నిటిని నేను చదివాను, నేను బొంబాయి వచ్చిన మర్నాడు గాంధీజీని అహమదాబాదులో కలుసుకోడానికి ఏర్పాటు జరిగింది. వెళ్ళి ఆయనను కలుసుకున్నాను. ఆనాటి మా సంభాషణయిది.

గాంధీజీ : లండన్ లోవుండి మీరు నియమితకాలాన్ని తూ.చా. తప్పకుండా పాటించడం నేర్చుకున్నారు. నూలువడుకుతూ వుండడంవల్ల నేనే కాస్త ఆలస్యం చేశాను.

నేను; అస్పృశ్యులను గురించి నవల ఒకటి రాసినట్టు మీకు నా వుత్తరంలో తెలియజేశాను కదండీ...

గాంధీజీ : వారినిమేము యిక్కడ హరిజనులని పిలుస్తాము.

నేను : ఉత్తరహిందూదేశంలోని అస్పృశ్యుల జీవితానికి సంబంధించిన వాస్తవ అనుభవాన్ని ఆధారంగా చేసుకుని యీ నవల రాసినా, తీరా రాసింతర్వాత దీనిలో అంత పటుత్వం లేదేమో అనిపించింది.

గాంధీజీ: అస్పృశ్యులేమిటి? ఆ మాట బదులు హరిజనులు అనే పదాన్ని వాడుతాంమేము. ఆ విషయం మీకు చెప్పానుకదూ.

నేను : హరిజనులు అంటే దేవుని కుమారులని కదూ. వారిని దేవుని బిడ్డలుగా మన సమాజం చూస్తున్నదని నేననుకోను. పైగా నాకు దేవుడిమీద నమ్మకం లేదు సుమండీ.

గాంధీజీ: అయితే మీరు హిందువులు కారన్నమాట.

నేను : కులవ్యవస్థకు మార్గం వేసే మతం నాకిష్టం లేదు. నిజానికి నేను క్రైస్తవ మతంలో చేరాలని ఆలోచిస్తున్నాను. ఎందుకంటే అందులో కులవ్యవస్థలేదు కనుక. అయితే వచ్చిన చిక్కొక్కటుంటంటే, క్రైస్తవులు కూడా తమ అనుయాయులు దేవుణ్ని నమ్మాలంటారు.

గాంధీజీ: అయితే మీరు నాస్తికులన్నమాట.

నేను : అవును నేను సోషలిస్టును.

గాంధీజీ: హిందూ మతం కులవ్యవస్థను ప్రోత్సహిస్తుందన్న మీ అభిప్రాయంతో నేను ఏకీభవించలేను. ఛాందస హిందువులు తక్కువ కులాల వారిని వేరుగా చూస్తారేమోగాని నిజమైన హిందువులు ఎప్పుడూ అలాచూడడు.

నేను : హిందూమత విశ్వాసాలయెడ మీకు చాలా ఉదార భావం వున్నట్టుంది. వెయ్యేళ్ళకుపైగా హిందూమతానికి కులవ్యవస్థ ప్రాతిపదికగా వుంటూ వస్తున్నదనే విషయాన్ని మీరు విస్మరించారను కుంటాను.

గాంధీజీ: హిందూమతానికి కులం ప్రాతిపదికగా వున్నదనిపిస్తే నేను హిందువుడ్ని అయ్యేవాడినేకాదండీ.

నేను : సరే లెండి. నేను అనుకోవడం మాత్రం అలా అనుకుంటున్నాను. అందుకే యీ విధమైన వ్యవస్థకు అభ్యంతరం చెప్తున్నట్టుగా యీ నవల రాశాను నేను.

గాంధీజీ:ఈ విషయాన్ని తీసుకుని రాయడం బాగానేవుంది. కాని, కుల వ్యవస్థని నేరుగా ప్రతిఘటిస్తూ ఒక పుస్తకం ఎందుకు రాయలేదు. స్పష్టంగా కుండబ్రద్దలుకొట్టినట్టు వున్నదివున్నట్టు చెప్పడంవల్ల ప్రజల్ని మార్చవచ్చుకదా.

నేను : నాకు నవల రాయాలనిపించింది, రాశాను. అంతేగాని ప్రచార సాహిత్యం సృష్టించాలని అనుకోలేదు. నవలలో ఒక సమస్యను గురించి చెప్తాముగాని, దాన్ని పరిష్కరించము. ఆ పరిష్కారమనేది సంస్కర్తలకు వదిలేస్తాం. ప్రజలను సంస్కరిద్దామని నేననుకోలేదు. సమస్యను ఎత్తిచూపించాలనుకున్నానేగాని దానికి పరిష్కార మార్గాన్ని వెతికి చూపిద్దామని అనుకోలేదు.

గాంధీజీ:మీరనుకుంటున్న ప్రజలు మీ నవలని ఇంగ్లీషులో చదువుతారా? మరి మీ ఆనందం గురించే మీరు యీ నవలను రాయాలనుకుంటున్నారన్నమాట.

నేను : మీరుచెప్పిందీ నిజమే. పాశ్చాత్య దేశాల్లో కళాకారుడు నలుగురిచేతా గుర్తింపబడాలనుకుంటాడు. అయితే మీదగ్గరికి నేను వచ్చానంటే నా ప్రతిభని చూపెడదామనికాదు నాలోని అహాన్ని తొలగించుకుందామనీ, హరిజనుల్ని ప్రేమించడం మీ నుంచి నేర్చుకుందామనీనూ. పంజాబీలోనూ, హిందూస్తానీలోనూ వున్న నా పాత్రల ఆలోచనల్ని ఇంగ్లీషులోకి అనువదించడానికి మాత్రమే నేను ప్రయత్నం చేశాను. పంజాబీలో అచ్చువేసే ప్రచురణ కర్త ఎవరూ లేరు. అందుకని ఇంగ్లీషులో రాస్తున్నాను.

గాంధీజీ:అదీనిజమే. ఎవరికి అందుబాటులోవున్న భాషలో వాళ్ళు తమ అభిప్రాయాల్ని చెప్పుకోవచ్చు. అందువల్ల మీ పుస్తకం ఇంగ్లీషులో వుండకూడదనడంలో అర్థంలేదులెండి.

నేను : కొంతమందికి అభ్యంతరం వుంటుందిలెండి. భారతదేశంలో చెడును బయటి ప్రపంచానికి యిలా బట్టబయలుచేయడం చాలామంది భారతీయులకు నచ్చదు ఇది తప్పంటారువాళ్ళు.

గాంధీజీ:ఒకరికి నొప్పి కలుగుతుందని నిజాన్ని చెప్పడం మానేయకూడదు ఎవరికి బాధ కలిగినా సత్యం సత్యమే కదా.

నేను : గోగల్, డాస్టావస్కీ, టాల్‌స్టాయ్‌లు తమ దేశంలోని చెడును ఎత్తిచూపిస్తే రష్యావాళ్ళూ అలానే విమర్శించారు.

గాంధీజీ: మీరు టాల్‌స్టాయ్ రచనల్ని చదివారనుకుంటాను.

నేను : టాల్‌స్టాయ్ రాసిన ప్రతిదీ చదివాను. చివరకు ఆయన గురించి కౌంటెస్ టాల్‌స్టాయ్ చెప్పినదికూడా చదివాను

గాంధీజీ : ఆవిడ టాల్‌స్టాయ్‌ని గట్టిగా విమర్శించిందని విన్నాను.

నేను : అన్నట్టు, ఆశ్రమంలో వుండడానికి నాకు అనుమతి యిస్తారా.

గాంధీజీ: అలాగే, తప్పకుండా వుండవచ్చు.

(డా. ఎస్. రాధాకృష్ణన్ సంపాదకత్వాన కొత్తఢిల్లీలోని గాంధీ శాంతిసంఘం వారుప్రచురించిన "మహాత్మాగాంధీ–100 సం. లు" నుండి")

రెండు వేలేండ్ల కవల నీ ఋషులభూమి

నెత్తినా వహింసాధ్వజ మెత్తుగాను;

చావనున్న హింసా పిశాచమునకింత

దేహమునుకోసి బలిపెట్టితివె మహాత్మ!

మారణాయుధ రాక్షస మార్గమెడలి

మానవ స్నేహ దీపధామములు మెరసి

వైరములు చిమ్మచీకట్లవలె నశింప

తాల్చినావు సత్యాగ్రహాస్త్రము మహాత్మ!

—రాయప్రోలు

చిరదాస్యమున క్రుంగి పిరికివారిన జాతి
　　కలవరించితివి సాహసికముద్ర
మోకరించి కృపాణములు సలాములుసేయ
　　అస్త్రమెత్తితివి సత్యాగ్రహంబు
పరధర్మలుబ్ధులై పరువు లెత్తిడి వారి
　　త్రిప్పజాలితివి జాతీయవితతికి
అడుగడ్డునకు నడ్డపడిన కోటలగూల్చి
　　సవరించితివి సమాజవ్యవస్థ
దిక్కెరుంగక రేబవల్ దేవురించు
ప్రజకు నేర్పితి వాత్మగౌరవ సమీక్ష
బాపుజీ స్రష్టవీవు నీ చూపునోకి
ద్రష్టలైనారు కొందరీ తరమువారు.

—తుమ్మల సీతారామమూర్తి

గాంధీజీ దృష్టిలో వృత్తి గౌరవం

డి. సి. ముఖర్జీ

కార్మిక విషయాలలో గాంధేయ దృక్పథం వున్నచోట మనిషిని మనిషి పీడించే వాతావరణానికి అతీతమైన ఒకానొక ఆదర్శ వ్యవస్థ రూపు రేఖలు దిద్దుకుంటుంది.

గాంధీజీకి శ్రద్ధాంజలి ఘటిస్తూ ఐన్‌స్టీన్ యిలా అన్నారు. "ప్రజల మద్దతుగల ప్రజానాయకుడు ఆయన. తన విజయం ఏవో మంత్రాలవల్లా, తంత్రాలవల్లాగాక తన వ్యక్తిత్వం మీదా, ప్రజలకు నచ్చజెప్పి అనుసరింపజేసే గుణం మీదా ఆధారపడివున్న రాజకీయవేత్త ఆయన. విజ్ఞతకు, వినమ్రతకు నిధి. దృఢమైన నిశ్చయము, అచంచలమైన మానసిక పరిణతిగల వ్యక్తి. ప్రజల అభ్యున్నతికీ, వారి జీవన సౌభాగ్యానికీ తన శక్తినంతా వెచ్చించే మనీషి. యూరపు కరకుదనాన్ని అతి సామాన్య వ్యక్తిగా ఎదుర్కొని అన్నివేళలా పై చేయిగా నిలచిన కార్యసాధకుడు. అటువంటి మనిషి ఒకప్పుడు రక్తమాంసాలతో ఈ భూగోళం మీద జీవించి వున్నాడంటే భవిష్యత్తరాల వారు విశ్వసించక పోవచ్చు."

గాంధీజీ ఒక్క భారత దేశ ప్రజలతోనేగాక యావత్ప్రపంచ ప్రజలలో ఒకడుగా మెలిగారు. చేతిపనుల ద్వారా, కుటీర పరిశ్రమల ద్వారా, ఖాదీ ద్వారా గాంధేయ సిద్ధాంతాన్ని, సత్యాహింసలను ప్రజానీకానికి ప్రచారం చేశారు. ఆర్థిక విషయాలలో మనిషి తనకు తాను స్వయం సమృద్ధి చేసుకోవడమే దీని ప్రధాన లక్ష్యం. గాంధీగారు ఎప్పుడూ ఖాదీకీ, గ్రామీణ పరిశ్రమలకూ అధిక ప్రాధాన్యం యిస్తుండేవారు. ఒకసారి గాంధీగారే "గ్రామ పరిశ్రమలనబడే సూర్యకుటుంబ గోళాలకు ఖాదీపరిశ్రమ ఒక సూర్యుని వంటిది" అని అన్నారు. మిగతా పరిశ్రమలన్నీ దానికి ఉపగ్రహాలవంటి వన్నమాట. దాని నుంచి తాము వేడీ, వెలుతురూ, పదార్థం పొంది అందుకు ప్రతిగా యీ ఉపగ్రహాలు సూర్యుని నిలబెడ్తాయి. అలాగే ఖాదీ నుండి యీ పరిశ్రమలన్నీ చైతన్యాన్ని పొంది, అందుకు బదులుగా ఖాదీ నిరంతరంగా జీవించేట్టు చేస్తాయి. చరఖా అనేది దీనికి ఒక ఆలంబనం. అదే తర్వాత తర్వాత స్వదేశీయోద్యమంలో ప్రముఖపాత్ర వహించింది.

ప్రజలలో బీదవర్గాలవారికి నిరుద్యోగ సమస్యనుంచి విముక్తి కలిగించాలంటే చతుర్థ పంచవర్ష ప్రణాళికలో లఘు పరిశ్రమలను విస్తృతంగా నెలకొల్పాలని ప్రణాళికా సంఘం యీ నాడు గట్టిగా నొక్కి చెప్తుతున్న విషయాన్ని చాలాకాలం క్రిందటే గాంధీజీ చెప్పారు. ఆ రోజుల్లో ఖాదీ గురించీ, గ్రామీణ కుటీర పరిశ్రమలను గురించీ ఆయన చెప్పినదే యీ నాడు ప్రణాళికా సంఘం చెప్తున్నది. మన ఆర్థిక వ్యవస్థలోనే మౌలికమైన మార్పులు రావాలని గాంధీజీ ఆశించారు. ఒకరు మరొకర్ని పీడించడానికి ఆస్కారంలేని ఆర్థిక వ్యవస్థను ఆయన లక్షించారు. పాశ్చాత్య ఆర్థిక వ్యవస్థకు యిది భిన్నంగా వుండాలని తలంచారు. తన సహాయ నిరాకరణోద్యమాన్ని ఖండించిన రవీంద్రనాథ్ ఠాగూరుకు గాంధీజీ సమాధానమిస్తూ— "భారత దేశం పట్టణాలల్లో జీవించడంలేదు. ఏడున్నర లక్షల గ్రామాలలోనే భారత దేశం ఊపిరి పీలుస్తోంది. పట్టణాలు గ్రామాల మీద ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. యూరప్, అమెరికా, జపాను దేశాల్లోని వ్యాపారసంస్థలకు పట్టణ ప్రజలు దళారీలూ, కమీషన్ ఏజంట్లు మాత్రమే" అన్నారు.

కార్మికులకు గాంధీజీ యిచ్చే సందేశం కూడా సత్యం, అహింసలమీదనే ఆధారపడివుంది. యజమానులతో కార్మికులు జరిపే పోరాటం యీ సిద్ధాంతాలమీదనే ఆధారపడి జరగాలని గాంధీజీ భావించారు. యజమానుల, కార్మికుల సమిష్టి సహకారంతో, మనిషిమనిషిని పీడించే వాతావరణానికి అతీతమైన ఒక వాతావరణాన్ని దేశం చేరుకోగలదని గాంధీజీ విశ్వసించారు. గాంధీగారు కార్మికుల విషయంలో సాధించిన ఘన విజయానికి ప్రత్యక్ష తార్కాణం—గాంధీ మజ్దూర్ సేవాలయం. ఘెరావోలు, సమ్మెలు విపరీతంగా వుండే యీ నాటికికూడా అహమదాబాద్‌లోని యీ కార్మిక సంఘం, ఎటువంటి దౌర్జన్యచర్యలకూ దిగక ఆదర్శప్రాయమైన కార్మికలోకంగా చూపరులను ఆశ్చర్య చకితులను చేస్తున్నది. గడచిన యాభై వొక్క సంవత్సరాలుగా ఏవిధమైన సమ్మెల్లో, చట్టవ్యతిరేక చర్యలలో పాల్గొనలేదిది. కార్మిక నాయకుడుగా తను రూపొందాలని గాంధీగారు యీ జవుళి పరిశ్రమ కార్మిక సంఘాన్ని నెలకొల్పలేదు. అనుకోకుండా కాకతాళీయంగా అది జరిగింది. అందుకు పరిస్థితులు దోహదం చేశాయి.

కార్మికులు—యజమానుల సమస్యలను పరిష్కరించడానికి ఎప్పుడూ గాంధీగారు సత్యాన్నీ, అహింసనూ ఉపకరణాలుగా వినియోగిస్తూ వచ్చారు. "కార్మికుడే వాస్తవానికి నిజమైన పెట్టుబడి"

అని గాంధీగారు భావించేవారు. "డబ్బు ప్రాణంలేని పెట్టుబడైతే కార్మికుడు ప్రాణంవున్న పెట్టుబడి. అన్ని హెచ్చు తగ్గులను పూడ్చే సమతాకర్త కార్మికుడు. కార్మికుడు అట్టే చదువుకున్నవాడు కాడు గనుక యజమానికి అణిగిమణిగి వుండడమో, లేదా పెట్టుబడి వస్తువులకూ, యంత్రాలకూ నష్టాన్ని కలిగించడానికి ప్రయత్నించడమో చేస్తుంటాడు. ఇది కూడని పని ఎందుకంటే యిది బంగారు గ్రుడ్లు పెట్టే బాతును చంపుకోవడమే అవుతుంది. కార్మికులు తమ గౌరవానికి భంగంకాని విధంగా యజమానులతో సహకరించడం నేర్చుకోవాలి".

ప్రతి కార్మికుడు తన వృత్తితోపాటు మరో ఉప వృత్తిని నేర్చుకోవడం అవసరమని గాంధీగారు భావించారు. పారిశ్రామిక వేత్తకు ఖనిజం ఎలా ఉపయోగకరమైనదో కార్మికునికి వివిధ వృత్తుల పరిజ్ఞానం అంత ప్రయోజనకరమైనది.

ఉపవృత్తులు సమ్మె సమయంలోనూ, పనివేళల తరువాత సమయాలలోనూ కార్మికునకు ఎంతో ప్రయోజనాన్ని కలిగిస్తాయి. సబ్బుల తయారీ, కాగితాల తయారీ, హస్తకళా ఖండాల తయారీ, టైలరింగ్ వంటి పనులు కార్మికుని ఖాళీసమయాలను లాభసాటి చేయడానికి తోడ్పడతాయి.

సమ్మెలపై గాంధీజీ అభిప్రాయం ఏమిటో అందరికీ తెలిసినదే. న్యాయసమ్మతమైన మార్గాలన్నీ నిష్ఫలమైనప్పుడు ఇక ప్రయోగించవలసిన ఆఖరి ఆయుధం 'సమ్మె' అని గాంధీగారు అన్నారు. సమ్మెకు దిగేముందు కార్మికులు తమ కోర్కెల్లోని సమంజసత్వాన్ని క్షుణ్ణంగా తెలుసుకుని వుండాలి. సమ్మెకూడా శాంతియుత పద్ధతుల ద్వారానే జరగాలి. ఒక్క భగవంతుని ఎదుట తప్ప మరెవరి ఎదుటా నిస్సహాయస్థితికి కార్మికులు తావివ్వరాదు. కార్మికులెవరూ సమ్మెకాలంలో ఎట్టిపరిస్థితుల్లోనూ ఏ వ్యక్తినీ చివరకు తమ సంఘాన్ని సైతం ఆర్థిక సహాయానికై అర్థించకూడదు. ఎందుకంటే పరాన్న జీవిగా ఇతరుల డబ్బుమీద ఆధారపడిపోట్లాడేవాడిగా లోకం నిందిస్తుంది—అన్నారు గాంధీజీ. సమ్మె ఎప్పుడూ కడపటి ప్రయత్నం కావాలని మరీ మరీ ఆయన చెప్పారు.

ఈ నాడు కార్మిక చట్టం విరివిగా ప్రయోగిస్తున్న "మధ్యవర్తిత్వం" అనే మాటను చాలా కాలం క్రితమే గాంధీగారు ప్రయోగించారు. కార్మికులకు, యజమానులకుమధ్య పరిష్కారానికై, ఆయన వుపయోగించారు.

ప్రతిపనీ గౌరవనీయమైనదే నని గాంధీగారి అభిప్రాయం. శారీరక పరిశ్రమనుకూడా బుద్ధిని ఉపయోగించి చేసే మానసిక శ్రమతో సమాన ప్రాముఖ్యం గలదిగా పేర్కొన్నారు. మనసు చేసే ఆలోచన, శరీరంతో పనిచేయించినప్పుడే కార్యరూపాన్ని ధరిస్తుందన్నారు. గాంధీగారు పేర్కొన్న మరో ముఖ్య విషయం—వ్యక్తి హక్కులూ, విధుల మధ్యగల వ్యత్యాసాన్ని గురించి. విధి నిర్వాహణ తర్వాతనే హక్కుల ప్రసక్తి రావాలి. ముందు విధి నిర్వహణ ఆ తర్వాత హక్కులు. ఈ సంబంధం యిలా కొనసాగనప్పుడు ఫలితాలు సంతృప్తికరంగా వుండవు అన్నారు గాంధీజీ. ★

మానవ తరణోపాయం మహాత్ముని రూపంలో
మళ్లీ తూరుపుదెసనే మనోజ్ఞంగా ఉదయించిందని
పాశ్చాత్య భక్త ప్రపంచం ప్రాంజలి ఘటించిందిటు తిరిగి
మానవతా మహిత ధర్మం మళ్లీ నడిచింది నాల్గుపాదాలా!

సర్వమానవ స్వాతంత్ర్యోద్యమ ప్రాభవ ప్రభాకరుడు
మాయెరుగని ముద్దుపాపలా తూర్పున కనబడగానే
దురహంకార సూర్యనాముడస్తమించని పశ్చిమ సామ్రాజ్యవాదం
నెత్తురు కక్కుకొంది—హస్తగిరి శిఖరాగ్రానికి కొట్టుకొని!

—బోయి భీమన్న

ఈర్ష్యాద్వేషాల కొలిమిచప్పున చల్లారినట్లు
భూగోళం యావత్తు ఒకేవ్యక్తి అయినట్లు
భారతమాతే జగతికి గుండెకాయ అయినట్లు
ఆ గుండియ పగిలినట్లు
చుక్కలన్ని భూగోళం కన్నులవుచు ఏడ్చినట్లు
ఆకాశం మొగంనిండ దిగులు అచ్చు కమ్మినట్లు
ఆ క్షణాన సాగరాల హోరంతయు మానవమాత్రుని దుఃఖమే!
ఆ క్షణాన జీవుని వేదన సాంతము నీవు లేవు లేవనియే!
మము కావగ రావు రావనియే!!

—కాళోజీ

మా గాంధి



యస్. టి. జ్ఞానానందం

కలిగినదా? పేదతలపులో నిన్నాళ్ల
ప్రవచించుకొన్న స్వరాజ్యసుఖము
వెలిగినదా? సోదరుల పరస్పరమైన
హృదయాలలోన సౌహృద మరీచి
తొలగినదా? దుఃఖితులపై చెలాయించు
కలవాని కడు గడుగ్గాయితనము
మెలగినదా? ఋషీంద్రుల జన్మభూమిలో
సాక్షాత్తు సౌజన్యశాంతిలక్ష్మి

వడలి పోయిన జాతీయ భావసుమము
మరల వికసింప నెదల సంబరము పడుచు
ఉత్సహించి నీ శతజయంత్యుత్సవమును
జరుపుచున్నాము గాంధి ముమ్మరపుభక్తి.

అటకాయించితి వాంగ్లభూపతుల సత్యాహింస నాస్త్రాల ది
క్తటముల్ బెగ్గిల, భారతీయులకు స్వాతంత్ర్యమ్ము సాధింప నెం
తటి త్యాగానకు బూనుకొంటివో? మహాత్మా! దండిసత్యాగ్రహీ!
ఎటుమాయింతువో నీ జనాళికిపుడా యీ దుష్టచేతమ్ములన్?

వర్ణద్వేషణ మత్తభీషణ మహావ్యాఘ్రమ్ము దేశాన సం
పూర్ణ స్వేచ్ఛకు నడ్డమైనిలిచె డాబున్ రాజకీయాలలో
కర్ణుల్ సైంధవులెల్ల బొల్చిరిట వ్యాఖ్యానింప బాపూజి నీ
స్వర్ణస్వప్నములెట్లు నిక్కమగునాశాజ్యోత్స్న లెట్లొప్పెడిన్?

పశుబల సంపదల్ గలుగువాని నెదిర్చిన త్యాగసత్క్రియల్
దిశల ధ్వనింప స్వేచ్ఛదమి తెచ్చిన బక్కమునీ! జగమ్ము నీ
వశనము మానుచో మతి వ్యధాకులితా కలితంబు నయ్యె నీ
ముసిముసిబోసినవ్వులు మమున్ నడిపించుత దేశసేవకై.

సత్యాగ్రహరణమ్ము జరిపించి క్రొంగ్రొత్త
విజయమ్ము పుంజీభవించు నాడు
సకలభారత భూమియొక త్రాటిమీదనే
ప్రియమెలర్పగ నడిపించు నాడు
దసిలి పోయినజాతి ధైర్యమ్ము మరల నొ
క్కమ్మడిగా పాదుకొల్పు నాడు
ప్రజలెల్ల చైతన్యవంతులై నెగడ జా
తీయ భావము ప్రబోధించు నాడు

సర్వభారతీయ శక్తిసామర్థ్యమ్ము
నీదురూపమందు నిలుచునాడు
హిమగిరిందరి మటులహెచ్చి స్వాతంత్ర్యమ్ము
తెచ్చితో సబర్మతీ మునీంద్ర!

ప్రపంచ ప్రజల మహానాయకుడు

[గాంధీజీ కేవలం భారతీయుడే కాదు, మానవ జాతి కంతకూ చెందిన వాడనడానికి నిదర్శనంగా ప్రపంచ వ్యాప్తంగా శతజయంత్యుత్సవాలు జరుగుతున్నాయి]

ఆస్ట్రేలియా

ఆస్ట్రేలియాలోని విక్టోరియా రాష్ట్రంలో, సెప్టెంబరు 11వ తేదీన మహిళల జాతీయ మండలి ఆధ్వర్యాన గాంధీమహాత్ముని శతజయంత్యుత్సవాలు జరిపారు. ఆస్ట్రేలియాలో భారత హై కమీషనర్ శ్రీ ఎ. యమ్. థామస్, ఆనాటి మహిళల సమావేశంలో అతిథి హోదాలో ప్రసంగించారు. "గాంధీమహాత్ముడు–మహిళోద్ధరణ" అన్న అంశం గురించి ఆయన ప్రసంగించారు.

142 శాఖలు గల ఈ మహిళామండలి సెప్టెంబర్ 18వ తేదీ నుంచి వారం రోజులపాటు జరిగే వేడుకలకు, కొన్ని ఇతర సంస్థలతోపాటు ఆధ్వర్యం వహిస్తుంది. ఆస్ట్రేలియా ప్రభుత్వపు ఆహ్వానాన్ని పురస్కరించుకొని శ్రీ జయప్రకాశ్ నారాయణ్ దంపతులు ఈ వేర్వేరు ఉత్సవాలలో పాల్గొనబోతున్నారు.

దక్షిణ ఎమెన్

గాంధీ శతజయంతుత్సవాల నిర్వహణ నిమిత్తం, దక్షిణ యెమెన్ ప్రభుత్వం 7 గురు సభ్యులుకల జాతీయ సంఘాన్ని ఏర్పాటుచేసింది. దక్షిణయెమెన్ ప్రభుత్వంలో న్యాయశాఖ మంత్రి ఖాలీఫా దీనికి అధ్యక్షులు. స్థానిక భారతీయులు ముగ్గురికికూడా ఈ సంఘంలో సభ్యత్వంఉంది.

1969 సెప్టెంబరు లగాయతు అక్టోబరు వరకు ఈ జయంత్యుత్సవాలు నిర్వహిస్తారు.

టర్కీ

ఇజ్మీర్ అంతర్జాతీయ ప్రదర్శనలో భారతీయశాలలో 'గాంధీ విభాగం' చూపరులను ఆకట్టుకుంటున్నది. 'నా జీవితమే నా సందేశం' అనేపేరుతో ఏర్పాటైన విభాగంలో గాంధీ మహాత్ముని జీవిత ఘట్టాలను తెలియజేసే 100 పైచిలుకు ఛాయాచిత్రాలు, గాంధీజీ రచనలు, మహాత్ముని గురించి వ్రాయబడిన గ్రంథాలు ఉంచారు. టర్కీ భాషలోనికి అనువదించబడిన 'ఆత్మకథ' కూడా ఈ విభాగంలోఉంది. ఇతర భారతీయ సంక్షిప్తచిత్రాలతో పాటు గాంధీజీ జీవితం, సందేశాలు మొదలైనవి వివరిస్తూ నిర్మించిన చిత్రాలనుకూడా, అక్కడ ప్రదర్శిస్తున్నారు.

గాంధీజీ శతజయంతి సందర్భంగా వ్యాసాలు, గాంధీజీ, చిత్రాలపై సమీక్షలు ఇజ్మీర్ పత్రికలలో వెలువడ్డాయి. ప్రదర్శనలోని గాంధీ విభాగం గురించి కూడా ఆ పత్రికలు వ్యాసాలను ప్రచురించాయి.

స్విట్జర్లాండ్

స్విట్జర్లాండ్ ప్రభుత్వంలో విదేశ వ్యవహారాలశాఖ మంత్రి డాక్టర్ విల్లీ స్పూలర్ అధ్యక్షతన బెర్నీనగరంలో, సెప్టెంబరు 6వ తేదీన జరిగిన సభలో, ఆదేశంలో గాంధీ మహాత్ముని శతజయంత్యుత్సవాలకు నాంది వాక్యం పలికినట్టయ్యింది. మహాత్ముని శతజయంత్యుత్సవ నిర్వహణకు సంబంధించి ఏర్పాటైన జాతీయ సంఘానికి డాక్టర్ విల్లీ స్పూలర్ అధ్యక్షులు. భారత రాయబారి శ్రీ అజీం హుస్సేన్, భారతదేశంలో స్విట్జర్లాండు తరపున రాయబారిగా నియమితులైన డాక్టర్ లింట్, దౌత్యాధికారులు, స్విస్ ప్రముఖులు ఆ సభకు విచ్చేశారు. మహాత్ముని జీవితం గురించీ, బోధనలగురించీ మాట్లాడుతూ డాక్టర్ బెల్‌మాంట్, 'గాంధీజీ ఆయుధాలు సత్యం, అహింసలు' అన్నారు. ఆతర్వాత స్విట్జర్లాండ్ పార్లమెంటు సభ్యుడు డాక్టర్ ఒట్టోవెంగెల్ మాట్లాడారు. శ్రీ అజీం హుస్సేన్ తమ ప్రసంగంలో, అణ్వాయుధాలు మానవాళి వినాశనానికి దారితీసే ప్రమాదమున్న ప్రస్తుత సమయంలో అణ్వాస్త్రయుద్ధాన్ని ఎదుర్కొనుటకు గాంధీ సిద్ధాంతాలే సరైన సాధనం అన్నారు. శతజంత్యుత్సవాలు నిర్వహణకు కృషిచేస్తున్నందుకు స్విట్జర్లాండ్ దేశాంగమంత్రికి, జాతీయసంఘం సభ్యులకు, భారత ప్రభుత్వం తరపునా, ప్రజలతరపునా శ్రీ హుస్సేన్ కృతజ్ఞతలు తెలిపారు.

మహాత్ముని జీవిత విశేషాలను వివరించే సంక్షిప్త చిత్రాన్ని ఆ సందర్భంగా ప్రదర్శించారు.

సెప్టెంబర్ 7వ తేదీన జూరిచ్ నగరంలో బహిరంగ సభ జరిగింది. ప్రముఖ రచయిత డాక్టర్ మార్టిన్ హర్లిమాన్ ఆసభకు అధ్యక్షత వహించారు. భారత రాయబారి శ్రీ హుస్సేన్ కూడా ఆ సభకు హాజరయ్యారు.

జాంబియా

జాంబియాలో భారత హైకమీషనర్ శ్రీ జి.ఎస్. మాలిక్, ఆదేశపు విద్యాశాఖ మంత్రికి, గాంధీ ప్రదర్శనకు అవసరమైన సరంజామాగల పెట్టెను కానుకగా ఇచ్చారు. ఆ సందర్భంగా మాట్లాడుతూ, విద్యామంత్రి రాష్ట్రంలోని వివిధ పాఠశాలల్లో గాంధీ ప్రదర్శనను నిర్వహిస్తామని తెలియచేశారు.

సెప్టెంబరు 5వ తేదీన, జాంబియా ప్రధాని సర్ దావ్ డాకారిబా జపారా ప్రారంభోత్సవం చేసిన ప్రదర్శనలో ఆ సరంజామాను ఉపయోగించారు.

మహాత్ముని ప్రసంగంలోని భాగాలను జాంబియా రేడియో ప్రసారం చేస్తున్నది. ముందుగా రికార్డు చేయబడిన 'బాపూవాణి'ని ఆకాశవాణి, ఆ రేడియోకు ఇచ్చింది.

ఘనా

ఘనాలో ఆషాంటీ ప్రాంతంలోని బిబియాసిలో గాంధీ మహాత్మా సౌభ్రాతృత్వ సమితి ఏర్పాటు అయింది. మహాత్ముని సిద్ధాంతాలనూ, అభిప్రాయాలనూ ఘనా యువజనులలోనూ, యావత్ ప్రపంచంలోని యువజనులలోనూ ప్రచారం చేయాలన్నది ఆ సమితి ఆశయం. భారత హైకమీషనర్ ఆ సమితికి ప్రధాన పోషకులు. ఘనాలో జరుగుతున్న బాపూ శత జయంత్యుత్సవాలలో భాగంగా మహాత్ముని గురించిన ఉపన్యాస కార్యక్రమాలను త్వరలోనే ఏర్పాటు చేయాలని కూడా సమితి ఉద్దేశిస్తున్నది.

ఘనాలో భారతదేశం తరపున హైకమీషనర్ శ్రీ ఎ.ఎస్. మెహతా, గాంధీజీ ప్రదర్శనకు అవసరమైన యావత్తు సరంజామా కల చిన్న పెట్టెను, మహాత్మునిగురించి వ్రాయబడిన గ్రంథాలసంకలనాన్ని, ఘనాలో ఆషాంటీ ప్రాంతం పరిపాలనకు సంబంధించిన ప్రాంతీయ సంఘాధ్యక్షునకు కుమాసి నగరంలో ఆగస్టు 22వ తేదీన కానుకగా ఇచ్చారు. ఆ సందర్భంగా మాట్లాడుతూ మెహతా, గాంధీ శతజయంతి కార్యక్రమాల నిర్వహణలో అమిత శ్రద్ధ కనబరుస్తున్నందుకు ఘనా ప్రభుత్వానికి ధన్యవాదాలు అర్పించారు.

ఆ కానుకను స్వీకరిస్తూ ప్రాంతీయ సంఘాధ్యక్షులు, గాంధీ ప్రదర్శనను ఆషాంటీ ప్రాంతంలో పలుచోట్ల ఏర్పాటు చేయగలమనీ, అందువల్ల మహాత్ముడు ఏ సిద్ధాంతాల కోసం పోరాడేరో, అవి ప్రజల హృదయాలలో నిలిచిపోగలవని అన్నారు.

శతజయంతి శ్రద్ధాంజలి

నదీరా

కాలం ప్రసవించినట్టి
చైతన్య మహా స్రవంతి
కల కానిది వెల లేనిది
గాంధీజీ శత జయంతి

ద్వేషభావములను తుడిచి
దేశమునకు దిగ దుడిచి
పారవేయమంటున్నది
బాపూజీ శత జయంతి

హింసను వర్జించమం
ధ్వంసకై తపించమంది
మత్సరాలు వలదన్నది
మహాత్మాజీ శతజయంతి

ప్రతి హింసా ప్రతిహింసకు
బాటయౌను మరువద్దని
పగవద్దని చాటుతోంది
బాపూజీ శతజయంతి

తెలివి కలిగి కలిసి మెలగి
వెలుగువైపు కదలమంది
"కలుగు" బతుకు వలదనంది
గాంధీజీ శతజయంతి

ఆంధ్రప్రదేశ్ పర్యటనలలో

ఈ శతాబ్ది రెండూ, మూడూ దశాబ్దాలలో గాంధీజీ భారత దేశమంతటా ఆసేత సీతనగ పర్యంతమూ పర్యటించారు. ఊరూరా, వాడ వాడలా తిరిగారు. అదొక మహాయాత్ర. ఎన్నో కొత్త విషయాలను తెలుసుకోవడానికి, ఎందరో సాటివారిని కలుసుకోడానికి, ప్రజాభిప్రాయాన్ని అవగాహన చేసుకోడానికి, వారికి కొత్త సంగతులు తెలపడానికి అదొక మహాయాత్ర. పరాయి పాలకుల కరకు పాలనకు వ్యతిరేకంగా సుదీర్ఘమైన పోరాటం సాగించడానికి సాగించిన యాత్ర అది.

అందుకే ఆయన మనరాష్ట్రంలో కాలూనిన ప్రతి వూరికీ, ప్రతి గ్రామానికీ ఒక ప్రత్యేకత వుంది. ఆయన పాదముద్రపడిన ప్రతిచోటుకీ ఒక చరిత్రాత్మక ప్రాధాన్యంవుంది. ఆ వూళ్ళూ, ఆ గ్రామాలూ, ఆ చోట్లూ మన దేశ స్వాతంత్ర్య పోరాట చరిత్రలో అంతర్భాగాలుగా వున్నాయి. ఆంధ్ర ప్రదేశ్‌లో గాంధీజీ సందేశం ప్రతిధ్వనించిన పుణ్యభూములుగా పరిగణింపబడుతున్నాయి.

రాజమండ్రి

మహాత్మాగాంధీ తమ పర్యటనల్లో మొత్తం మూడుసార్లు రాజమండ్రికి విచ్చేశారు. స్థానిక నాయకులైన గజ్వెల్లి రామచంద్ర రావు, డా॥ సుబ్రహ్మణ్యం గారల అభ్యర్థన మేరకు 1921 మార్చి నెలలో చివరి పక్షంలోనూ, ఏప్రిల్ నెలలో మొదటి పక్షంలోనూ రాజమండ్రిని గాంధీగారు సందర్శించారు. సహాయ నిరాకరణ విధానం గురించి అప్పుడు గాంధీగారు ప్రజలకు తెలియజెప్పారు. 1921 ఏప్రిల్ 4వ తేదీన ఒక బహిరంగ సభలో కందుల వీర రాఘవస్వామిగారనే సుప్రసిద్ధ న్యాయవాది, గాంధీజీ ఎదుట తాను తన న్యాయవాద వృత్తిని వదులుకుంటున్నట్టు ప్రకటించారు. గాంధీజీ స్వరాజ్యనిధికి విరాళాలు యివ్వించమనిచేసిన అభ్యర్థనపై గోదావరి ఖిలాఫత్ కమిటీ కార్యదర్శి అయిన శ్రీ అన్వారుల్ జమాన్‌గారు రూ. 200లు, స్థానిక తోళ్ళవ్యాపారి జనాబ్ సయ్యద్ హుస్సేన్ సాహెబ్ గారు రూ. 100 ల విరాళం యిచ్చారు. 1933 డిశంబరు 26న మహాత్మాగాంధీకి బ్రహ్మాండమైన స్వాగతం యిచ్చారు. ఆహ్వాన సంఘాధ్యక్షులు శ్రీ అరవ ఆదినారాయణ మూర్తిగారు స్వాగతం పలుకగా, పురపాలక సంఘాధ్యక్షుడు శ్రీ పి. గోవిందరావు నాయుడుగారు సన్మానపత్రం చదివారు.

గాంధీజీ సందేశం

1946 జనవరి 20 న మళ్ళీ గాంధీగారు రాజమండ్రికి వచ్చారు. అప్పుడు ఆయనకు అసంఖ్యాకంగా సన్మానపత్రాలు, నిధులు సమర్పించారు.

కాకినాడ


1921 ఏప్రిల్‌లో గాంధీగారి కాకినాడ సందర్శనకు ఒక ప్రత్యేకత వున్నది. వారి ప్రసంగాన్ని తూర్పు గోదావరి జిల్లా కాంగ్రెసు కమిటీ కార్యదర్శి శ్రీ బులుసు సాంబమూర్తిగారు తెలుగులోకి అనువదించి చెప్పారు.

1929 మే 4న మళ్ళీ గాంధీగారు కాకినాడను సందర్శించారు. అప్పుడు కాకినాడ మహిళల తరపునా, హిందూ బాలికా పాఠశాల తరపునా శ్రీమతి జి. దుర్గాబాయి (ప్రస్తుతం శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్) గాంధీజీకి స్వాగత పత్రం సమర్పించారు. 1933 డిశంబరు 25న మరొకసారి గాంధీగారు కాకినాడకు విచ్చేసినప్పుడు వారికి కాకినాడ పురపాలక సంఘంవారూ, ఆంధ్ర శ్రీ సమాజం వారూ సన్మాన పత్రాలనూ, నిధులనూ సమర్పించారు.

1946 జనవరి 21న కూడా గాంధీగారు కాకినాడకు వచ్చారు. అప్పుడు కూడా అనేక సన్మానపత్రాలు, నిధులు సమర్పించబడ్డాయి.

బెజవాడ

1921 ఏప్రిల్ 1న బెజవాడలో జరిగిన అఖిల భారత కాంగ్రెసు సంఘం సమావేశానికి ఒక చరిత్రాత్మకమైన ప్రాముఖ్యం వుంది. బెజవాడ పురపాలక సంఘం అధ్యక్షులైన శ్రీ హనుమంత రావుగారు అవిరళ కృషి జరిపి ఆ సమావేశాన్ని విజయవంతం చేశారు. అప్పుడు గాంధీగారికి రాజా మంత్రి ప్రగడ భుజంగరావు గారు స్వాగతం పలికారు. ఆంధ్ర కేసరిగా ప్రసిద్ధికెక్కిన శ్రీ టంగుటూరి ప్రకాశంగారూ, శ్రీ వేమవరపు రామదాసు పంతులు



కాకినాడలో గాంధీజీ బస ముందు చేరిన జనసమూహం.

గారూ, శ్రీ భోగరాజు పట్టాభి సీతారామయ్యగారూ ఆ సమావేశానికి హాజరైనవారిలో ఉన్నారు. అఖిల భారత విశ్వకర్మ సభ అధ్యక్షులైన శ్రీ గవల రామమూర్తిగారు గాంధీజీకి స్వాగతం చెప్పారు. 1933 డిసెంబరు 16న మళ్ళీ గాంధీగారు బెజవాడకు వచ్చారు. వారికి సర్వశ్రీ మాగంటి బాపినీడుగారూ, కొండా వెంకటప్పయ్య పంతులుగారూ, కె నాగేశ్వరరావుగారూ, బులుసు సాంబమూర్తిగారూ, పండిత సత్యనారాయణగారూ, ఎన్. జి. రంగాగారూ శ్రీమతి దుర్గాబాయిగారూ స్వాగతం చెప్పారు. దుర్గావిలాస్‌లో జరిగిన మహిళల సభలో గాంధీగారి హిందీ ప్రసంగాన్ని దుర్గాబాయిగారు తెలుగులోకి తర్జుమా చేశారు. అప్పుడే మొగల్రాజపురానికి చెందిన అరవయ్యేళ్ళ వృద్ధురాలు శ్రీమతి రామశేషమ్మ గాంధీగారికి నూటపదహార్లను విరాళంగా సమర్పించింది.

1946 జనవరి 22న లక్షకుపైగా ప్రజలకు బెజవాడలో గాంధీగారి దర్శనభాగ్యం లభించింది.

1946 ఫిబ్రవరిలో బెజవాడ నుంచి ప్రత్యేక రైలులో పర్యటనకు బయలుదేరిన గాంధీగారివెంట దక్షిణ భారత హిందీ మహాసభ కార్యదర్శి శ్రీ మోటూరి సత్యనారాయణగారూ, ఆంధ్ర రాష్ట్ర హిందీ ప్రచారసభ ఉపాధ్యక్షులు శ్రీ జి. సీతారామ శాస్త్రిగారూ, శ్రీ ఉన్నవ గోపాల కృష్ణయ్య గారూ వున్నారు.

మచిలీపట్నం

1921 ఏప్రిల్ 4వ తేదీన గాంధీజీ మచిలీపట్నం సందర్శించినప్పుడు మునిసిపాలిటీ అధ్యక్షుడు బార్-అట్-లా శ్రీ శీలం జగన్నాధరావు నాయుడు ఆయనకు స్వాగత పత్రం సమర్పించారు. శ్రీ తాడేపల్లి నాగభూషణం అనే దేశభక్తుడు స్వరాజ్య నిధికి రూ. 1,001 విరాళం ఇచ్చారు.


1929 ఏప్రిల్ 14వ తేదీన గాంధీజీ మచిలీపట్నం సందర్శించిన సందర్భంలో ప్రజలు ఆయనకు నిధులు సమర్పించారు.

1933 డిసెంబరు 19వ తేదీన గాంధీజీ మళ్ళీ ఒక పర్యాయం మచిలీపట్నం వచ్చారు. అప్పుడు ఆయన శ్రీ కొండా వెంకటప్పయ్య పంతులుగారిని "ఆంధ్ర దేశపు కురువృద్ధులు" అని వర్ణించారు. పట్టాభి సీతారామయ్యగారూ, ఆయన కుటుంబ సభ్యులూ, "రామయోగిని" అని పిలవబడుతున్న పిచ్చమ్మ అనే హరిజన మహిళా గాంధీజీని కలుసుకున్నారు.


జాతీయ కళాశాల

''ఈ సంస్థను గురించి నేను పెట్టుకున్న ఆశలు పూర్తిగా ఫలించినట్లు యీ రెండు రోజుల్లో గ్రహించాను. ఇక్కడి ప్రతి అంగుళంలో ఒక పద్ధతీ, నిర్వహణ సామర్థ్యమూ, త్యాగనిరతీ కనిపిస్తున్నాయి. భారతీయుడిగా నాకు యిది నిజంగా గర్వకారణం .... సాధారణంగా నేను తొందరపడి ఏ సంస్థనూ పొగడను కాని యీ రెండు రోజుల్లో యీ సంస్థను గురించి నాకు కలిగిన ఊహలు బైటపెట్టకపోతే, నాకూ మీకూ అన్యాయం జరిగినట్టే''....

[మచిలీపట్నం సభలో : 1921 ఏప్రిల్]



నవారు
గువారు



హిందూపూర్‌లో జరిగిన బహిరంగ సభలో

నెల్లూరు

1921 ఏప్రిల్ 7వ తేదీన గాంధీజీ నెల్లూరును సందర్శించారు. ఆ సమయంలో ప్రసిద్ధ కాంగ్రెసు నాయకుడు శ్రీ చెరుకువాడ నరసింహం ఆయన వెంట ఉన్నారు. 1929 మే రెండవ వారంలో గాంధీజీ నెల్లూరు వచ్చినప్పుడు, శ్రీమతి పొణకా కనకమ్మ అనే కార్యకర్త అభ్యర్థనను మన్నించి అచ్చట కస్తూర్బా దేవి విద్యాలయానికి శంకుస్థాపన చేశారు. ఆమె మహాత్మునికి రూ. 281ల నిధిని కూడా సమర్పించింది. శ్రీ తిక్కవరపు రామిరెడ్డి, న్యాయవాదుల సంఘం తరపున బాపూజీకి రూ. 1008ల నిధి అందజేశారు. ఇంకా అనేక ఇతర విరాళాలుకూడా సమర్పించబడినవి. 1934 జనవరి మొదటి తేదీన సింహపురి హిందీ ప్రచారమండలి, మహిళా సంఘం, కస్తూర్బా దేవి బాలికా పాఠశాల, మునిసిపల్ కౌన్సిలు, జిల్లా న్యాయవాదుల సంఘం, హరిజనా సేవా సంఘాల పక్షాన మహాత్మునికి స్వాగత పత్రాలు, నిధులు సమర్పించబడినవి.

గాంధీజీ
బహిరంగసభలో
ినప్పుడు



నెల్లూరు కాంగ్రెసు కమిటీ 1946 జనవరి 28వ తేదీన భారతజాతీయ సైనిక నిధి సంఘం తరపున మహాత్మునికి రూ. 1,116ల మొత్తాన్ని సమర్పించింది.

గాంధీజీ, 1929 మే 8వ తేదీన సీతానగరం సందర్శించి అనేక విరాళాలను స్వీకరించారు. గౌతమీ సత్యాగ్రహాశ్రమంలో 1929 మే 9వ తేదీన ఆంధ్రదేశ ఖాదీ కార్యకర్తల మహాసభ బాపూజీ సమక్షంలో జరిగింది. ఆ మహాసభలో డా. పట్టాభి సీతారామయ్య, శ్రీ మాగంటి. బాపినీడు, శ్రీమతి దుర్గాబాయి, శ్రీ తెన్నేటి విశ్వనాథం ప్రభృతులు పాల్గొన్నారు.

1929 మే 9వ తేదీన, సీతానగరం గ్రామ ప్రముఖుడు శ్రీ నలగన చంద్రయ్య రూ. 4,000 లు విలువచేసే 8 ఎకరాల భూమిని గాంధీ ఆశ్రమానికి విరాళంగా ఇచ్చారు. హరిజన సేవాశ్రమ స్థాపకులైన డా. సుబ్రహ్మణ్యం 1938 డిసెంబరు 26వ తేదీన గ్రామస్థుల పక్షాన గాంధీజీకి రూ. 700ల మొత్తం సమర్పించారు. గాంధీజీ బసచేసే నిమిత్తం, సీతానగరం ఆశ్రమంలో, శ్రీ వినుకొండ వెంకటరత్నం, డా. బి సుబ్రహ్మణ్యం, శ్రీ జి. సీతారామ శాస్త్రీ ఒక ప్రత్యేక కుటీరం కట్టించారు.

బాపూజీ బోనకల్లు స్టేషనుకు చేరుకున్నప్పుడు ప్రఖ్యాత ఆంధ్ర నాయకులు, శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావు, జయంతిపురం జమీందారుతోనూ పశ్చిమ కృష్ణాజిల్లా కాంగ్రెసు కమిటీ కార్యదర్శ

చీరాల పౌరులు

"చీరాల పౌరుల సాహస జీవితాలను నేను సగౌరవంగా గమనిస్తూ వుంటాను. భారతదేశ చరిత్రలో ఒక కొత్త శకానికి మీరు నాంది పలుకుతున్నారు. యావద్భారత జాతి మీ వైపు చూస్తున్నది . . . . అహింసాయుతంగా, భగవంతుడే సాక్షిగా యావత్ప్రపంచాన్నీ ధిక్కరించండి" . . . .

[చీరాల సభలో : 1921 ఏప్రిల్]

లతోనూ కలసి మహాత్మునికి పూలమాలవేశారు. మునగాల జమీందారు రాజా నాయని వెంకటరంగారావు, ఖద్దరు నిధికి సంబంధించిన సాంకేతిక శాఖనిమిత్తం రూ. 1,500 ల మొత్తాన్ని గాంధీజీకి పశ్చిమ కృష్ణానుంచి విరాళం అందజేశారు.

తిరుపతి :

గాంధీ మహాత్ముడు 1934 జనవరి మొదటి తేదీన తిరుపతి సందర్శించి అచ్చట బ్రహ్మాండమైన సభలో ప్రసంగించారు. సర్వశ్రీ ఎం. అనంత శయనం అయ్యంగార్, టి. కె. నరసింహాచారి, దేవస్థానం కమిటీ సభ్యుడు రావు బహద్దూర్, డి. ఎ. రామలింగం చెట్టి, తిరుమల తిరుపతి దేవస్థానం కమీషనరు రావు బహద్దూర్, కె. సీతారామరెడ్డి ఆ సందర్భంలో మహాత్ముని కలుసుకున్నారు.

1933 డిసెంబరు, 1934 జనవరి నెలల్లో గాంధీజీ ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించారు. ఆ సందర్భంలో ఆయన నంద్రిగామ, ఇబ్రాహింపట్నం, రెంటచింతల, గుంటూరు, అరుగులపారు, మొగల్రాజపురం, పటమట, కపిలేశ్వరపురం, పెద నందిపాడు, నల్లేరుపాలెం, భట్టిప్రోలు, గోరాడు, అమృతలూరు, తెనాలి, ఏలూరు, నాయుడుగూడెం, తాడెపల్లిగూడెం, ఉండి, పెనమెంట్ర, ఆచంట. ఆనందనికేతం, కొవ్వూరు, దొమ్మేరు, తణుకు, విశాఖపట్నం, చోడవరం, అనకాపల్లి, ఏటికొప్పాక, కైలాసపట్నం, తుని, రాజోలు, అమలాపురం, బొడసకుర్రు, ఫెర్రి, ముగ్గుల, రేపాక, సీతానగరం, వెంకలపూడి, పోలవరం, పొన్నూరు, ఆలూరు, కావలి, అన్నవారి పాలెం, చిత్తూరు, ముద్దనూరు, ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరు, ఈడ్పుగల్లు, చల్లపల్లి, రాళ్లపాలెం, తెనాలి, ఐతానగరంపాడు, ఇంటూరు, సామర్లకోట, పెద్దాపురం, గొల్లపాలెం, రామచంద్రాపురం, రాళ్లపాడు, నిడదవోలు, ముల్కాలపల్లి, తణుకు, భీమవరం, భీమడోలు, కైకరం, దెందులూరు నర్సాపురం, పిఠాపురం, ఎలమంచిలి, గూడూరు, కావలి, ఆలూరు, బుచ్చిరెడ్డిపాలెం, వెంకటగిరి, రేణిగుంట, రాజంపేట, కడప, గుత్తి, పెద్దవండుగూరు, గుంతకల్, కొరకొండ, ఉరవకొండ, నెల్లిమర్ల మొదలైన అనేక ముఖ్య ప్రదేశాలను సందర్శించారు.

నెల్లూరు జిల్లా పర్యటన నిజానికి ఎంతో అహ్లాదకరమైనది. ఈ పర్యటన సందర్భంలో అధిక మొత్తాలలో విరాళాలు లభించడం, సభలు ఎంతో క్రమశిక్షణతో జరగడం ప్రత్యేకించి చెప్పుకోదగిన విశేషాలు. కావలిలో పర్యటన ప్రారంభమైంది. అచ్చట ప్రసంగిస్తూ, బాపూజీ హరిజనోద్ధరణకొరకు వసూలుచేసిన మొత్తాలను ఆ కార్యానికి మాత్రమే వినియోగించడం జరుగుతుందని ప్రజలకు హామీ ఇచ్చారు.

బుచ్చిరెడ్డిపాలెంలో జరిగిన మహిళల సమావేశంలో శకుంతల అనే బాలిక బాపూజీకి తన చేతిగాజులను సమర్పించింది. బాపూ ఆ బాలిక బుగ్గను అప్యాయంగా నిమురుతూ, చిన్న అమ్మాయిసైతం ఆభరణాలు అర్పిస్తున్నదని ఆశ్చర్యం, ఆనందం వెలిబుచ్చారు.


అనేకమందిమహిళలు గాంధీజీకి రూపాయలనోట్లుఇచ్చారు. 'నగలేవీ'అని ఆయన తన కోర్కెను తెలుగులో పునరుద్ఘాటించారు. అందరూ నోట్లు యిస్తున్నారు. కానీ నాకునగలు కావాలి." అన్నారు.

1933 డిసెంబరు 16 వ తేదీనుండి 1934 జనవరి 4 వ తేదీ వరకు ఆంధ్రదేశంలో జరిగిన గాంధీజీ పర్యటన ఫలప్రదమైంది. ఎక్కువగా రైలు మార్గంగానూ, రోడ్డు మార్గంగాను, కాలినడక ద్వారాను, లాంచీల ద్వారాను, 1708 మైళ్లు ఆయన పర్యటించారు. ఆయన యీ పర్యటన సందర్భంలో 76 గ్రామాలను సందర్శించారు. 60 బహిరంగసభల్లో ప్రసంగించారు. దాదాపు 6,20,000 మంది ప్రజలు ఆయన ప్రసంగాలను విన్నారు.

తెలంగాణాలో

శ్రీ మాడపాటి హనుమంతరావుగారి అభిప్రాయాన్ని అనుసరించి, గాంధీజీ, పూర్వపు హైదాబాదు రాష్ట్రం మార్గంగా ఎనిమిదిసార్లు వెళ్లినప్పటికీ వాస్తవంగా ఆయన 1925, 1927, 1929 లలో మూడు సార్లు అప్పటి రాష్ట్రాన్ని సందర్శించారు శ్రీమతి సరోజనీ నాయుడుతో యిక్కడికి వచ్చారు. కీర్తిశేషులు శ్రీ వామన్‌నాయక్, డా. బూర్గుల రామకృష్ణారావు, శ్రీ రామచంద్ర నాయక్, బార్‌ఎట్‌లా, శ్రీ వాసుదేవరావు, (సంపాదకుడు, ముషీరె-దక్కన్) తదితరులు ఆయనకు స్వాగతం చెప్పారు. నిర్ణీత పర్యటన కార్యక్రమం సందర్భంలో గాంధీజీకి సహాయపడాల్సిందిగా శ్రీ మాడపాటి హనుమంతరావును కోరారు. కీ. శే. కొండా వెంకటప్పయ్య పంతులు, శ్రీ ఎం. కాశేశ్వరరావు గాంధీజీ వెంట ఉన్నారు. రాజా పన్నాలాల్‌పిట్టి, రాజా ధన్‌రాజ్ గిరిజీలతో సహా వాణిజ్య వర్గాలవారు సహకారం అందజేశారు. గాంధీజీ పర్యటించిన అన్ని సందర్భాలలో నిజాం కళాశాల చరిత్ర విషయాల మాజీ ప్రొఫెసరు శ్రీ సిరుగురి హనుమంతరావు గాంధీజీని వ్యక్తిగతంగా కలుసుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు పూర్వపు హైద్రాబాదు ప్రభుత్వం, రాజా బహదుర్ వెంకట రామారెడ్డిని, శ్రీ ఎస్. ఎస్. రెడ్డిని పంపింది. శ్రీ రామచంద్ర నాయక్, శ్రీ భాగ్యారెడ్డివంటి యువ కార్యకర్తలు స్వల్ప వ్యవధిలో బహిరంగసభలు ఏర్పాటు చేసి హరిజన నిధికి అధిక మొత్తంలో విరాళాలు సేకరించారు. వివేకవర్ధనీ ఉన్నత పాఠశాలలో బహిరంగసభ ఏర్పాటు చేయబడింది. అక్కడ హరిజన నిధి నిమిత్తం తల ఒక్కంటికి రూ.5 ల చొప్పున విరాళాలు సేకరించారు.

రాజా పన్నాలాల్‌జీ పిట్టి సోదరుడైన కీ. శే. శ్రీ నారాయణ్‌లాల్, మంగల్ హాట్‌లో స్థాపించిన పాఠశాలను ఆయన సందర్శించారు. సికింద్రాబాదులోని గిరిజన హాస్టల్‌ను కూడా గాంధీజీ సందర్శించారు.



సరిహద్దు గాంధీ

కాకా కలేల్కర్

బాద్షాఖాన్‌గాను, సరిహద్దు గాంధీగాను ప్రసిద్ధిగాంచిన ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ కలకాలం గుర్తుండే నాయకుడు. పరస్పరం ద్వేషించుకోవడం వల్లనూ, హత్యాకాండల వల్లనూ, సమాజం నశించి పోతుందనే విషయాన్ని గుర్తించిన మొట్టమొదటి పఠాన్ శ్రేష్ఠుడాయన. ప్రతీకార వాంఛవల్ల, ఉత్కృష్టమైన సంస్కృతి సైతం భ్రష్టమైపోతుంది. అందుచేత ఆయన ఖుదాయ్ ఖిద్మత్ గార్ల సంస్థను—అంటే పరమాత్ముని సేవకుల సంస్థను స్థాపించారు. ఆయనకు గాంధీజీ యొక్క అహింసా సిద్ధాంతంలో తన పఠాన్ ప్రజల విముక్తికి మార్గం కనిపించింది. ఆయన భారతదేశ స్వాతంత్ర్యానికై దేశస్థులలో కలిసి పోరాడడాన్ని తమ లక్ష్యంగా స్వీకరించారు. హిందూ–ముస్లిముల ఐక్యత కొరకూ, రాజకీయ పవిత్రతను పరిరక్షించడం కొరకూ ఆయన గాంధీజీతో కలిసి పని చేశారు.

పరిశుద్ధత, సుహృద్భావం కలిగిన ఋషితుల్యుడైన వ్యక్తి ఆయన. గఫార్ ఖాన్ ఆజాను బాహుడు. ఆయన వాక్కులు ప్రేమ, వాత్సల్యాలతో నిండి ఎదుటి వారి అభిమానాన్ని, గౌరవాన్ని చూరగొనేవిగా వుంటాయి.

ఎవరి దృష్టినీ ఆకర్షించకుండా ఏకాంత ప్రదేశంలో ధ్యానముద్రలో నిమగ్నుడై వున్న గఫార్ ఖాన్‌ను చూచి ఆయనను బాగా అర్థంచేసుకునే అవకాశం నాకు కలిగింది. ధ్యానం చేయడంలో కొత్త ఏమీ లేదు. కాని యితరులు తనను చూసి దైవభక్తుడు అనుకోవాలనే కీర్తి కాంక్షతో ధ్యానం చేసేవారికీ, తమ భౌతిక అస్తిత్వాన్ని మరచిపోయి ధ్యానంలో తన్మయత్వం చెందేవారికీ మధ్య చాలా అంతరం వుంది. బాద్షాఖాన్ నిజమైన దైవభక్తుడు. ఆయన మిత్రులను, శత్రువులను సైతం సమానంగా ప్రేమించాడు. అయితే తప్పిదమన్నా, కపటమన్నా, భేషజమన్నా ఆయనకు ఏవగింపు. ఆయన సిసలైనా భగవత్ సేవకుడు

బ్రిటీష్ పాలనలో గఫార్ ఖాన్‌ను పంజాబులోనికి ప్రవేశించరాదని నిషేధించారు. ఆ సందర్భంలో ఆయన తన కుటుంబానికి చెందిన ఒక బాలుడు, ఒక బాలికతో సహా వార్ధాలో గాంధీజీతో కలిసి వుంటున్నారు. గాంధీజీతో కలిసి ఉదయం పూట మేమందరం వ్యాహ్యాళికి వేళ్ళేవాళ్ళం. వార్ధా చుట్టు ప్రక్కల ప్రదేశాలలో రాళ్లు చాలా ఎక్కువగా వున్నాయి. వ్యాహ్యాళికి వెళ్ళినప్పుడు చేలలో నుంచి చిన్న రాళ్లను ఏరి పట్టుకొని వచ్చి వాటిని మహిళా

ఆశ్రమంలో ఏమైనా అవసరానికి ఉపయోగిస్తే బాగుంటుందన్న ఆలోచన ఆయనకు వచ్చింది. దీనిననుసరించి అందరం తిరుగు ప్రయాణంలో రాళ్లు పట్టుకొని బయలుదేరాం. నేను రెండు చేతులతో రెండు రాళ్ల సంచులు తీసుకొని వెళ్లాను. బాద్షాఖాన్ తమ చొక్కా నిండా రాళ్లు పోసి రెండు చేతులతో దానిని పట్టుకొని నడిచారు.

వ్యాహ్యాళి నుంచి తిరిగి వచ్చిన తరువాత కస్తూర్బా గాంధీజీ పాదాలు కడిగేవారు. అయితే ఈపాద సేవను బాద్షాఖాన్ చేపట్టారు. సరిహద్దు గాంధి, మహాత్మా గాంధీకి పాద సేవను చేసిన దృశ్యం అద్భుతమైనది. ఉదయం గాంధీజీ గఫార్ ఖాన్‌కు పండిన తాజా ఆపిల్ యిస్తుండేవారు. గఫార్ ఖాన్ ఆ పండును చేతితో పట్టుకొని చాకుకు బదులు పండ్లకు పని కల్పించి, దాని రుచిని ఆస్వాదిస్తూ ఆరగించేవారు.

కొంత కాలం తరువాత ఆయన సోదరుడు డాక్టర్ ఖాన్ కూడా అక్కడికి వచ్చారు ఆయన చాలా సరసుడు వారుభయుల తోనూ సంభాషించే అవకాశం నాకు కలిగింది వారిద్దరిలో నాకు భేదం కనిపించినప్పటికీ, భారత దేశ స్వాతంత్ర్యానికై ప్రాణ త్యాగం చేయాలన్న దృఢ సంకల్పాన్ని వారుభయులలోనూ నేను చూశాను. స్వతంత్రం లేని ప్రజలకు మతం కూడా వుండదని బాద్షాఖాన్ నాతో తరచుగా అంటుండేవారు దేవుని పట్ల, మానవాళి పట్ల మనిషి నిర్వర్తించవలసిన మొదటి కర్తవ్యం స్వాతంత్ర్య సాధన అన్నది ఈ మహనీయుని సూక్తి.

గాంధీజీ సరిహద్దు రాష్ట్రాన్ని సందర్శించ దలచినప్పుడు, బొంబాయి గవర్నరు బాద్షాఖాన్ చేసిన ఒక సాధారణ ప్రసంగాన్ని పురస్కరించుకొని ఆయనను జైలుకు పంపాడు. తత్ఫలితంగా గాంధీజీ తమ పర్యటనను వాయిదా వేసుకొనవలసి వచ్చింది. ఆ తరువాత గాంధీజీ సరిహద్దు రాష్ట్రాన్ని సందర్శించారు. ఆ పర్యటనను గురించిన విశేషాలన్నింటినీ తరువాత స్వర్గీయ మహాదేవ భాయ్ దేశాయ్ నాకు వివరించి చెప్పారు.

ప్రముఖ భారతీయ నాయకుడు దాదాభాయ్ నౌరోజీ పుత్రిక అయిన ఖుర్షీద్ బెహన్ మనందరికీ తెలుసు ఆమె శారీరకంగా బలహీనంగా వుండేది. కాని ఆమెలోని ఆధ్యాత్మిక శక్తి చాలా బలిష్ఠమైనది. బాద్షాఖాన్, తమ ఖుదాయ్‌ఖిద్మత్ గార్ల కార్యకర్తలను యిద్దరిని ఆమె వెంట రక్షణ కొరకు వుండనివ్వవలసిందిగా ఖుర్షీద్ బెహన్‌ను కోరారు. కాని ఆమె అందుకు నిరాకరిస్తూ "పఠానులందరూ నాకు సోదరులు కనుక, సోదరి తన స్వంత సోదరులనుంచి రక్షణను కోరకపోవడం సహజం" అని పేర్కొన్నారు. ఆమె పఠానులతో చనువుగా మెలిగి వారికి సేవచేసింది. వారికి విద్యా బోధన చేసింది. అక్కడ కూడా బ్రిటీష్ ప్రభుత్వం ఖుర్షీద్ బెహన్‌ను అరెస్టు చేసి జైలుకు పంపినట్లు నాకు గుర్తు. రక్షణ లేకుండా వున్న మగువపట్ల పఠాన్లు అవ్యాజమైన అనురాగం చూపడమూ, ఆమె రక్షణపట్ల శ్రద్ధ తీసుకోడమూ, వారు సరిహద్దు గాంధీ బోధనలకు ఎంతో గాఢంగా ప్రభావితులైనట్లు వెల్లడిస్తున్నాయి.

గాంధీజీ శతజయంతి ఉత్సవాలు

కార్యక్రమం

1969 అక్టోబరు 2	ప్రభాత ఫేరీలు. స్థానిక సమారోహాలు. విద్యార్థులు ప్రతిన పూనుట, అంతర్వర్ణ భోజనాలు, సామూహికంగా నూలు వడకుట, సాంస్కృతిక కార్యక్రమాలు.
అక్టోబరు 3 నుంచి 8 వరకు	స్థానిక సంఘాల ఆధ్వర్యంలో పై కార్యక్రమాల్ని అమలుజరపడం.
అక్టోబరు 9 నుంచి 22 వరకు	ఖాదీ. స్వదేశీ స్వయం సమృద్ధి పక్షోత్సవం.
అక్టోబరు 23 నుంచి నవంబరు 5 వరకు	జాతీయ సమైక్యతా పక్షోత్సవం
నవంబరు 6 నుంచి 18 వరకు	స్త్రీ, శిశు, యువజన పక్షోత్సవం
నవంబరు 19 నుంచి డిసెంబరు 2 వరకు	గ్రామస్వరాజ్యం, గ్రామదాన పక్షోత్సవం
డిసెంబరు 3 నుంచి 17 వరకు	మద్యపాన నిషేధం. మానవుని జీవనానికి కావలసిన ప్రాథమిక సౌకర్యాలు
డిసెంబరు 18 నుంచి 31 వరకు	అస్పృశ్యతా నిర్మూలన పక్షోత్సవం
1970 జనవరి 1 నుంచి 14 వరకు	సర్వధర్మ సమానత్వం
జనవరి 15 నుంచి 28 వరకు	'గాంధీజీ కలలుగన్న భారత దేశం' సదస్సుల పక్షోత్సవం
జనవరి 29 నుంచి ఫిబ్రవరి 12 వరకు	సర్వోదయ పక్షోత్సవం
ఫిబ్రవరి 13 నుంచి 22 వరకు	కస్తూర్బా పక్షోత్సవం

పరిపాలనా విషయాలు

రాష్ట్ర సలహా సంఘం

ప్రభుత్వోద్యోగుల విజ్ఞప్తుల పరిశీలనకు ఏర్పడిన రాష్ట్ర సలహా సంఘం సెప్టెంబరు 16 నుంచి 20 వరకు ఆంధ్ర, తెలంగాణా ప్రాంతాల నాన్‌గజెటెడ్ ఉద్యోగులకు చెందిన 473 విజ్ఞప్తులను పరిశీలించింది.

1969 ఏప్రెల్ నుంచి ప్రత్యేకంగా అయిదుసార్లు సమావేశమై యీ సంఘం 1,997 విజ్ఞప్తులను పరిశీలించి పరిష్కరించింది. వ్యక్తిగత విజ్ఞప్తులను కూడా యీ సంఘం విన్నది.

ఈ రాష్ట్ర సలహాసంఘం ఆరవ ప్రత్యేక సమావేశాన్ని అక్టోబరు 13 నించి 17 వరకు కొనసాగిస్తుంది. అప్పుడు పబ్లిక్ వర్క్సుశాఖ, న్యాయశాఖ, శాసనసభా విషయాలశాఖ, సాధారణ పరిపాలనశాఖ, ఆర్థికశాఖ యింకా తన పరిధిలోవున్న శాఖాధిపతుల కార్యాలయాలకు సంబంధించిన నాన్‌గజెటెడ్ ఉద్యోగుల విజ్ఞప్తులను పరిశీలిస్తుంది.

ముఠాదారీ, మాల్గుజారీ విధానాల రద్దు

ఎస్టేట్లు, జాగీర్లు, ఇనాములను రద్దుపరుస్తూ చట్టాలు రాష్ట్రంలో అమలులోవున్నా కొన్ని షెడ్యూల్డు ప్రాంతాలలో యింకా రెండుతరహాల మధ్యరకపు టెన్యూర్ విధానాలు—ముఠాదారీ, మాల్గుజారీ విధానాలు అమలులో వున్నాయి. తూర్పు గోదావరి, విశాఖపట్నం జిల్లాల్లో ముఠాదారీ పద్ధతి, ఖమ్మం జిల్లాలోని భద్రాచలం తాలూకాలో మాల్గుజారీ పద్ధతి ఉన్నాయి.

కొంతకాలం క్రిందట ప్రభుత్వం యీవిధానాలను రద్దుపరిచే నిబంధనలను రూపొందించి గిరిజన సలహామండలి ముందుంచడం జరిగింది. వీటికి రాష్ట్రపతి ఆమోదంకూడా లభించింది.

పిల్లలకు పాలసరఫరా

వర్తమాన విద్యాసంవత్సరంలో రాష్ట్ర రాజధానీ నగరంలో 20,000 మంది ప్రాథమిక పాఠశాలల్లోని పిల్లలకు సీసాపాలను సరఫరా చేయడానికి సంబంధించిన పథకాన్నొకదానిని రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. 'మధ్యాహ్న భోజన' కార్యక్రమం క్రింద ప్రస్తుతం ఇస్తున్న ఉప్మాతోపాటు ప్రతివిద్యార్థికి పావులీటరు పాలనుకూడా యిస్తారు.

ఈ పథకం కేర్ సంస్థ సహాయంతోనూ సమీకృత పాల ప్రాజెక్టు సహకారంతోనూ అమలుపరుస్తారు మొట్టమొదటిసారిగా జంటనగరాల పిల్లలకు సీలువేసిన సీసాలలో పాలను సరఫరా చేయబోతున్నారు మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని అమలు పరచడంలో సహాయం అందజేస్తున్న కేర్ సంస్థ యిప్పుడు యిందుకు అవసరమైన పాలపొడరును అందజేయడానికి ముందుకు వచ్చింది. పాలను ప్రాజెక్టునుంచి యిక్కడకు తీసుకురావడానికి తమ ఖర్చుతోనే వాహనాలను ఏర్పాటుచేయడానికి కూడా యీ సంస్థ అంగీకరించింది.

ఖమ్మం తాలూకా

ఖమ్మం జిల్లాలోగల 'ఖమ్మం మెట్టు' తాలుకా పేరును "ఖమ్మం' తాలూకాగా మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు చేసింది. ఈ మార్పువెంటనే అమలులోకి వస్తుంది.

శతజయంతి ఉత్సవాలు

ఒరిస్సాలోని జయపూర్ సంస్థానానికి చెందిన మహారాజు డా. విక్రమదేవవర్మ శతజయంతి ఉత్సవాలను జరిపించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక సంఘాన్ని నియమించింది. విక్రమ దేవవర్మ ఒరిస్సా ఆంధ్రప్రాంతాల సాంస్కృతిక సమైక్యతకు మూలస్తంభమై తెలుగు ప్రజకు చిరస్మరణీయులైనారు

ఈ సంఘానికి ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖమంత్రి—అధ్యక్షులు. ఒరిస్సా రాష్ట్ర సాంస్కృతిక వ్యవహారాలమంత్రి—ఉపాధ్యక్షులు. శ్రీ పి.వి.జి రాజు, శ్రీ దేవగుప్తా విశ్వేశ్వరరావు (విశాఖపట్నం) శ్రీ అచ్యుతరామరాజు (ఎం.ఎల్.సి.) శ్రీ ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి (నెల్లూరు) శ్రీ రాజభూషణరావు (హైదరాబాదు), సమాచార పౌరసంబంధశాఖ డైరెక్టరు, ఆంధ్ర విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు—వీరు సభ్యులు. విశాఖపట్నం కలెక్టరు ఎక్స్ఆఫీషియో సభ్యులు, సంఘం కన్వీనరు

ఈ శతజయంతి ఉత్సవాల నిర్వహణకై ప్రభుత్వం ఐదువేల రూపాయలను కూడా మంజూరుచేసింది

కొత్తజిల్లా

ఒంగోలు జిల్లాను కొత్తగా ఏర్పాటుచేయాలని ప్రభుత్వం తలపెట్టింది. ఎవరికైనా ఏవిధమైన అభ్యంతరాలున్నా, సూచనలున్నా తెలుపుకోవడానికి వీలుగా యీ విషయాన్ని తమ గజెట్‌లలో వేయవలసిందిగా ప్రభుత్వం కలెక్టర్లను ఆదేశించింది.

ఈ కొత్తజిల్లా ప్రస్తుతపు కర్నూలు, నెల్లూరు, గుంటూరు జిల్లాలకు సంబంధించిన కొన్ని భాగాలతో ఏర్పాటవుతుంది.

నెల్లూరు : దరిశి, పొదిలి, కనిగిరి తాలూకాలు; ఉలవపాడు గుడ్లూరు ఫిర్కాలు మినహా కందుకూరు తాలూకా

కర్నూలు: మార్కాపురం, గిద్దలూరు తాలూకాలు.

గుంటూరు: ఒంగోలుతాలూకా, చీరాలసబ్‌తాలూకా, బాపట్లతాలూకాలోని పర్చూరు ఫిర్కా, నర్సారావుపేట తాలూకాలోని మార్టూరు, కొమ్మాలపాడు ఫిర్కాలు. నర్సారావుపేట తాలూకాలోని రొంపిచర్ల ఫిర్కాకు చెందిన గురిజేపల్లి.

అరణ్య పర్వము:

మహాభారతము

తిరుపతి వేంకట (?)

వ్యాధుడు ఒకడు మృగములవేటకై అటవియందు తిరుగుచు దమయంతి యేడ్పును విని యచటికివచ్చి కత్తిచే ఆ సర్పపు పడగను చీల్చి దానిని చంపి, ఆమెను ఆదరించి అన్నముపెట్టి శాంతముగా కూర్చున్నప్పుడు ఆమె వృత్తాంతమునడిగి యంతయు తెలిసికొనెను. సగము వస్త్రము కట్టుకొని ముఖ్యావయవములు స్పష్టముగా కనపడుచుండగా ఆమె అతిలోకసౌందర్యమునకు ముగ్ధుడై కామించెను. అతని వాలకము చూచి దమయంతి క్రోధాగ్నిచే మండిపడుచుండెను. అతడు ఆమెపై బలత్కారము చేయ దలచికూడ ఆమె అగ్నిశిఖవలె మండుచుండుటచేత ఆమెను అంట జాలకపోయెను. అప్పుడు ఆమె, 'వాడు వట్టిమాటలతో ఆగనట్లు లే'డని తలచి, 'నేను పతివ్రతనే యయినచో, వీడు తక్షణమే మరణించుగాక' యని శపించెను. ఉత్తరక్షణములో వాడు అగ్నిచే దగ్ధమైన వృక్షమువలె నేలపైకూలి పడి మరణించెను.

అట్లు వ్యాధుని శపించి చంపి దమయంతి శూన్యవనమునందు పడి సాగిపోవుచుండెను. సింహవ్యాఘ్రాది క్రూర మృగములచేతను, చోరులచేతను, దుష్టులచేతను, పరివ్యాప్తమైన నానా వృక్ష సమీకర్ణము, గిరి నికుంజపరివ్యాతము, పిశాచ_రాక్షస_పక్షి గణ సంకులము, నదీ_సరో_వాపీ_తటాకాదులచేత అద్భుత దర్శనమునైన వనములో నలుని వెదకుచు విలపించుచు తిరిగెను. భర్తృ వ్యసనపీడితురాలైన దమయంతి ఆ వనమునందలి దేనికి భయపడలేదు. తుదకు అలసి ఒక శిలాతలమునందు కూర్చుని యిట్లు విలపించసాగెను:— "నాథా! నన్ను ఒంటరిగా విడిచిపోవ తగునా! అన్ని వేదవేదాంగములను అభ్యసించుటకన్న ఒక్క సత్యము ఉత్తమముకదా! అట్టి సత్యమును ఏల వీడుచుంటివి? ఈ ఘోరాటవిలో నశించుచున్న నన్ను పలుకరించవా!" అని వదరుచు కనపడిన మృగమును, చెట్టును, పర్వతమును, నలునిగూర్చి యడుగుచు, "రాజా! ఎక్కడనైన దాగియుండినచో, వెంటనేరమ్ము" అని నలుని పిలుచుచు, దుఃఖించుచు మూడహోరాత్రములుఉత్తర దిక్కుగా పోయిపోయి ఒకచోట నొకపవిత్రమైన మున్యాశ్రమమును చూచెను. అచ్చట బ్రహ్మర్షి సత్తములనేకులు నివసించుచుండిరి. దానిని చూచి సంతసించి యామె ఆ యాశ్రమములోనికి పోయి మహర్షులకు నమస్కరించి నిలిచెను. వారు ఆమెకు అతిథి సత్కారముచేసి, 'ఎవరు నీవు? నీకేమి కావలెను? ఇంత రూపసౌందర్యవతివి యీ వనదేవతవా? నిన్ను చూచి మాకు ఆశ్చర్యము కలుగుచున్నది. నీవు నదీదేవతవా? పర్వత దేవతవా?' అని యడిగిరి. ఆమాటకు ఆమె, నేను మీరు చెప్పినవారిలో నెవతెను గాను. నేనొక మనుష్యకాంతను, నాపేరు దమయంతి అని తన వృత్తాంతమంతయు చెప్పి దమయంతి 'మహాత్ములారా! మా నలుడు ఇక్కడకేమైన వచ్చియుండెనా? మీరతని చూచితిరా? అతడులేక నేను జీవించజాలను, అని విలపించుచున్న దమయంతి నిచూచి, దివ్యదృష్టితో నామె భవిష్యత్తును తిలకించి, 'కళ్యాణీ! నీవు త్వరలోనే నలుని చూచెదవు. సమస్త శుభములతో, సంపదలతో తులతూగుచు తిరిగి మీరు ఆ పట్టణమునే చేరి రాజ్యమేల గలరు', అని చెప్పి ఆమెను ఆశీర్వదించి ఆ తాపసోత్తములు అంతర్ధానము చెందుటను చూచి ఆమె ఆశ్చర్యపడెను. 'ఏమి యిది స్వప్నమా? ఆతాపసు లెక్కడ?' ఆ యాశ్రమము లేదే! ఆ నదులు, ఫల పుష్పశోభిత వృక్షము లెక్కడికి పోయెను?' అని చింతించుచు తిరిగి భర్తృ విరహ శోకముచేత తపించుచు నచటినుండి అడవిలో ముందుకు సాగిపోయెను. అచట నొక అశోక వృక్షమును చూచి, తన భర్త గురులు తెలిపి యతని జాడ తెలిసినచో తనకు తెలిపి తననుగూడ అవృక్షమువలెనే 'అశోక'ను చేయుమని వేడెను. అటనుండి ముందుకు పోయెను.

అనేక పర్వత నదీ నదములను దాటుచు పోయి ఒకచోట నొక వ్యాపారుల సంఘమును చూచెను. వారు అక్కడ నదిని దాటుచుండిరి. వారిని ఆమె సమీపించెను. వారిలో కొందరు ఆమెను చూచి భయపడి ఉరికిరి. కొందరు విచారపడిరి. మరి కొందరు అరచిరి. ఇతరులు నవ్విరి. కొంతమంది అసూయపడిరి. కొందరు మాత్రము ఆమెపై దయదలచి, 'కల్యాణీ!, నీవెవరు? నీవు వనదేవతవో, నదీదేవతవో, గిరిదేవతవో, అని మేము భయపడుచున్నాము. నిన్ను శరణుజొచ్చితిమి. మమ్ము రక్షింపుము. మేము క్షేమముగా వ్యాపారము ముగించుకొనిపోవునట్లు ఆశీర్వదించుము.' అని వేడుకొనిరి. ఆ మాటలు విని దమయంతి, 'నేను మీరు చెప్పినవారిలో నెవతెనుగూడ కాను. ఒక మనుష్యకాంతను.' అని తన వృత్తాంతి మంతయు తెలిపి, "మీరు నలుని ఎక్కడనైన జూచితిరా" యని యడిగెను. ఆ మాటకు ఆ వ్యాపారుల జట్టు పెద్ద 'శుచి' యనువాడు, 'మేము నలుని చూడలేదు. అతనిని ఎరుగము ఎన్నియో మృగములను చూచితిమి గాని నిన్ను దప్ప ఇతర మానవవ్యక్తిని మేము చూడలేదు. 'మణిభద్రు'డను

యక్షరాజు మమ్ము అనుగ్రహించి క్షేమముగా మా మార్గమును సాగించెను అతనికి నమస్కారము." అని చెప్పెను. 'మీరెక్కడికి పోవుచున్నారు.' అని దమయంతి యడిగిన ప్రశ్నమునకు అతడు మేము చేది దేశమునకు రాజైన 'సుబాహు'ని జనపదమ్మునకు పోవుచున్నాము. అతడు ధర్మాత్ముడు. ఆ రాజ్యములో మేము వ్యాపారముచేసి లాభములను సంపాదించుటకు పోవుచున్నాము.' అనెను.

ఆ సార్థవాహుల మాటలు విని దమయంతి వారి వెంటనే పతిని వెతుకుచు పోయెను. కొన్ని దినములు పయాణము చేయుచుండగా దారిలో వారొక పెద్ద చెరువును చూచిరి. దానిపేరు 'సర్వతో భద్రము'. అచట తృణ-కాష్ఠ-జల సమృద్ధి యుండి అనేక పుష్ప ఫల వృక్షములు శోభిల్లుచు నుండెను గనుక అది తమ నివాసమునకు ఆ నాటికి యోగ్యమని తలచి వారు తటాక పశ్చిమ తీరమునందు విడిసి, ఆనాటి అహారాది కార్యక్రమములు ముగించుకొని గజాశ్వవృషభాదులకు మేత, నీరు పుష్కలముగా సమకూర్చి రాత్రి సుఖముగా చెట్లక్రింద నిద్రించిరి అక్కడికి ఒక వన గజయూథము జల పానార్థమై వచ్చి, అచ్చటి నగర గజములను చూచి వానిని చంపదలచి వాని పై దాడిసలిపెను. అట్లు పైన బడుచున్న వన గజముల వేగమునకు అక్కడివి తట్టుకొనలేక భయపడి చెల్లా చెదరైనవి. ఆ గజముల మార్గమునకు అడ్డముగా వారు నిద్రించుచుండిరి. అవి ఆ సార్థ వాహులను త్రొక్కి చంపెను. చెదరిపోయిన వారుగూడ కొందరు భయభ్రాంతులై పడి చనిపోయిరి ఈ విధముగా ఆ గజములవలన అనేకులు చచ్చిరి. వారి హా హా కారములను విని దమయంతి మేల్కొనెను. చావగా మిగిలిన ఒకరిద్దరివలన ఆమె ఆ సంగతి వినెను వారు, "మేము యక్షరాజగు 'మణి భద్రుని,' 'వైశ్రవణు', ఇతర విఘ్నకారకులను పూజించలేదను కొనెదము. మంచి శకునము చూచి, సుముహూర్తమునందు మేము బయలు దేర లేదనుకొందుము. లేక వికృతాకారముతో అర్ధ నగ్నముగా వచ్చిన యా కాంత (దమయంతి) చేసిన మాయ కావచ్చు నిది యంతయనని యనుకొనిరి." ఈమె పిశాచి కావచ్చును. మనము చంపుదము" అని యనిరి. అది విని దమయంతి భయపడి, 'అయ్యో! నేను ఏ పాపము ఎరుగనే నాపైన ఈ దారుణకృత్య మేల జరుపబడుచున్నది. ఈ జన్మలో నేను ఏ దోషము చేయలేదు. ఇది నా పూర్వజన్మ పాపము కావచ్చును. భర్త, స్వజనము, పుత్రులు అందరు విడిపోయిరి, ఇప్పుడీ యాపద సంభవించెను. అని యేడ్చుచుండెను. మరునాడు ఉదయము చావగా మిగిలినవారు గూడ వెడలిపోయిరి.

'ఇందరు గజములచేత చచ్చినను నేను మిగులుట ఆశ్చర్యము. కాలము ఆసన్నము కాకున్నప్పుడు ఎంత ఘోరము ఏర్పడినను జీవి చావదు. దైవాజ్ఞ లేనిదే యే పనియు జరుగదు' అనుచు దమయంతి కొందరు బ్రాహ్మణులతో నడచిపోవుచు ఆ సాయంకాలము వరకు అర్ధ వస్త్రముతో చేదిపురమును చేరెను. అట్లు దీనయై వెంట్రుకలు విరియబోసికొని ఉన్మత్తురాలువలె పోవుచున్న దమయంతిని పురవాసులు చూచిరి. బాలకులు వినోదముగా నామెవెంట పోయిరి. వారి మధ్యలో నడచుచు నామె తిన్నగా రాజ సదనము చేరెను. ఆమెను రాజమాత చూచి దాసీ జనముచేత లోపలికి పిలిపించుకొనెను. ఆమె రూప సౌందర్యమును చూచి ఆశ్చర్యపడి రాజమాత 'నీవెవరు?' అని యడిగెను. దమయంతి ఆమెకు తాను పతివ్రతయగు నొక మనుష్య స్త్రీ ననియు, సైరంధ్రి జాతిలో పుట్టినదాన ననియు, ఇచ్ఛ వచ్చినచోట నివసింతు ననియు, తన భర్త అఖిల గుణ సంపన్నుడనియు. అతడు ద్యూతములో సకల సంపదలను ఓడిపోయి యడవులపాలయ్యె ననియు తన వృత్తాంత మంతయు తెలిపెను. ఆ మాటలు విని రాజమాత, 'కల్యాణీ; నీవు భయపడకుము. నావద్దనే యుండుము నీ భర్త లభించగలడు. అతనిని నేను వెదకించెదను.' అని చెప్పగా దమయంతి, 'ఎంగిలి తినను, ఇతరుల కాళ్లు కడుగను, పర పురుషులతో మాట్లాడను, నన్ను కామించి కోరువానిని దండించి వధ్యునిగా చేయవలెను. ఇది నా వ్రతము. భర్తను వెతకుటకు తగిన బ్రాహ్మణులను ఇక్కడ ఆశ్రయించెదను. ఈ వ్రత భంగమగు చోట నేను ఉండను.' అని చెప్పెను. ఆ మాటవిని రాజమాత తన కూతురగు 'సునందను పిలిచి, "బిడ్డా! ఈమె దేవతవంటిదగు సైరంధ్రిగా భావించుము. నీకు సమానమగు ఈడుగలది. నీకు ఈమె సఖిగా నుండును. మనస్సులో చింతలేక నీవు ఈమె సాహచర్యములో మెలగుచు ఆనందించుచుండుము." అని చెప్పెను. తల్లి మాటలకు సునంద మిగుల సంతుష్టురాలై దమయంతిని తోడ్కొని తన యింటికి పోయెను. దమయంతి సునంద యింటిలో ఏలాటి బాధయు లేకుండ గౌరవింప బడుచు, ఉచిత రీతిని కోర్కెలను తీర్చుకొనుచు నానందముతో నుండెను.

దమయంతిని విడిచిపోయిన నలుడు ఒకచోట అడవిలో దావాగ్నిని చూచెను. అది ఘోరముగా మండుచుండెను. దాని మధ్యనుండి ఒక భూతము 'ధర్మాత్ముడైన నలరాజా! త్వరగా వచ్చి నన్ను రక్షింపుము' అని భయముతో బిగ్గరగా మాటి మాటికి అరచి చెప్పెను. దానికి నలుడు 'భయపడకుము' అని చెప్పి ఆ యగ్ని మధ్యములో దూకి అక్కడ చుట్టగా చుట్టుకొని పడియున్న నాగరాజును చూచెను. అతడు చేతులు జోడించి నలునితో, "రాజా! 'నేను కర్కోటకు'డను నాగరాజును. ఒకనాడు నేను బ్రహ్మర్షియగు నారదుని మోసగించితిని అతడు కోప పడి, 'నలుడు వచ్చి నిన్ను ఉద్ధరించి కొనిపోవు వరకు ఇచ్చటనే కదలక స్థావరమువలె పడియుండుము.' అని నన్ను శపించెను. ఆ శాపమువలన నేను ఒక అడుగు గూడ కదల జాలక పడియున్నాను. నన్ను నీవు రక్షించిన తరువాత నీకొక హితమును ఉపదేశించెదను. నేను నీకు ప్రియమిత్రుడ నయ్యెదను. నాతో సమానుడగు పన్నగరాజు లేడు. నన్ను త్వరగా లేవనెత్తుకొని ఇక్కడినుండి వెడలిపొమ్ము నీకు భారముగాక తేలికగా అయ్యెదను." అని చెప్పి ఆ నాగేంద్రుడు అంగుష్ఠ మాత్ర ప్రమాణము గలవాడుగా నయ్యెను. అప్పుడు నలుడు తేలికగా నున్న కర్కోటకు నెత్తుకొని సులభముగా దావానలమునుండి వెలువడెను.

[సశేషము]

ఆంధ్రప్రదేశ్‌లో నక్సలైట్ల కార్యకలాపాలు: సమాజంపై వాటి ప్రభావం

జె. వెంగళరావు

నక్సలైట్ల కార్యకలాపాలు యిటీవల కొంతకాలంగా వార్తలలో వినిపిస్తున్నాయి. పశ్చిమ బెంగాలులోని నక్సల్‌బరీలో జరిగిన సాయుధపోరాటం ఆధారంగా 'నక్సలైటు' అనేపదం వాడుకలోనికి వచ్చినప్పటికీ దీని జన్మస్థానంలోనే యీ వుద్యమానికి స్థానం లేకుండా పోయింది. విప్లవం అనే మేలిముసుగు క్రింద, నక్సలైటు కార్యకలాపాలలో భాగంగా, వాస్తవంగా జరుగుతున్నది, విచక్షణా రహితమైన పచ్చి హింసాకాండ తప్ప మరొకటికాదు. కాబట్టి నక్సలైటు సాహసకృత్యాలకు సంబంధించిన సిద్ధాంతాలను తిరగ తోడడంకానీ, లేక అందుకోసం కమ్యూనిస్టు పార్టీలోనూ, వారి దృక్పథంలోనూ, వ్యూహంలోనూ వచ్చిన మార్పుల సరళిని పరిశీలించ పూనుకోవడం కానీ నిష్ప్రయోజనం.

'తుపాకీపట్టి అధికారాన్ని హస్తగతం చేసుకుందాం' అన్న నినాదం పర్యవసానమే హత్యలూ దోపిడీలూ మొదలైన హింసాచర్యలు అయినట్లు బోధపడుతుంది. ఈ నినాదం ఆంధ్రప్రదేశ్‌లోనూ, ఇతర ప్రాంతాలలోని అనేకపట్టణాలలోనూ గోడలపై కనిపించాయి. ప్రజాస్వామిక సామ్యవాదానికి అంకితమైన దేశానికి ఇది అసంబద్ధమైనది.

నక్సలైట్ల కార్యకలాపాలను మార్క్సిస్టు కమ్యూనిస్టులు సైతం ఖండించారు. దీనిని బట్టి మొత్తంమీద చూస్తే కమ్యూనిష్టు ఉద్యమంతో దీనికి సంబంధంలేనట్లు వెల్లడవుతున్నది. 1947–48 లో తెలంగాణాలో సాగించిన సాయుధ పోరాటం పూర్తిగా విఫలం కావడం, ఆయుధాలతో అరాచకాన్ని సృష్టించదలచినవారికి గుణపాఠంగా వుండాలి. ధ్వంసకాండవల్ల, సాయుధపోరాటం పేరిట యిక్కట్లు తెచ్చిపెట్టడంవల్ల అసలు ఉద్యమమే దెబ్బతింటుంది. నక్సలైటు కార్యకలాపాలకు శ్రీకాకుళం జిల్లాలోని గిరిజన ప్రాంతాలను ప్రధాన కేంద్రంగా చేసుకున్నారు. గిరిజనులకుఉండే సాధక బాధకాలను–అవివాస్తవికమైనవి అయినప్పటికీ, ఊహాజనితమైనప్పటికీ స్వప్రయోజనాలకు వినియోగించుకోవడం జరుగుతున్నది.

గిరిజనుల తిరుగుబాట్లు

శ్రీకాకుళంజిల్లాలోని గిరిజన ప్రాంతాలలోనూ, విశాఖపట్నం జిల్లాలోని పరిసర ప్రాంతాలలోనూ యీ శతాబ్దం ప్రారంభంనుంచి ఏదోఒక కారణంవల్ల రెండు మూడు పర్యాయాలు గిరిజనుల తిరుగుబాట్లు జరిగాయి. ఈ ప్రాంతం ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా రాష్ట్రాలకు సరిహద్దులో ఉండడంవల్లనూ, చాలావరకు బీదవారు, నిరక్షరాస్యులు అయిన అమాయక గిరిజనులను ప్రేరేపించడం సులభం కనుకనూ నక్సలైటు కార్యకలాపాలకు యీ ప్రాంతాన్ని ఉద్దేశపూర్వకంగా ఎన్నుకున్నట్లు కనిపిస్తున్నది. వారిలో దోపిడీద్వారా సులభంగా సొమ్ముచేసుకోవచ్చునన్న ప్రలోభానికిలోనైన కొంతమందికి నక్సలైట్లు ఆశలు గొలిపారు. ఈ విధంగా నక్సలైట్లు 'విప్లవం' పేరిట తమ కార్యకలాపాలను ప్రారంభించి హత్యలు, దోపిడీలు సాగించారు. వారు పెద్ద భూస్వాములపైన, దురాశాపరులయిన వడ్డీ వ్యాపారులపైన, ప్రజా శత్రువులపైన దాడులు జరపగలరని భావించబడుతున్నది. కాని ఆచరణలో నక్సలైట్లు ఇటువంటి విచక్షణ చూపడంలేదు. భూస్వాములు, రైతులు, ధనికులు, బీదవారు, మంచివారు, చెడ్డవారు, మిత్రులు, శత్రువులు అనే భేదం లేకుండా తారసిల్లిన వారినందరినీ తమ అకృత్యాలకు గురిచేస్తున్నారు. ఒకసారి వీరు ఒక బీదవ్యక్తి ఇంటిమీద దాడిచేసి అతని వద్దనున్న కొద్ది పాటి ధాన్యాన్నీ, సొమ్ములనూ నిర్దాక్షిణ్యంగా కొల్లగొట్టుకొని పోయినప్పుడు ఆ వ్యక్తి గుండె పగిలి చనిపోయాడు. క్రితంరోజు వరకూ తమకు కావలసిన ఆహారధాన్యాలనూ, ఇతర వస్తువులనూ సరఫరా చేసిన ఒకవర్తకుని వారు హత్య గావించారు. పొలంలో నాట్లు వేసుకుంటున్న ఒకరైతును పట్టపగలు చంపివేశారు!

ఈదోపిడిదార్లు గ్రామాలకువెళ్ళి, బీదవారు భయపడనవసరం లేదనీ, ధనిక భూస్వాములపై మాత్రమే తాము దాడి చేస్తామనీ లౌడ్‌స్పీకర్ల ద్వారా చెబుతారు. కోస్తా ఆంధ్రప్రాంతంలోని అక్కుపల్లి గ్రామంలో నక్సలైట్లు, తాము ప్రచారంచేసిన దానికి పూర్తిగా విరుద్ధంగా రు. 500 కంటె తక్కువ పెట్టుబడితో చిన్న మెడికల్‌షాపు నడుపుకుంటున్న వ్యక్తిపై దాడిచేసి అతని దుకాణాన్ని లూటీచేసిన సంఘటన ఆ గ్రామప్రజలకు దిగ్భ్రాంతి కలిగించింది. ఖమ్మంజిల్లాలోని ఒకగ్రామంలో తీవ్ర

వాదులముఠా బీద కోయవారిపై దాడిచేసి లూటీచేసింది. ఈ కోయవారు ఇతర గ్రామస్థులకంటే ఏ విధంగానూ మెరుగైన స్థితిలోలేరు. ఈ దారుణం జరిగిన వెంటనే ఆ గ్రామస్థులు, తీవ్రవాదుల ముఠాను ఎదిరించారు. తీవ్రవాదులవద్దనుంచి ఆయుధాలు ఉన్నప్పటికీ వారిని గ్రామస్థులు తరిమికొట్టారు. నక్సలైట్లు తీవ్రవాదులు చివరకు స్త్రీలు, పిల్లలమీదకూడా కనికరం చూపలేదు. కోస్తా. శ్రీకాకుళంలోని బోరివంక గ్రామంలో నక్సలైట్లు హత్యలు, లూటీలు చేసిన సందర్భంలో స్త్రీలను స్తంభాలకు విరిచికట్టి నానా దుర్భాషలాడారు. వారి సమక్షంలోనే వారి భర్తలను తండ్రులను నిర్దాక్షిణ్యంగా హత్యచేశారు. తర్వాత వారి నాయకులు ముందుకువచ్చి వారి మంగళ సూత్రాలను తెంపివేశారు. మాజీ ఉపాధ్యాయుడైన ఒక నక్సలైటు నాయకుడు, తన విద్యార్థిని యొక్క భర్తను సైతం హత్యచేసి ఆమె మంగళసూత్రాన్ని చేజిక్కించుకోవడానికి వెనుకాడలేదు !

పాతపట్నం ప్రాంతంలో మరో సందర్భంలో నక్సలైట్లు ఒకవ్యక్తి తల నరికి దానిని ప్రజలకు ప్రదర్శించారు. ప్రజల హృదయాలలో భయోత్పాతం కలగడం మాత్రమేగాక, యీ క్రూరమైన ఘోరకృత్యాల ఫలితంగా రాష్ట్రం నాలుగుచెరగులా ఒక విధమైన మనోవైకల్యం, నిస్పృహ ఏర్పడి అమానుష్యకృత్యాలను ఎదుర్కోడానికి ప్రజలు స్వయంగా 'గ్రామరక్షణ దళా'లను ఏర్పాటుచేసుకున్నారు. ఇటీవల ఒక సందర్భంలో శ్రీకాకుళం జిల్లాలోని ఒకగ్రామంలో నక్సలైట్లువచ్చి తమ గ్రామంపై దాడి చేస్తారని తెలుసుకొని గ్రామస్థులు అధికసంఖ్యలో ఒకచోట గుమిగూడారు. ప్రజలు తీవ్ర ప్రతిఘటనకు పూనుకోవడం చూచిన నక్సలైట్లు తామవద్ద ఆయుధాలు ఉండి తమదే పైచేయిగా ఉన్నప్పటికీ వెనక్కుతగ్గి అడవులలోకి పారిపోయారు.

ప్రారంభంలో నక్సలైట్లు ఎక్కువగా శ్రీకాకుళం ప్రాంతంలో వారంవారం జరిగే సంతలను దోపిడిచేశారు. ఐతే 1968 నవంబరు ప్రారంభంనుండి ఏజన్సీ ప్రాంతాలలోనేగాక పర్వత సానువులలోని మైదానం ప్రాంతాలలో దోపిడీలు ప్రారంభించారు. 1969 వ సంవత్సరంలో ఇంతవరకు 28 దోపిడీలు, 20 ఖూనీలు చేశారు. విశాఖపట్నం, కృష్ణా, గుంటూరు, పశ్చిమగోదావరిజిల్లాల్లో ఒకటి రెండు ఖూనీలు చేశారు. ఖమ్మం, వరంగల్లు, కరీంనగర్ జిల్లాల్లోని గోదావరి నదీలోయప్రాంతాల్లో తీవ్రవాదులు ఇదే విధమైన కార్యకలాపాలు ప్రారంభించారు వారు ఇంతవరకు 3 ఖూనీలు, 50 దోపిడీలు చేశారు.

బాధితప్రాంతాల్లో శాంతిభద్రతల ఏర్పాటునిమిత్తం తగినన్ని పోలీసుదళాలను నియమించి బాధితగ్రామాల్లకు తగిన రక్షణ కల్పించడమేగాక ఏజన్సీ ప్రాంతాల్లో కమ్యూనికేషన్లను మెరుగుపర్చడం, మైదానప్రాంతం ప్రజలనుండి గిరిజనులకు రక్షణ కల్పించడం, వ్యాపారస్థులు, అప్పులు ఇచ్చేవారు, భూస్వాములు గిరిజనుల్ను తమ స్వప్రయోజనానికి ఉపయోగించుకోకుండా చూడడం మొదలగు విషయాలలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలను అమలుజరుపుతున్నది. ఏజన్సీ ప్రాంతాల ఉత్పత్తులను కొనుగోలుచేసి గిరిజనులకు గిట్టుబాటైన ధరలకు అందజేయడానికి గిరిజనుల మార్కెటింగ్ కార్పొరేషన్ కృషిచేస్తున్నది.

ఆందోళనకరమైన అంశం

నక్సలైటు ఉద్యమం ప్రారంభంలో నిరుద్యోగులైన యువకులు, విద్యావిషయాలలో అంతగా రాణించని విద్యార్థులు ఆకర్షించబడి ఉద్యమంలో చేరడం ఆందోళన కలిగిస్తున్న అంశం. అందులో కొందరు సంపన్న భూస్వామ్య కుటుంబాలకు చెందిన వారు కూడా ఉన్నారు. ఈ ఉద్యమం ఉత్తేజకరమైన లక్ష్యాలు, ఆశయాలు ప్రాతిపదికగా గాక సామాన్య దోపిడీముఠాగా వ్యవహరిస్తున్నదని కొందరు గుర్తించారు. నిస్సహాయ నిస్పృహలకు లోనై పశ్చాత్తాపంతో కొందరు ఇండ్లకు తిరిగివెళ్లారు. మరికొందరు నక్సలైట్ల ఉద్యమంతో, సంబంధాలు తెగతెంపులు చేసుకొని పోలీసులకు లొంగిపోతున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో నక్సలైట్ ఉద్యమంలోని ప్రముఖ నాయకులు దాదాపు సగం మంది పోలీసులకు పట్టుబడినవారు గానీ, తమకుతాము లొంగిపోయినవారుగానీ తమతప్పిదాన్ని అంగీకరించి, ఉన్మత్తతతో అర్థరహితమైన హింసాచర్యలకు పూనుకున్నామని పశ్చాత్తప్తులైనారు. క్రూరమైన హింసాచర్యలపట్ల వారు తమ విసుగును వెల్లడించారు. కమ్యూనిస్టు, కమ్యూనిస్టు మార్క్సిస్టు పార్టీలతోసహా దేశంలోని ముఖ్యమైన అన్ని రాజకీయపార్టీలు నక్సలైట్ల కార్యక్రమాలను నిశితంగా ఖండించడం హర్షించదగిన విషయం. కమ్యూనిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ చండ్ర రాజేశ్వరరావు 'న్యూ ఏజ్' పత్రికలో వ్యాసం వ్రాస్తూ 1930 లో చైనా కమ్యూనిస్టుపార్టీ సాయుధపోరాటం నిర్వహించినప్పుడు చైనాలో పరిస్థితులు ఎలా ఉన్నవో, నేటి భారతదేశంలో అవే పద్ధతులను అనుసరించడం ఎంత వినాశమో, అవివేకమో వివరించారు.

మార్క్సిస్టు కమ్యూనిస్టుపార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి శ్రీ ఎం. హనుమంతరావు, బహిరంగసభల్లో నక్సలైట్ల కార్యకలాపాలను తీవ్రంగా విమర్శించారు. ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీ ఎం. బసవపున్నయ్య, సాయుధ పోరాటం అంతానికి ఆరునెలలు వ్యవధి నిర్ణయించారు. నక్సలైట్ల బెడదను ఎదుర్కోడానికి రక్షణదళాలను ఏర్పాటు చేయడానికి భారతీయ జనసంఘం, స్వతంత్రపార్టీలు ముందుకువచ్చారు.

రాష్ట్ర ప్రభుత్వ చర్యలు

శ్రీకాకుళం, ఇతర ప్రాంతాలలో గిరిజనుల సంక్షేమానికి రాష్ట్రప్రభుత్వం అనేక చర్యలు తీసుకున్నది. హింసాచర్యలను, అన్నివిధాలైన విధ్వంసక కృత్యాలను అరికట్టడానికి పోలీసులను ఉపయోగించడమేగాక దానితోపాటు వివిధ సాంఘిక, ఆర్థిక రంగాలలో అర్థవంతమైన చర్యలు తీసుకోవడంకూడా చాలా అవసరమని ప్రభుత్వం భావిస్తున్నది.

ముఠాదారీ, మాలుజారీలను క్రమబద్ధచేసే ప్రతిపాదనలకు రాష్ట్రపతి ఆమోదం లభించింది సర్వే, సెటిల్మెంటులను క్రమబద్ధంచేసే ప్రతిపాదనలను త్వరలో రాష్ట్రపతి ఆమోదానికి పంపడం జరుగుతుంది. గిరిజనులకు ఆధీనపు సర్టిఫికెట్లను జారీచేయాలని ఆ ప్రాంతాలలోని కలెక్టర్లను కోరడం జరిగింది. భూమిపంపిణీ కార్యక్రమం కొనసాగుతున్నది. అక్రమస్వాధీనపు కేసుల విచారణ జరుగుతున్నది. పార్వతీపురం అనకాపల్లి, రాజమండ్రి, భద్రాచలంలో నాలుగు సర్వే యూనిట్లను నెలకొల్పారు ప్రభుత్వ చర్యలను పటిష్ఠవంతంగా అమలుజరపడానికి వీలుగా గిరిజన సంక్షేమానికి చెందిన డిప్యూటీ కలెక్టరు, తహసీల్దార్ల కార్యాలయాలను పార్వతీపురంనుండి ఇర్విన్‌పేటకు మార్చడం జరిగింది.

గిరిజన అభివృద్ధి బోర్డు

ముండెంకల్లునుండి నీలకంఠపురం మార్గంగా డోన్‌టౌన్ వరకు రోడ్డును నిర్మించడానికి రూ. 6 లక్షలు మంజూరుచేశారు. ఆదిలాబాదు, ఖమ్మంలలో గిరిజన సంక్షేమ డిప్యూటీ కలెక్టర్లను నియమించడానికి ప్రభుత్వం ఉత్తరువులు జారీచేసింది. గిరిజనులను ఋణవిముక్తులను చేయడానికి రూ. 28 లక్షలు అవసరమవుతాయనీ, ఆమేరకు ప్రభుత్వం సెక్యూరిటీ ఇవ్వాలనీ రాష్ట్ర గిరిజన అభివృద్ధి కార్పొరేషన్ ప్రభుత్వాన్ని కోరింది.

వ్యవసాయ కార్యక్రమాల అమలు నిమిత్తం గిరిజనులకు సహకార పరపతి సంస్థలు ఋణాలు మంజూరు చేస్తాయి. అనేక గ్రామాలలో సర్వే కార్యక్రమం పూర్తిచేసి భూములు కేటాయించిన గిరిజనులకు పట్టాలు ఇవ్వడం జరుగుతున్నది. నాగళ్లు, ఎద్దులు మొదలైనవి కొనుగోలు చేయడానికి ఆర్థికసహాయం లభింపజేస్తున్నారు. ఏజన్సీ ప్రాంతాలలోని అనేక కేంద్రాలలో వైద్య సౌకర్యాలు కల్పించారు. నీటిపారుదల సౌకర్యాలు. భూముల లోకలైజేషన్‌వంటి ఇతర సంక్షేమ కార్యక్రమాలను అమలు జరుపుతున్నారు. ఈ చర్యలు గిరిజనులపై నక్సలైట్ల ప్రభావాన్ని తొలగించగలుగుతాయి.

నక్సలైట్లు నిర్వహించే హింసాత్మక చర్యలవల్ల ప్రజలలో ఎటువంటి భావంకలిగిందనేది ముఖ్యాంశం. నక్సలైట్ల సాయుధపోరాటం అని చెప్పబడే ఉద్యమం ఫలితంగా గ్రామీణ ప్రాంతాల ప్రశాంత జీవితం అల్లకల్లోలం అయింది. పురాతన కాలంలో దోపిడీదారులు హంతకులు గ్రామీణ ప్రాంతాలపై అప్పుడప్పుడు దాడి జరిపినట్లుగానే నక్సలైట్లు కూడా చేస్తున్నారనే భావం ప్రజలలో బాగా ప్రబలింది. నక్సలైట్లకు ఒక ప్రాతిపదిక, లక్ష్యశుద్ధి ఏమీలేవు. వారి చర్యలు అరాచకాన్ని సృష్టించేవి కాబట్టి సాధారణ న్యాయచట్టాలక్రింద వాటిని కఠినంగా అణచివేయాల్సిఉంది నక్సలైట్ల జాతివ్యతిరేక, సంఘవ్యతిరేక చర్యలను అరికట్టడంలో ప్రజల సహకారం ఇతోధికంగా లభించడం హర్షించదగిన విషయం.

నక్సలైట్ల అవినీతి చర్యలమూలంగా ధన, ప్రాణనష్టం కలుగకుండా నిరోధించే నిమిత్తమూ నక్సలైట్లు వారి తప్పుడు విధానాలను గుర్తించేవిధంగా పెద్ద ఎత్తున ప్రజల సహకారాన్ని సమీకరించడానికి ప్రభుత్వం కృషి చేస్తున్నది. బాధలకు గురైన జిల్లాలలో అరాచకాన్ని కఠినంగా అణచివేయడానికి, శాసనబద్ధులైన పౌరులను రక్షించడానికి భారీఎత్తున సాయుధపోలీసు దళాలను పంపడం జరిగింది. ఈ బెడదను నిరోధించడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో పూర్తిగా సహకరించడానికి ఒరిస్సా ప్రభుత్వంఅంగీకరించింది ఈబెడద ఇదేవిధంగాకొనసాగితే భారత దేశంలో శాంతి సౌభాగ్యాలకూ, పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికీ తీవ్రమైన ప్రమాదం ఏర్పడుతుంది. ఎన్నో త్యాగాలుచేసి సంపాదించుకున్న ప్రజాస్వామ్యానికి ఏర్పడిన ప్రమాదాన్ని ఎదుర్కోవడంలో ప్రజలు, వివిధ రాజకీయపార్టీలు, శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యులు ప్రభుత్వంతో హృదయపూర్వకంగా సహకరిస్తారనడంలో నాకేమాత్రం సందేహంలేదు.

ఉపాధ్యాయులకు జాతీయ బహుమతులు

ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా, జాతీయ బహుమతుల నిచ్చేందుకు తొంభైఐదు మందిని ఎన్నిక చేశారు వారిలో 51 మంది ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు, 35 మంది మాధ్యమిక పాఠశాల అధ్యాపకులు, తొమ్మిదిమంది సంస్కృత ఉపాధ్యాయులు వున్నారు వీరికి యోగ్యతా పత్రమూ, రూ. 500 నగదూ ఇస్తారు. ఢిల్లీలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసే ఉత్సవంలో ఈ బహుమతుల ప్రదానం జరుగుతుంది.

ఆంధ్రప్రదేశ్‌నుంచి ఈ బహుమతులను పొందిన ప్రాథమిక పాఠశాల అధ్యాపకులు : సర్వశ్రీ పి. మునయ్య, పి. ఆదినారాయణ, సి. చెంగలరాయ నాయుడు, కె గౌస్ మొహియుద్దీన్.

మాధ్యమిక పాఠశాలల ఉపాధ్యాయులు ; శ్రీయుతులు ఎస్. ఉద్వచార్, కొవ్వూరి బాలకృష్ణారెడ్డి.

సంస్కృత అధ్యాపకుడు : శ్రీ కె. సుబ్బరాయ.

ఉపాధ్యాయుల హోదా పెంచడం, ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల్లో పనిచేసేవారి సేవలకు గుర్తింపు కల్పించడం, ఇవే ఈ జాతీయ బహుమతి పథకం ఆశయాలు. దీనిని 1958_59 లో ప్రారంభించారు. సంస్కృత భాష బోధించే పాఠశాలల్లోను, సంప్రదాయ సిద్ధంగా నడుపబడుతున్న విద్యా సంస్థలోనూ పనిచేసే అధ్యాపకులకు కూడా ఈ పథకాన్ని 1967_68 నుంచి వర్తింప చేశారు.

కనీసం 20 సంవత్సరాలపాటు ఉపాధ్యాయ వృత్తిలో ఉండి విద్యాస్థాయి అభివృద్ధికి పాటుబడుతున్న వారికి ఈ బహుమతులను యివ్వడం జరుగుతుంది. 1958 నుంచీ ఇంతవరకూ 1,001 మంది ఉపాధ్యాయులకు వీటిని ప్రదానం చేసారు.

క థా ని క :

చిన్నారి చిట్టి

ఎ. లక్ష్మీరమణ

చిట్టి, ఆ పెద్ద షాపులో బొమ్మల వంక చూస్తూ నిలుచుండి పోయింది. కిటికీ అద్దంలో నుండి వింత వింత బొమ్మలెన్నో అగుపిస్తున్నాయి. టెడ్డీ బేరీ, జిరాఫీ, జింక, కుందేలు, ఇంకా గుండ్రటి పట్టాల మీద తిరిగే రైలు, జోరుగా పోయే కారు, గంటలు గణగణ మంటూ నడిచే బండీ ఎన్నెన్నో !

అన్నిటికన్నా ఆ నీలి కళ్ళ బొమ్మ చిట్టిని ఇట్టే ఆకర్షించింది. గులాబీరెక్కల లాంటి బుగ్గలు, బంగారు పట్టు కుచ్చులాంటి జుత్తు-ముద్దు వస్తున్నాయి. జిగజిగ మెరిసే ఆ ఆకు పచ్చని గౌనూ, తెల్లని బూట్లూ దాని కెంత బాగున్నాయో ! చెంపకి, చేరదేసి కళ్ళతో చిట్టి, ఆ బొమ్మవంక కళ్ళప్పగించి చూస్తూ వుండి పోయింది. ఆ బొమ్మ కనురెప్పలు గాలికి కదులుతుంటే తనని సైగ చేసి పిలుస్తున్నట్లుంది. ఆ బొమ్మని చూడగా తన వంక చూచి నవ్వుతున్నట్లుగా కూడా అనిపిస్తుంది. చిట్టి ఆనందంతో పులకరించింది.

ఎంత చక్కని బొమ్మ ! ఒక్కసారంటే ఒక్కసారి ఆ బొమ్మని ఎత్తుకుని తనివితీరా ముద్దాడితేనో ! కానీ ఎలాగు ? అంత పెద్ద షాపులోకి తన్నెవ్వరు రానిస్తారు ? ఆ షాపులోకి వెళ్ళేవాళ్ళ బట్టలు ఎంత బాగున్నాయో ? అనుకుంది.

తన బట్టల వంక తేరిపార చూచుకుంది. లంగా, చొక్కా రంగుపోయి చినిగిన బొంతల్లాగున్నాయి. లంగా నిండా మాసికలే. వెంట్రుకలు నూనె లేక, ఎండు గడ్డిలా, చిందరవందరగా వుంది; మొహం మీద పడ్డ వెంట్రుకలు, వెనక్కి తీసుకుని జడలో దోపుకుంది. లంగా మీద పడ్డ దుమ్ము, ఒక్కసారి విదిలించి దులుపుకొంది. పాపం, అమ్మకి నా బట్టలు వుతకటానికి తీరికేదీ ? మూడు ఇళ్ళలో పై పని చేయాలా ? ఇంటికి రాగానే బువ్వ వండి, తమ్ముడ్ని చూసుకోవాలిగా !-అనుకుంది డిగాలుగా చిట్టి. మొన్న స్కూల్లో జరిగిన సంగతి గుర్తుకు వచ్చింది. తన ప్రక్కన కూర్చున్న రమ, ముక్కు మూసుకొంటూ " అబ్బా నీ బట్టలు వాసన " అంటూ దూరంగా జరిగిపోయింది. తనకి చాల చిన్నతనమనిపించింది. రోజూ ఇంటికి రాగానే తానే బట్టలు వుతుక్కుంటుంది. అయినా అలాగేవుంది తన లంగా.

' ఇలాంటి వేషంలో ఆ షాపులో అడుగు పెట్టటమే ! దొంగ పిల్ల అనుకుంటారేమో కూడా. అవును. తప్పక దొంగ పిల్ల అంటారు. వద్దు, వద్దు. బయట నుండి చూస్తే చాలు' అనుకొంది అంతవరకే తృప్తి పడుతూ.

వెనుక నుండి, కారు హారన్ వినబడింది. తిరిగి చూస్తే ఒకామె పెద్ద కారు నడుపుకుంటూ వచ్చి అక్కడ ఆపింది. చిట్టి చూస్తుండగానే ఆమె కారు దిగి ఆ బొమ్మల షాపులోకి వెళ్ళిం . ఆ గులాబిరంగు చీర కట్టుకున్నామె బొమ్మలన్నీ చూచి తన చూపుడు వ్రేలుతో, ఆ నీలి కళ్ళ బొమ్మను షాపు కుర్రవాడికి చూపిస్తోంది. ' ఆ బొమ్మను ఆమె తీసుకొని వెళ్ళిపోతేనో ? అన్న ఆలోచనా తట్టింది చిట్టికి. తనకు ప్రియమైన దానిని ఎవరో బలవంతంగా తీసుకుపోతున్నట్లనిపించింది. ఆ షాపులోనే వుంటే ఆ చిన్నారి బొమ్మను ఎప్పుడో ఒకప్పుడు వచ్చి, తనివి తీరా చూసుకోవచ్చు. ఆ బొమ్మ తన్ను చూడగానే, చిన్నగా నవ్వుతుంది. రెప్పలాడించి పిలుస్తుంది కూడాను. తనకి అప్పుడు ఆకలి కూడా వెయ్యదు. ఎంతో సంతోషంగా వుంటుంది. కానీ ఇప్పుడు ఆ బొమ్మ ఆమె తీసుకెళ్ళిపోతే ఎలాగు! కళ్ళనీళ్ళ పర్యంతం అయింది చిట్టికి. ఆత్రంగా రెండడుగులు ముందుకువేసి, బొటనవ్రేళ్ళమీద నిలబడి ఆ అద్దంలో నుండి లోపలికి చూడసాగింది.

కారు దిగినామె, చిరునవ్వుతో ఆ బొమ్మను అటూ, ఇటూ త్రిప్పి పరీక్షిస్తోంది. ఆ షాపు కుర్రవాడు, చేతులు త్రిప్పుతూ, ఆమెకు ఏదేదో చెప్పకుపోతున్నాడు. ఆమెకు ఆ బొమ్మ నచ్చక పోతే ఎంత బాగుండును! అనుకొంది. తన బొమ్మను అమ్మేయాలని చూస్తున్న ఆ షాపు కుర్రవాడిమీదా, కొనాలనుకొంటున్న ఆమె మీదా చిట్టికి పట్టరాని కోపం వచ్చేస్తోంది.

చిట్టి అనుకున్నంత పని అయింది. గులాబిరంగు చీరధరించినామె "సరే" నన్నట్లుగా తల వూపుతున్నది. ఆ షాపు కుర్రవాడు మంచి హుషారుగా ఓ పెద్ద రంగుల అట్టపెట్టెలో బొమ్మను పడుకోబెట్టి మూతవేసి దారం కట్టేసాడు. చిట్టి గుండె నీరయిపోయింది. ఇంతలో ఆమె అయిదు రూపాయలనోట్లు పర్సులో నుండి తీసి, ఆ షాహుకారుకు ఇచ్చింది. బిల్లు ఇచ్చిన ఆ లావుపాటి షాహుకారుమీద కూడా చిట్టికి కోపం వచ్చేసింది. ఆంతేకాదు, ఆబొమ్మ కొన్నామె బిడ్డమీద కూడా చిట్టికి మరింత కోపం వచ్చింది. అవును

మరి తనకి కాకుండా ఆ బొమ్మని ఎంచక్కా ఎత్తుకుంటుందో! ఆ అమ్మాయి ముమ్మాటికీ తనకి విరోధి. తన అందాల బొమ్మని తనకి కాకుండా చేసేసింది కదా! చిట్టికళ్ళల్లో,గిఱ్ఱున నీళ్ళుతిరిగాయి.

బొమ్మపెట్టి పట్టుకొని ఆమె మెట్లు దిగుతున్నది. ఇంతలో ఒక పిల్లవాడు కారు దగరకు పరుగెత్తుకొచ్చి, ఓ చిన్న మురికి బట్టతో కారు అద్దాలు తుడిచేస్తున్నాడు. ఆమె కారుదగ్గరకు రాగానే వంగి సలాంచేసి "చాలసేపటి నుండి కారు తుడిచానమ్మా నాలుగ ణాలిప్పించండమ్మా" అవి దీనంగా అడిగాడు, ఆమె పావులా తీసి ఇచ్చి వెళ్ళి కారులో కూర్చుంది. తిరిగి ఆమెకు ఏమి గుర్తు వచ్చిందో కానీ, కారు దిగి షాపులోకి వెళ్ళింది.

'నా బొమ్మ లేనప్పుడు, నేనిక్కడేం చెయ్యను?' నీరసంగా అనుకుని, రెండడుగులు వేసింది చిట్టి. కారు తలుపు తెరిచిన శబ్దం విని, వెనుకకు తిరిగిచూసింది చిట్టి. ఆ కారు తుడిచిన పిల్లవాడు మెల్లగా కారులోకి వంగి, బొమ్మవున్న పెట్టెను అందు కొంటున్నాడు. చిట్టికి ఎందుకో అనుమానం వేసి, అక్కడ ఆగిపో యింది. ఆ పిల్లవాడు పెట్టె చంకలో పెట్టుకొని బెదురుచూపులు చూసు కొంటూ పారిపోవటానికి ప్రయత్నిస్తున్నాడు. చిట్టి తన కళ్ళను తాను నమ్మలేకపోయింది. 'ఎంత దొంగపిల్లవాడు, అని ఆశ్చర్య పోయింది. కాని వెంటనే ఏదో గుర్తుకు వచ్చింది చిట్టికి. తన తండ్రిని అంతా అలాగే అనుకుంటారు గాబోలు! రిక్షారంగడు అంటే అందరికీ భయమే. రెండుసార్లు జైలుకుకూడా వెళ్ళివచ్చాడు; అందుకేగా ఒకసారి స్కూల్లో రేవతి వుండీడబ్బులుపోతే అందరూ తనే తీసిందన్నారు. తనకి ఏడుపు వచ్చింది కూడా. చివరకి విమలసంచిలో దొరకబట్టి సరిపోయింది. అలా అనుకొంటుండగా బొమ్మపెట్టె పట్టుకున్న పిల్లవాడు పారిపోతున్నాడు. ఏది ఏమయినా కానీ అని "దొంగ, దొంగ!" అని అరుస్తూ ఆ పిల్లవాడివెంట పడింది చిట్టి. కొంతసేపటికి వెళ్ళి ఆ పిల్లవాడి జేబుపట్టుకొంది. ఆ పిల్లవాడు కోపంగా ఒక్క విసురువిసిరి తిరిగి పారిపోతున్నాడు. చిట్టి, తన పట్టు వదలకుండా "దొంగ దొంగ" అని అరుస్తూనేవుంది.

ఈ గలబా విని, షాపులోవాళ్ళు బయటకు వచ్చారు. బొమ్మ అమ్మిన, షాపులో కుఱ్ఱవాడు ఒక్కపరుగులో పోయి, ఆ బొమ్మ తీసుకునిపోతున్న పిల్లవాడిని పట్టుకున్నాడు. బొమ్మతెచ్చి ఆమెకిచ్చివేసి, ఆ పిల్లవాడిని రెండుచెంపలు వాయించాడు. "మరిం కెప్పుడూ ఇలాంటిపని చెయ్యవుకదా?" అంటూ చెవి మెలిపెట్టాడు. ఆ పిల్లవాడు పెద్దగా ఏడుస్తూ "నాదేం తప్పు? రెక్కలుపొయ్యేలా కారు తుడిసినా ఆయమ్మ పైసా ఇవ్వలేదు. అందుకనే బొమ్మని తీసుకున్నా" అన్నాడు.

అది విని చిట్టి తనచెవులను తానే నమ్మలేకపోయింది. అంత అబద్ధం ఎలా చెబుతున్నాడో! అని విస్తుపోయింది. పావులా ఇచ్చిన ఆమె ఆశ్చర్యంగా చూస్తున్నది. "అట్టే మాట్లాడావంటే పోలీసుకు అప్పగిస్తా" నని బెదిరించాడు షాపుకుఱ్ఱవాడు. పోలీసు పేరు వినగానే కాళ్ళసత్తువకొద్దీ పరుగుతీసాడు ఆ పిల్లవాడు.

ఆ పిల్లవాడి చమత్కారానికి విస్తుపోతూ నిలుచున్న ఆమెక్కు చిన్న సలహా ఇస్తున్నాడు షాపు యజమాని, "ఈ పోకిరిపిల్లవాళ్ళు న్నారు చూశారూ, వీళ్ళకి అబద్ధాలు చెప్పటం, దొంగతనాలు చెయ్యటం మంచినీళ్ళప్రాయం అనుకోండి. అయినా మనజాగ్రత్త లో మనం వుండాలి సుమండీ. అంత ఖరీదుగల బొమ్మ కారులో వదిలొచ్చారు. మంచికాలం, మీసొమ్ము మీకు దక్కింది" అన్నాడు.

"మీరు చెప్పినదీ కొంతవరకు నిజమే ననుకోండి. మంచి వాళ్ళూ, చెడ్డవాళ్ళూ ఎక్కడయినా వుంటారు. చూశారుగా యీ అమ్మాయి కేక వెయ్యబట్టే కదా బొమ్మ దొరికింది అంటూ, ఆ గులాబీరంగు చీర ధరించినామె చిట్టి దగ్గరకు వచ్చింది.

"నీవు మంచి అమ్మాయిలాగున్నావు. ఇదిగో, యీ రెండు రూపాయలు తీసుకుని ఏమైనా కొనుక్కో" అంటూ పర్సులో నుండి రెండు రూపాయలనోటు తీసి యివ్వబోయింది.

చిట్టి తల అడ్డంగా తిప్పి "నాకు వద్దు" అంది. వద్దు అని అన్నదేకాని ఆ రెండు రూపాయల నోటు చూస్తూ ఎన్నెన్నో ఆలో చనలు మెరుపులా మెరిసాయి చిట్టి మెదడులో. ఉదయంనుండీ తానేమీ తినలేదని గుర్తుకువచ్చింది. పక్కనే అరటి పండ్ల బండి ఆగివుంది. ఆరెండు రూపాయలతో పండ్లు కొనుక్కొని తినవచ్చు; తన తరగతిలో లత వేసుకున్న ఎఱరిబ్బ నంటే తన కెంతో ఇష్టం. అదికొనుక్కోవచ్చు. రోడ్డు ప్రక్కన చిల్లరసామాను అమ్మే అవ్వముందు లక్క పిడతలూ గిలక్కాయలూ కనిపిస్తున్నాయి. చెల్లికి లక్కపిడతలంటే చాలా ఇష్టం తమ్ముడికి గిలక్కాయలు కొనొచ్చు. అవిచూస్తే వాళ్ళెంత సంబరపడతారో! కానీ, కానీ వద్దు, ఎక్కడన్నా బిక్షం వాళ్ళలాగ డబ్బు తీసుకుంటారేమిటి—అను కొంది.

"ఎమిటి అలా ఆలోచిస్తున్నావు? నీపేరేమిటి?"

"చిట్టి"

"చిట్టి. బాగుంది, మీనాన్న ఎంచేస్తాడు?" చిట్టికి చిన్నభయం వేసింది. రిక్షారంగడు అనిచెబితే, ఈమెకూ తెలిసిపోతుంది; అందరిలా తనని దొంగ అంటుందేమో; పోనీ అంటే అంది. కానీ అబద్ధం చెప్పకూడదు. స్కూల్లో గాంధీతాతపాఠంలో చదవుకోలేదూ అబధం ఆడకూడదని? టీచరు కూడా చెబుతుంది తప్పుచేసినా నిజం చెప్పాలని. ఈమె ఏమైనా అనుకోనీ, నిజమే చెప్పేస్తాను—అని నిశ్చయించుకొంది.

"రిక్షారంగడు మానాన్న" అంది కొంచం గట్టిగా ప్రక్కనున్న టాక్సీవాడు అదివిని ఆమెతో అన్నాడు" రిక్షారంగడు మాచెడ్డ దొంగమ్మా."

ఆమె అది విని కొంచంసేపు మాట్లాడలేదు. చిట్టి దిగులుగా అనుకొంది. నాకు తెలుసు యీమెకూడా నన్ను దొంగ పిల్లే అన కొంటుంది. తలవంచుకుని అక్కడినుండి కదిలింది. గులాబిరంగ చీర ధరించినామె "చిట్టీ" అనిపిలిచింది.

తిరిగి చూసింది చిట్టి.

"చిట్టీ! నీవు మంచి పిల్లవి. నాకు అదే కావలసింది నీవు నాతో ఓమారు మాఇంటికి వస్తావా?"

"ఎక్కడికి "

"మా ఇంటికి"

"ఎందుకు'

"నీకు బొమ్మలంటే ఇష్టమే కదూ!"

"ఊఁ" నెమ్మదిగా అంది.

"నేను రకరకాలబొమ్మలు చేర్చి ప్రదర్శించ బోతున్నాను. అందులో మనదేశంలో అన్ని ప్రాంతాల బొమ్మలూ వుంటాయి. కాశ్మీరు, రాజస్థాన్, బెంగాల్, బీహారు, ఒరిస్సా, మలబారు, తమిళనాడు, మన ప్రాంతం, కొండపల్లి బొమ్మలూ కూడా ఇంకా విదేశాలబొమ్మలు కూడాను ఇవ్వన్నీ బొమ్మరిల్లు అని ఒక భవనంలో అమర్చుతున్నాను. నాకు బొమ్మలు అమర్చటానికి సాయంకావాలి. నీవూ వస్తావా?"

"మరి... మరి ఆనీలికళ్ళ బొమ్మ మీఅమ్మాయికి కాదూ" నమ్మలేనట్లు అడిగింది చిట్టి. ఆమె చిన్నగా, అదోలా నవ్వింది.

" మా అమ్మాయికని నీకెవరు చెప్పారు?"

"ఎవ్వరూ చెప్పలేదు, నేనే అనుకున్నాను."

"ఎట్టిపిల్లా అమ్మాయి నాకు లేదుగా" తిరిగి చిన్నగా అదోలా నవ్వింది ఆమె.

చిట్టికి ఆమెను చూస్తే జాలేసింది.

"అదిసరేగాని, బాలలందరి కొరకే యీ బొమ్మలు. పిల్లలందరికీ బొమ్మలంటే ఇష్టమేగా." సంతోషంగా అందామె.

"నీలిరంగు కళ్ళ - బొమ్మకూడా అందరూ చూడవచ్చా?"

" చూడటానికే కదామరి!"

"నేనూ చూడవచ్చా?" ఇంకా నమ్మకం చాలలేదు చిట్టికి.

"తప్పకుండాను. ఇదుగో యీ బొమ్మపట్టుకునిరా, వెళదాం"

చిట్టి ఆనందానికి అంతులేదు. చేతులు రెండూ జాపి ఆప్యాయంగా అందుకుందాబొమ్మను.

['పిల్లలకోసం కథలు' పోటీలో ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమివారు ఉత్తమంగా నిర్ణయించిన మూడు కథల్లో ఒక కథ.]

ప్రభుత్వ ఉద్యోగులకు ప్రోత్సాహక బహుమతులు

ప్రశంసాపూర్వకమైన ఉత్తమ కార్యనిర్వహణకు ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక ప్రోత్సాహం కల్పిస్తూ 1965 జనవరిలో ప్రవేశపెట్టిన పథకాన్ని అనుసరించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దిగువ ప్రోత్సాహక బహుమతులను ప్రకటించింది :

విజయవాడలో విజిలెన్సుశాఖజోనల్ అధికారి డా॥ బి. కామేశ్వరరావుకు కుమ్యులేటివ్ పద్ధతిపై ఒక అడ్వాన్సు యింక్రిమెంటు.

సాధారణ పరిపాలన శాఖలోని రోనియో ఆపరేటర్ శ్రీ బి. రామయ్యకు కుమ్యులేటివ్‌పద్ధతిపై రెండు అడ్వాన్సు ఇంక్రిమెంట్లు.

ప్రోసెస్ సర్వరు శ్రీ డి. గోకర్ణయ్యకు కుమ్యులేటివ్ పద్ధతిపై ఒక అడ్వాన్సు ఇంక్రిమెంటు.

జాతీయ అత్యవసర కార్యనిర్వహణ నిమిత్తం బీహారు రాష్ట్రంలో రోడ్డురోలర్ వెంటవెళ్ళిన బృందంలోని 31 మంది డ్రైవర్లు, 18 మంది క్లీనర్లకు ప్రతి ఒక్కరికి కుమ్యులేటివ్ పద్ధతిలో మూడు యింక్రిమెంట్లు.

పౌర సరఫరాల తహసీల్దారు శ్రీ అజీముద్దీన్‌కు కుమ్యులేటివ్ పద్ధతిపై ఒక అడ్వాన్సు ఇంక్రిమెంటు, జీపు డ్రైవరు శ్రీ అబ్దుల్‌కరీమ్‌కు కుమ్యులేటివ్ పద్ధతిపై రెండు అడ్వాన్సు ఇంక్రిమెంట్లు.

మత్స్యశాఖ ఇన్స్పెక్టరు శ్రీ వి. వేంకటేశ్వరరావుకు రు. 100 ల రొక్కం.

చిత్తూరు జిల్లా, చంద్రగిరి వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీ కె. ఎన్. మల్లికార్జునరావుకు రు. 250 ల రొక్కం బహుమతి.


ఆర్థికశాఖలోని సెక్షన్ ఆఫీసరు శ్రీ గులామ్‌షర్ఫుద్దీన్‌కు రు. 350 లు, ఆర్థికశాఖలోని అసిస్టెంటు శ్రీ ఎం. ఎ. లతీఫ్‌కు రు. 300ల రొక్కం బహుమతి.

అనావృష్టి పరిస్థితులు: సహాయక చర్యలు

రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలలో అనావృష్టి పరిసితులు ఏర్పడడం గత కొన్నిసంవత్సరాలనుంచి ఆంధ్రప్రదేశ్‌లో యేటేట సంభవిస్తున్నది. 1964_65వ సంవత్సరంలో ఋతుపరిస్థితులు మామూలుగా వున్నాయి. ఆ తరువాతనుంచి రాష్ట్రంలో ఋతుపరిస్థితులు అననుకూలంగానేవుంటున్నాయి, 1965_66వ సంవత్సరంలో సకాలంలోనూ, తగినంతగానూ వర్షాలుపడకపోవడంవల్ల రాష్ట్రంలోని 20 జిల్లాల్లో 16 జిల్లాలుఅనావృష్టికిగురిఅయ్యాయి. రూ.2 కోట్ల ఖర్చుతోసహాయక చర్యలు గైకొనబడినవి. రూ. 3 కోట్ల మేరకు భూమిశిస్తురెమిషన్లు యివ్వబడినవి. 1965-66 లో అనావృష్టికి లోనైన 16 జిల్లాలలో 6 జిల్లాలకు ఆ మరుసటి సంవత్సరంలో అంటే 1966_67వ సంవత్సరంలోకూడా అనావృష్టిదెబ్బ తగిలింది. ఫలితంగా సహాయక చర్యలను కొనసాగించవలసి వచ్చింది. తిరిగి 1967_68వ సంవత్సరంలో 11 జిల్లాలు అనావృష్టికి లోనయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం, సుమారు రూ. 1.5 కోట్ల మేరకు భూమి శిస్తు రెమిషన్లను మంజూరు చేయడంతోపాటుగా భారీఎత్తున సహాయక చర్యలు తీసుకొనవలసి వచ్చింది.

1968_69వ సంవత్సరంలో అనావృష్టి పరిస్థితి తీవ్రంగా ఏర్పడింది. ఖరీఫ్ పంటకు ముఖ్య తరుణమైన 1968 జూన్_సెప్టెంబరు కాలంలో నైరుతి ఋతు పవనాలు విఫలం కావడంవల్ల వర్షాభావం ఏర్పడింది. వర్షపాతం 33 శాతం తిగ్గింది. వచ్చిన వర్షాలు కూడా చెదురుమదురుగా రావడం, అకాలంగా రావడంవల్ల అనావృష్టి పరిస్థితులు రాష్ట్రంలోని యిరవై జిల్లాలలోనూ ఏర్పడ్డాయి. ఇందువల్ల 1,000 లకుపైగా గ్రామాలకూ, 125 లక్షలకు పైగా గ్రామ ప్రజలకూ దెబ్బతగిలింది.

అనావృష్టి ఫలితంగా 1968_69వ సంవత్సరంలో ఖరీఫ్ సేద్యానికి బాగా దెబ్బ తగిలింది. మెట్టపైరువేసిన చోట్లలో కూడా 1968 ఆగష్టులో పూర్తిగా వర్షాలు పడకపోవడంచేత ఎదిగిన పైర్లు ఎండిపోయాయి. 1969 ఆగష్టు చివరి వరకు కూడా అనేక మధ్యరకం, చిన్నరకం సేద్యపు నీటిపారుదల వనరులు దాదాపు ఎండిపోయిన స్థితిలో వున్నాయి. రాష్ట్రంలో 1967_68 వ్యవసాయ సంవత్సరంలో ఆహార ధాన్యాలు 70.79 లక్షల టన్నులు వుత్పత్తికాగా 1968_69వ సంవత్సరంలో వాటి వుత్పత్తిని 55.68 లక్షల టన్నులకు మాత్రమే అంచనావేశారు. వరి వుత్పత్తి ఈ కాలంలో 46 లక్షల టన్నులనుంచి 33.44 లక్షల టన్నులకు తగ్గిపోయింది. ఇది 27 శాతానికి పైగా తగ్గుదలను సూచిస్తున్నది. దానినిబట్టి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు తగిలిన దెబ్బను అంచనా వేసుకోవచ్చు. ఋతు



లోతుగాత్రవ్వే రిగ్గుయంత్రం

పరిస్థితులు క్షీణించిన దృష్ట్యా దెబ్బతిన్న ప్రజలకు అందజేయవలసివున్న సహాయాన్ని గురించితెలుసుకునే నిమిత్తం ప్రభుత్వం, 1968 సెప్టెంబరులో జిల్లాల వారీగా అనావృష్టి పరిస్థితిని మదింపువేసే ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. దీనిననుసరించి ప్రభుత్వం,

రాష్ట్రంలోని ఇరవై జిల్లాలలోను అమలుపరచే నిమిత్తం సమగ్రమైన క్షామ సహాయక కార్యక్రమాన్ని మంజూరుచేసింది. ఈ కార్యక్రమంలో స్థూలంగా దిగువపేర్కొన్న అంశాలు చేరివున్నాయి

1. దెబ్బతిన్న ప్రాంతాలలో నిరుద్యోగులైన వ్యక్తులకు ఉపాధులు కల్పించడానికి సహాయక కార్యక్రమాలు అమలు జరపడం.
2. మంచినీటి సౌకర్యాలు కల్పించడం.
3. ఆహారం, పశుగ్రాసం, విత్తనాలు సరఫరా చేయడం.
4. ఆపత్కాల తక్కావీ ఋణాలు మంజూరు చేయడం.

సహాయక కార్యక్రమాలు

దెబ్బతిన్న ప్రజలకు అధికంగా ఉపాధులు కల్పించగలిగి దెబ్బతిన్న ప్రాంతాలకు శాశ్వత ప్రయోజనాలు చేకూర్చగలిగే సేద్యపు నీటిపారుదల, భూసార సంరక్షణవంటి వుత్పత్తిదాయకమైన సహాయక కార్యక్రమాలకు ప్రాధాన్యం యివ్వబడింది. సహాయక కార్యక్రమాల క్రింద 8,000లకు పైగా చిన్నరకం సేద్యపు నీటివనరుల పనులు చేపట్టబడినవి ఈ కార్యక్రమం ఫలితంగా 4 35 లక్షల ఎకరాలలో నీటి పారుదల స్థిరీకరించబడింది. ఒక లక్ష ఎకరాలకు కొత్తగా నీటిపారుదల సౌకర్యం కల్పించబడింది. వ్యవసాయ రంగంలో, సహాయ కార్యక్రమం క్రింద 1.24 లక్షల ఎకరాలలో వరదకట్టలు నిర్మించారు. 6,000 ఎకరాలలో అడవుల పెంపకాన్ని చేపట్టారు. 2,000 రోడ్డు పనులు చేపట్టారు. ఇందులో ప్రస్తుతం ఉన్నరోడ్లను పటిష్టం చేయడం, కొత్తగా రోడ్లను నిర్మించే పనులూ చేరిఉన్నాయి. ఉపాధికల్పన స్థాయి వివిధ దశలలో ఉన్నప్పటికీ విరివిగా ఉపాధికల్పించిన కాలంలో 3.5 లక్షల మందికిపైగా ఉపాధి కల్పించారు.

బావులత్రవ్వకం

రాష్ట్రంలో కొన్ని ప్రాంతాలలో మంచీనీటి సరఫరాసౌకర్యం ఆందోళనకరంగా ఉంది. 1968 సెప్టెంబరు_అక్టోబరులో ఆలస్యంగా వచ్చిన వర్షాల ఫలితంగా పరిస్థితి కొంతవరకు మెరుగుపడినప్పటికీ ఆతర్వాత నెలలో తిరిగి నీటి కొరత ఏర్పడింది. అందువల్ల ఉన్న బావులను లోతుచేయ డానికీ, కొత్త బావులను త్రవ్వడానికీ నిధులను కేటాయించారు. 4,500 కొత్త బావులు త్రవ్వడం, 3,200 పాతబావులను పునరుద్ధరించడం జరిగింది. ఇందుకై రూ. 70 లక్షలు ఖర్చుచేశారు.

సంప్రదాయ పద్ధతుల ద్వారా బావులను లోతుచేయడం, కొత్త బావుల త్రవ్వకం కార్యక్రమంతో పాటు నీటి కొరత ఉన్న ప్రాంతంలో త్వరితగతిని కొత్త బావులను త్రవ్వడానికీ ఉన్న బావులను మరింతగా లోతుచేయడానికీ ప్రభుత్వం రిగ్ యంత్ర పరికరాలను వినియోగిస్తున్నది. సత్వర ఫలితాలను సాధించే దృష్టితో రిగ్ యంత్రపరికరాల ఉపయోగం, సంరక్షణ, నిర్వహణ విషయాలను వ్యవసాయ పరిశ్రమ కార్పొరేషన్ పరం చేశారు. రాష్ట్రంలోని ప్రాంతాలలో ప్రస్తుతం 70 రిగ్గులకు పైగా పనిచేస్తున్నాయి. 1669 జూన్ 30వ తేదీ నాటికి మొత్తం 3,412 బావులను త్రవడంగాని, లోతు చేయడంగానీ జరింది.

ఆహారధాన్యాల సరఫరా

అనావృష్టి పరిస్థితుల కారణంగా బహిరంగ మార్కెటులో ఆహార ధాన్యాల ధరల పెరుగుదలను అరిట్టడానికి వీలుగా ఆహార ధాన్యాలను నిల్వచేయడం, సేకరించడంవంటి చర్యలను ప్రభుత్వం తీసుకున్నది. రాష్ట్రంలో ప్రజల అవసరాలు ఎక్కువైన దృష్ట్యా బియ్యం ఎగుమతి చాలాభాగం తగ్గింప బడినది. కేంద్రంనుండి జొన్న, మైలోవంటి పదార్థాలను పొందడానికి అవసరమైన చర్యలు తీసుకున్నారు. అవసరమైన మేరకు చవక ధరల దుకాణాలను ప్రారంభించే అధికారం కలెక్టర్లకు యివ్వబడింది. రాష్ట్రమంతటా యిప్పుడు 11,000కు పైగా చవకధరల దుకాణాలు పనిచేస్తున్నాయి. గతసంవత్సరం యిందులో సగంమాత్రమే పనిచేశాయి.

సెప్టెంబరు నెలలో ఆలస్యంగా వచ్చిన వర్షాల ఆధారంగా స్వల్ప వ్యవధిలో ఉత్పతి అయ్యే పంటల రకాలను సేద్యంచేడానికి కృషి జరిగింది. అంతేగాక విత్తనాలను సేకరించి, సరఫరా అధికారాన్ని వ్యవసాయశాఖకు అప్పగించబడింది. యీ పథకం క్రింద జరిగే రవాణా ఖర్చులు యితర ఖర్చులను ప్రభుత్వం భరిస్తుంది

పశుగ్రాసం

రాష్ట్రంలోని కొన్నిజిల్లాలలో పశుగ్రాసం కొరత ఏర్పడింది అయితే సెప్టెంబరు_అక్టోబరులలో వచ్చిన వర్షాల వల్ల పరిస్థితి కొంత మెరుగుపడింది. అవసరమైన పక్షంలో పశుగ్రాసం సేకరించి కొరత ప్రాంతాలకు తరలించే అధికారం పశుగణాభివృద్ధిశాఖకు యివ్వబడింది. దానికితోడు రాష్ట్రంలోని మిల్లులలో లభించే వరి పొట్టు, గోధుమ పొట్టునుకూడ లభింపజేయడానికి చర్యలు తీసుకున్నారు.

ఋతు పరిస్థితులు మెరుగుపడేవరకు ఆదుకునే దృష్టితో సన్నకారు రైతులకు, ఆపత్కాల తక్కావీపథకం క్రింద ప్రభుత్వం ఉదారంగా ఋణాలు మంజూరు చేసింది. ఋణ పరిమితిని రూ.200 ల నుండి రూ. 500లకు పెంచుతూ ఋణనిబంధనలను సడలించడం జరిగింది. ఈఋణాలను జీవనాధారానికేక విత్తనాలు పశుగ్రాసం సేద్యపు బావులు లోతు త్రవ్వడానికీ వినియోగించడానికి అనుమతించారు, 1969 జూన్ ఆఖరు నాటికి యీ పథకం క్రింద రూ. 270 కోట్లు పంపిణీ చేయడం జరిగింది.

భూమిశిస్తు మినహాయింపు

1968_69 కాలంలో నెలకొనివున్న అనావృష్టి పరిస్థితుల తీవ్రతను ప్రభుత్వం గుర్తించి, దానికి గురిఅయిన గ్రామాలలో ఉదారంగా భూమిశిస్తును మినహాయింపు చేస్తూ ఉత్తర్వులు చేసింది. మెరక భూమి అయినా, పల్లపుభూమి అయినా పంట దిగుబడినాలుగు అణాలకు తక్కువుగావుంటే పూర్తిగా భూమిశిస్తుమినహాయించారు. పంట దిగుబడి రూపాయికినాలుగు అణాలకు ఎక్కువగానూ.

ఆరుఅణాలకు తక్కువగానూ వుంటే సగం భూమి శిస్తును మినహాయించారు. భూమి శిస్తు మినహాయింపు చేయడానికి అర్హమైన భూముల విషయంలో బకాయిపడిన భూమిశిస్తు, పన్నులు మొదలైన వాటినికూడా తక్షణమే వసూలు చేయకుండా వాయిదా వేయడం జరిగింది. ఇంతే కాక మరికొంత ఉదారంగా అనావృష్టికి గురైన గ్రామాల్లో భూముల విషయంలో సైతం పాత బకాయీలను 50 శాతం మాత్రమే వసూలుచేసి మిగిలిన యీ భైశాతాన్ని వచ్చే ఫసలీలో వసూలు చేయాలని ప్రభుత్వం ఉత్తరువు చేసింది.

1968_69 కాలానికి సంబంధించిన అనావృష్టి సహాయక కార్యక్రమం మొదట్లో 1969 జూన్ మాసాంతంతో ఆపాలని భావించారు. అయితే వర్తమాన సంవత్సరంలో వర్షాలు ఆలస్యం కావడం వల్ల, కొన్ని కొన్ని జిల్లాలనుంచి తగినంత వర్షం కురవ లేదన్న వార్తలు రావడంవల్ల అవసరమైనప్పుడు 1969 సెప్టెంబరు మాసాంతంవరకు కూడా సహాయక చర్యలను కొనసాగించడానికి ప్రభుత్వం అధికారాలు యిచ్చింది. పరిస్థితిని మదింపువేసి సహాయక చర్యలను కొనసాగించడానికి, మంచినీటి సౌకర్యాన్ని కల్పించడానికి ఏ ఏ సహాయాలు అందజేయాలో నిర్ణయించేందుకు ఈ జిల్లాలలో పర్యటించవలసిందిగా ఈ కరువు సహాయక విషయాలను చూసే రెవిన్యూబోర్డుసభ్యుడిని కోరడం జరిగింది.

అనావృష్టి సహాయక కార్యక్రమాల్లో అనధికారులు ఎక్కువగా పాల్గొనేట్టు చేయడానికి ప్రభుత్వం చాలా ఆతృత పడుతున్నది.

అనావృష్టి సహాయక ప్రణాళికనుగూర్చి జిల్లా పరిషత్తు సమావేశంలో పునః చర్చించి పరిషత్తు సభ్యుల ఉద్దేశాలకు అనుగుణంగా కార్యక్రమంలో కొత్తగా పథకాలను చేర్చవలసిందిగాకూడ ప్రభుత్వం ఉత్తరువులను జారీ చేసింది.

అనావృష్టి సహాయక కార్యక్రమం

అనావృష్టి సహాయక కార్యక్రమాలను అమలుపరిచేందుకు 1968 ఏప్రెల్ మొదలుకొని ఇంతవరకు ప్రభుత్వం రూ. 20.15 కోట్లను విడుదల చేసింది. దీనిలో రూ. 17.05 కోట్లను 1968_69 ఆర్థిక సంవత్సరంలోనూ, మిగిలిన రూ. 3.10 కోట్లను 1969 ఏప్రిల్ తర్వాత విడుదల చేయడం జరిగింది. 1969 జూన్ మాసాంతంవరకు జరిగిన ఖర్చు రూ. 16.96 కోట్లు. అయితే మిగతా మొత్తంలో కొంత భాగం మంచినీటి సరఫరా పథకాల్ని, ఉపాధి కల్పించే ఇతర ప్రాంతీయ కార్యక్రమాలకు సంబంధించిన పథకాల్ని చేపట్టే నిమిత్తం పంచాయితీరాజ్ సంస్థలకు బదిలీ చేయడమో, లేక బకాయి బిల్లుల విషయంలో వెచ్చించడమో చేయాలని అప్పుడే నిర్ణయించడం కూడా జరిగింది.

ఈ మాదిరి సహాయకార్యక్రమానికి అయ్యే పెద్ద మొత్తంలో ఖర్చును దృష్టిలో పెట్టుకొని ఆర్థిక సహాయం చేయవలసిందిగా భారత ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఇంతవరకు 1968_69 ఆర్థిక సంవత్సరానికి మొత్తం రూ. 14 కోట్ల కేంద్ర సహాయాన్నీ, 1969_70 కాలానికి రూ. 2 కోట్ల తాత్కాలిక సహాయాన్ని యివ్వడానికి భారత ప్రభుత్వం అంగీకరించింది. 1968_69 కాలానికి యివ్వనున్న మొత్తాన్ని కనీసం రూ. 15 కోట్లకు పెంచాలని 1969_70 కాలానికి యివ్వదలచిన మొత్తాన్ని రూ. 9 కోట్లకు పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరడం జరిగింది.

గ్రంథ సమీక్ష

గుంటూరు జిల్లాలో చూడదగిన ప్రదేశాలు

ఈ గ్రంథం శ్రీ వేంకటేశ్వర గ్రంథమాల వారి తృతీయ ప్రచురణగా, దక్కన్ క్రానికల్ విలేఖరి శ్రీ పి. వి. ప్రసాదరావు, (గుంటూరు) సంపాదకత్వాన వెలువడింది. ప్రతి వెల రూ. 5.00 కాపీలకు గ్రంథకర్త పేర గుంటూరునకు వ్రాయాలి.

ఈ గ్రంథం గుంటూరు జిల్లాలో ప్రధానంగా చూడవలసిన యాత్రస్థలాలను గూర్చి తెలయజేస్తున్నది. కాని ఈ గ్రంథంలో లేని చూడదగినప్రదేశాలు గుంటూరుజిల్లాలో ఇంకాఉన్నవి. కాని, వున్నంతలో ఇది సమగ్రంగానే ఉన్నదని చెప్పాలి. ఆయా ప్రదేశాలకు సంబంధించిన ఫోటోలు చాలా తక్కువగావున్నాయి. ఫొటోలు యింకా ఎక్కువగాఉంటే ప్రచురణ ఆకర్షణీయంగా వుండేది. ఈలోటును రానున్న ప్రచురణలో సంపాదకులు పూరించుకోగలరని ఆశిద్దాం.

సాధారణంగా, ఇలాంటి గ్రంథాలను వ్రాయటం చాలాకష్టం. ఎందుకంటే అవసరమైనంతగా, తగినంతగా ఆ యాత్రాక్షేత్రాలను గురించిన స్థలపురాణం గాని శిల్పవిశేషాలకు సంబంధించిన అంశాలు గాని మరి ఇతర విశేషాలుగాని ఎక్కడా ఒకచోట లభ్యంకావు. అనేకచోట్ల నుండి శ్రమపడి సమాచారం సేకరించుకోవలసి వుంటుంది. ఎంతో ఓర్పు, అంతకు మించిన నేర్పు ఉంటేగాని ఈలాంటి గ్రంథాలను వెలికితీయడం, సాధ్యపడదనడం సత్యం. ప్రభుత్వం చేపట్టవలసిన ఇలాంటి ప్రయత్నాన్ని ఒకజర్నలిస్టుగా, ఒకవ్యక్తిగా ప్రసాదరావుగారు పూనుకొని సాధించడం ప్రశంసార్హం.

రెండు దశాబ్దాలకు పైగా పత్రికా రచయితంగా తెలుగువారికి చిరపరచితులైన శ్రీ ప్రసాదరావుగారిలేఖిని నుండి, ఇంకా యిటువంటి అనేక విజ్ఞానాత్మకమైన గ్రంథాలు, వెలువడగలవని ఆశించవచ్చు.

— చైతన్య

గృహిణి

పిలకా గణపతి శాస్త్రి

రెండురోజులు గడిచినా పార్థసారథి పరిస్థితిలో మంచి మార్పేమీ కనబడలేదు. పైగా మనిషి మరింతగా నీరసించాడు. అయితే మధుసూధనరావు నాలుగయిదు గంటలకొకసారి ఇస్తున్న మాత్రలవల్ల, మందులవల్ల రుగ్మత అంతకన్న విషమించలేదు. రెండవనాటి ఉదయం మెయిలులో సరోజ తప్పక రాగలదని విజయలక్ష్మి ఎంతయినా ఆశించింది. కాని ఆమె రాలేదు. ఆఖరికి టెలిగ్రాంకూడా పంపించలేదు సరిగదా, ఒక్క ఉత్తరం ముక్కకూడా రాసి పడవెయ్యలేదు! పోనీ అనుకుంటే రాఘవదగ్గర నించికూడా సమాధానంరాలేదు! ఒకవేళ ఆ ఉత్తరాలు అందలేదేమో అనుకుంటే సరోజ మరొక నెలరోజులవరకు అదే హోటలులో ఉండిపోగలదని రాఘవ కూడా అక్కడే దిగాడన్ని చెప్పాడు. అయితే వారిద్దరి దగ్గరనించి కూడా సమాధానాలు రాకపోడానికేమిటి కారణం? విజయలక్ష్మి కేమి పాలు పోలేదు. అదేమాట ఎంతోఆందోళనతో కృష్ణమూర్తితో అన్నది.

"ఆ! నీ కేమో వెర్రిగాని సరోజ రాదు సరిగదా! కాస్త ఉత్తరంముక్కకూడా రాయదని నేనుముందే అనుకున్నాను. వస్తే రాఘవ దగ్గరనించి సమాధానం రావచ్చునన్ని ఎదురుచూశాను. అంతే; ఇంతకీ అతనెందుచేత రాయలేదో మరి".

మృదువుగా మందలిస్తున్న ధోరణిలో విజయలక్ష్మిని ఓదార్చాడు. అతడంతకు మునుపు చెప్పిన మాటలనుబట్టి ఏలూరులో ఎదురుపడిన ఆశాభంగంవల్ల, మద్రాసులో అకస్మాత్తుగా తెలిసిన సరోజ వివాహ వార్తవల్ల, మనోవైకల్యం కలగడం మూలాన భర్తకంతటి జబ్బు చేసి ఉండవచ్చునని విజయలక్ష్మి ఊహించుకొన్నది. డాక్టరు మధుసూదనరావు రోగనివారణ ధోరణికూడాదానికి బాగా దోహదం కలిగించింది. అందుచేతనే సరోజ ఒక సారివచ్చి పలకరించి వెడితే ఆ గండం గడిచి బయట పడగలదని ఆశించింది. కాని ఇక ఆమెకు ఆశాజ్యోతి కనుచూపుమేరలో ఎక్కడా కనబడలేదు! ఇక ఇప్పుడేమి చెయ్యాలి? అదే ప్రశ్న తిరిగి తిరిగి ఆదేపనిగా ఆమె హృదయంలో ప్రతిధ్వనించింది.

ఆవేళ సాయంత్రం నాలుగయిన తరువాత డాక్టరు మధుసూదనరావు వచ్చి పరీక్షచేసి పార్థసారథి పరిస్థితిలో ఏమీ అభివృద్ధి కనబడకపోయినా పూర్వంకన్న వి[illegible]ంచలేదని రవంత సంతృప్తిపడి ఇంకొక కొత్త ఇంజక్షనేదో ఇచ్చి, అది పనిచేసి తీరుతుందని చెప్పి వెళ్ళిపోయాడు. అయితే ఆ తరువాత కృష్ణమూర్తికి గాని, విజయలక్ష్మికిగాని అతడిచ్చిన ఇంజక్షనువల్ల రవంతయినా గుణం కలిగినట్టు కనబడలేదు. కాని తామిక చెయ్యగలిగినదేమిలేదని ఆ దైవంమీదే భారంవేసి విజయలక్ష్మి పార్థసారథి అనుక్షణము జాగ్రత్తగా పరిచర్యచేశారు.

ఆవేళ రాత్రి ఎనిమిదిగంటల కందరూ భోజనాలు ముగించుకున్నారు. పార్థసారథి ఆవేళనాటి సాయంత్రంనుంచి కొంచం మగత కమ్ముకున్నట్టు కనబడింది. విజయలక్ష్మి, కృష్ణమూర్తి అతనికిరువైపుల కూర్చున్నారు. రవంత తగ్గించిన హరికెన్ లైటు వెలుగుపడి పార్థసారథి ముఖం బాగా పాలిపోయినట్టు కనబడింది. ఒకవేళ డాక్టరు ఇచ్చిన కొత్త ఇంజక్షను పనిచేసి నిద్రపట్టినదేమో అనివిజయలక్ష్మి కొంచం సంతోషించింది. ఆవేళ శుక్రవారం. అందుచేత అంతకుమునుపే పట్టుచీర కట్టుకుని అమ్మవారి గదిలోకి వెళ్ళి, దేవతార్చన పీఠంమీది అక్షంతలు శిరస్సుమీద వేసుకున్నది. నుదుట చిన్న కుంకుమబొట్టు పెట్టుకొన్నది. పూజచేసిన చేమంతి పువ్వులు కొన్ని సిగలో తురుముకొన్నది. ఆ చల్లని తల్లి దయకలిగితే భర్తకానాటినుంచి అయినా రోగం మళ్ళుముఖం పట్టవచ్చునని ఆశించింది.

పార్థసారథి కొంచం మేలుకున్నాడు. కృష్ణమూర్తి వెంటనే అతనినోట అయిదారు చెంచాల కొంచెం వేడి హార్లిక్సు పోశాడు. పార్థసారథి నెమ్మదిగా మూలిగాడు. అయినా అతని కళ్లు ఇంకా పూర్తిగా తెరుచుకున్నట్టు కనబడలేదు. ఆ పరిస్థితి విజయలక్ష్మికెంతయినా ఆందోళన కలిగించింది.

జరిగిన కథ

పార్థసారథికి నాటకాలపిచ్చి. రాఘవ అనే ఆయన వాళ్ళనాటకాల్లో హీరోగానూ, సరోజ హీరోయిన్‌గానూ వేస్తుండేవారు. ఒకసారి ఏలూరులో శ్రీకృష్ణ తులాభారం నాటకం వేయాలని అన్నిఏర్పాటూ చేసుకున్నారు. కాని సరోజకు సినిమా ఛాన్సు రావడంతో ఆ నాటకం ఆగిపోయింది. సరోజను పిలుచు కొద్దామని మద్రాసువెళ్ళిన పార్థసారథికి టైఫాయిడుజ్వరంవస్తే యింటికి తీసుకొచ్చారు. డాక్టరు మందుయిస్తున్నాడు.

'బావా ! త్వరగావెళ్లి డాక్టరుగారి నొకసారి పిలుచుకువస్తే మంచిదేమో !'

బాగా కంగారుపడుతూ అడిగింది.

'ఇది సాయంకాలంనించి ఉన్నమగతేగా ! ఇంతమాత్రానికే అంతకంగారెందుకు ? అనవసరంగా బెంబేలు పడిపోకు విజయా ! అంతగా అవసరమయితే వెంటనే వెడతానులే !'

ఆ విధంగా ధైర్యంచెప్పిన తరువాత విజయలక్ష్మి మరి బలవంతం పెట్టలేదు. మరికొన్ని నిమిషాలలోనే పార్థసారథికి సంధి, విపరీతమయిన ఆరాటము ప్రారంభమయ్యాయి. 'ఇంకా సరోజ రాలేదా ? తప్పకుండా వచ్చి తీరుతానని మాట ఇచ్చిందే ! ఎందుచేత రాలేదు ? ఈ పాటికి రావలసిందే. ఇంకా రాలేదా ? రాలేదా ?' అన్న ప్రశ్న అదేపనిగా ఎడతెరిపి లేకుండా అతని నోటినుండి వెలువడింది. క్రమక్రమంగా ఆ ప్రశ్నల నిరంతర ధోరణీ, ఆ ఆరాటమూ మరింతగా శ్రుతిమించిపోయాయి.

భర్త విపరీత యాతన గమనించి విజయలక్ష్మి మరి భరించ లేక పోయింది. క్షణకాలం కళ్ళు మూసుకుని రెండుచెవులలోను వేళ్ళు పెట్టుకొన్నది. వెంటనే లేచి వంటఇంటివైపు వెళ్ళిపోయింది. ఆమె ఎందుకలాగ తొందరగా వెళ్ళిపోయింది ? కృష్ణమూర్తి కేమీ బోధపడలేదు. ఒకవేళ ఏదయినా అఘాయిత్యం తలపెట్టిందేమో? అని క్షణకాలం భయపడ్డాడు. కాని అంతలోనే అతనికి ఆమె అటువంటి పనికి ఒడిగట్టదని తమాయించుకున్నాడు. అలాగలాగ పది పన్నెండు నిమిషాలు గడిచిపోయాయి! అతనికి అక్కడ కాలు నిలువలేదు. వెంటనేలేచి లోపలికివెళ్ళి ఆమె సంగతి ఆరా తియ్యాలని సంకల్పించుకున్నాడు. కాని తిరిగి రెండు మూడు నిమిషాలసేపు తటపటాయించాడు.

మరు నిమిషంలోనే విజయలక్ష్మి చక్కగా ముస్తాబయి అక్కడికి తిరిగివచ్చింది. ఆమె సొగసయిన ఉదారంగు సిల్కు చీర కట్టుకుని, దాని కన్నివిధాల చక్కగా అమరిన జరీ బంతిపూల జాకెట్టు తొడుక్కున్నది. ముఖానికి పౌడరు వేసుకుని సిగలో పసుపుపచ్చని చంద్రకాంతాల మాల అర్ధచంద్రాకారంగా అలంకరించుకొన్నది. ఎన్నడులేనిది చేతితో ఒక వానిటీ బాగ్ పట్టుకున్నది. కాపరానికి వచ్చిన కొత్తలో పార్థసారథి ఆమె కది బహూకరించాడు. కాని అప్పటినించి ఆమె అది ఎన్నడు చేతపట్టలేదు. అలాగే పడకగదిలో అలమారులో ఒకమూల జాగ్రత్తగా భద్రపరచింది. ఇప్పుడది పట్టుకుని హేలగా అటుఇటు ఊగిస్తున్నది. ఆ వింతవైఖరి గమనించిన కృష్ణమూర్తి నోట అయిదారు క్షణాల దాకా ఒక్కమాటయినా వెలువడలేదు. అంతలోనే ఆమెచేతితో మాట్లాడవద్దని సంజ్ఞచేసి హేలగా నడచివెళ్ళి ఠీవిగా భర్త కెదురుగాకుర్చీలో కూర్చొని చిక్కని చిరునవ్వు చిందించింది. మ్రోగన్నుపెట్టినట్టున్న హరికేన్ లైటువెలుగు లీలగా ఆమె నుదిటి మీద ప్రసరించింది.

పార్థసారథి పరధ్యానంగా పైకిచూస్తూ అర్ధనిమీలిత నేత్రాలతో 'సరోజ ఇంకా రాలేదా? రాలేదా?' అని ఆయాసపడుతూ కొంచెం గట్టిగా గొణుక్కుంటున్నాడు. విజయలక్ష్మి అతనికి రవంతదూరంగా జరిగికూర్చుని గొంతెత్తి రవంత స్వరంమార్చి సమాధానం చెప్పింది.

'వచ్చాను! ఒంట్లో కులాసాగా ఉందా?' ఉట్టిపడుతున్న ఆప్యాయతతో ప్రశ్నించింది.

'ఎవరు నువ్వు!'

పార్థసారథి మొలకెత్తుతున్న జిజ్ఞాసతో బొమముడి విరిచి ప్రశ్నించాడు.

'ఇదేమిటి? అప్పుడే మరిచిపోయారు. నేను సరోజని! ఇప్పుడే రైలుదిగి వచ్చాను. ఒంట్లోకాస్త తేలికగాఉందా?'

విజయలక్ష్మి హృదయాంతరాళంలో ప్రజ్వలిస్తున్న తీవ్రాతితీవ్రమయిన దారుణవ్యధనంతా తన యావచ్ఛక్తినివినియోగించి నిగ్రహించుకుని కల కల నవ్వుతున్న ముఖభంగిమతో ప్రశ్నించింది.

'వచ్చావా! సరోజా! ఎంతకాలానికి వచ్చావు! ఇంకా రావేమో అనుకున్నాను సుమా!'

పార్థసారథి అర్ధనిమీలిత నేత్రాలు మరింతగా వికసించాయి. పెదవులపై పేలగింజవలె మొలకెత్తిన చిరునవ్వు పారిజాతమై వికసించింది. "హమ్మయ్య" అన్నట్టు సుదీర్ఘమయిన కవోష్ణ నిశ్వాసం వెలువడింది. విజయలక్ష్మి చెక్కుచెదరని చిరునవ్వు చెంగలింపుతో క్షణకాలం భర్తముఖం పరిశీలించి కనురెప్పలలోన పంచివేసింది.

'అదేమిటి? అలాగంటారు! ఎందుకురాను! నాకు మీ జబ్బు సంగతే తెలియలేదు! లేకపోతే రెక్కలు కట్టుకునివచ్చి ఇక్కడ వాలిపోనూ!'

పార్థసారథిముఖం మరింతగా వికసించి కలకల లాడింది. రెండు మూడు క్షణాలపాటు కలకల నవ్వుతూ రవంత పక్కకి తిరిగి కృష్ణమూర్తిని పలకరిస్తున్న ఆమె చెక్కిళ్లవైపు చూసి నెమ్మదిగా కళ్లుమూసుకుని నిద్రపోయాడు! కృష్ణమూర్తి వేరొకవైపునుండి ఆమె అభినయం చాతుర్యం నిశ్చల నేత్రాలతో పరిశీలించాడు. పార్థసారథి ప్రశాంతంగా నిద్రించేవరకు కలకలనవ్వుతున్న ఆమె ముఖవైఖరిలో రవంతయినా మార్పు కనబడలేదు. ఆ తరవాత ఆ దుస్సహ నటనయే తను భరించలేక తటాలున తాను కూర్చున్న కుర్చీలోనే కూలబడి అయిదారు క్షణాలపాటు మూర్ఛపోయింది! కాని వెనువెంటనే చలించని గుండెదిటవుతో తిరిగి తెలివితెచ్చుకుని ఆ భర్త ప్రసన్ననిద్ర నిమిషకాలం పరిశీలించింది. పోనీ తన నటనవల్ల కొంచెమయినా గుణం కనబడింది కదా అని ఎంతో సంతోషించి నెమ్మదిగాలేచి చప్పుడుకాకుండా లోపలికి వెళ్ళిపోయింది. అప్పటివరకు కృష్ణమూర్తి కేవలం శిలాప్రతిమలా నిశ్చేష్టితుడయినాడు.

(సశేషం)

సీరియల్:

తిరస్కృతి

— వాసిరెడ్డి సీతాదేవి

రెండో నాటి రాత్రి సత్యం, మాధవరావూ, కేశవరావుఇంటికి భోజనానికి వచ్చారు. అమీర్‌పేటకూ, సనత్‌నగర్‌కూ మధ్య, రోడ్డుకు పక్కగావున్న విశాలమైన స్థలం కేశవరావు ఇల్లు. ఇల్లు చిన్నదే అయినా చూపరుల దృష్టిని ఇట్టే ఆకట్టుకొంటుంది. చుట్టూ వున్న స్థలం పెద్దదిగానే వుంది. ఇంటిచుట్టూ ఫెన్సింగ్ వుంది. ఇంటి ముందు చక్కగా పెంచిన పూలతోట కనుల పండువుగా వుంది. కుటీరం ఆకారంలో కనిపిస్తున్న ఆ చిన్న ఇంటిమీద మాలతీ మాధవంలత అల్లుకొని కళ్ళకు హాయిగా తోస్తుంది. ఆ వాతావరణంలోని ప్రశాంతతా, పచ్చని మొక్కలూ, లతలూ, అది ఒక పర్ణశాలలా అనిపిస్తుంది. అదిచూసి మాధవరావు మరీ ముగ్ధుడైపోయాడు. ఖరీదైన ఫర్నీచర్‌తో వున్న తమ పెద్దబంగళాలోలేని అందం, శాంతీ ఈ కుటీరంలో వున్నట్లనిపించింది మాధవరావుకు.

"మీ ఇల్లు ఎంత బావుందండీ! నిజంగా ఇక్కడే వుండిపోదామా అని అనిపిస్తుంది. సొంత ఇల్లేగా? ఈ ప్లాను ఎవరు వేశారు?" మాధవరావు లోపల అడుగు పెడుతూనే ప్రశ్నించాడు.

"ప్రకృతి మాత జడలోవున్న చిన్న మల్లెమొగ్గలా వుంది కదూ ఈ ఇల్లు?" సత్యం సంతోషంగా అన్నాడు.

"ప్లానంతా అమ్మాయేవేసింది!" అన్నాడు కేశవరావు.

మాధవరావు ప్రశంసా పూర్వకంగా చూశాడు విమల ముఖంలోకి.

"అదేం లేదండీ! అంతా నాన్నగారే దగ్గరవుండి కట్టించారు. ఇంటి ముందు పూలతోటనూ, ఇంటి వెనక కూరగాయల మొక్కల్నీ ఎంతో శ్రమపడి పెంచారు. రోజుకు నాలుగు గంటలన్నా తోట పని చేస్తారు." అంది విమల.

"మీ కల్పనకు మాస్టరుగారు రూపాన్ని ఇచ్చారన్నమాట!" అన్నాడు సత్యం. విమలకు సత్యం ప్రశంస పరిమళ భరితమైన మలయ మారుతంలా సోకింది.

"అయితే చెప్పవోయ్! కల్పన గొప్పదా! దానికి ఇచ్చిన రూపం గొప్పదా?" అన్నాడు మాధవరావు.

"ఎంత ప్రయత్నించినా ఎవరూ కల్పనకు సమగ్రరూపాన్ని ఇవ్వలేదు. కొంతవరకు మాత్రమే. అంటే ఆ రూపం ద్వారా కల్పనను మళ్లీ కల్పనతోనే చూడటానికి సాధన మాత్రంగానే వుండిపోతుంది." అన్నాడు సత్యం.

"అంటే, ఇంత సుందరమైన ఈ ఇంటి పరిసరాలకంటే విమలాదేవి గారు తన కల్పనా లోకంలో చూసిన ఇల్లు ఇంకా సుందరమైనదేగా?" అన్నాడు మాధవరావు విమల కళ్లలోకి లోతుగా చూస్తూ. ఆ చూపుల్ని తట్టుకోలేని విమం కళ్లను పక్కకు తిప్పుకుంది.

ఆ చిన్న ఇంట్లో ప్రవేశించగానే ఒకహాలు. రెండుగదులూ ఒక వంట ఇల్లూ మాత్రం వున్నాయి. ఆ ఇంటిని అలంకరించిన తీరులో ఆ ఇంటివారి సాదా జీవితం, కళా ప్రియత్వం గోచరిస్తున్నాయి.

హాలులోని గోడలకు రకరకాల చిత్రపటాలు కనిపించాయి. అందులోని చాలా చిత్రాలు విమల వేసినవే నని తెలుసుకున్న మాధవరావుకూ, సత్యానికీ కూడా ఆశ్చర్యం వేసింది.

"మీకు చిత్రకళ కూడా తెలుసా?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు మాధవరావు.

"పెద్దగా తెలియదండీ? ఏమీ తోచనప్పుడు రంగులతో కుస్తీపడుతూ వుంటాను. అదొక చిత్రకళగా నేను అనుకోవటం లేదు. నాన్న నేను వద్దంటున్నా ఫ్రేములు కట్టించి గోడలకు వేశారు." అంది విమల కొంచెం సిగ్గుతో.

"మీరు చిత్రకళను ఎవరిదగ్గర అభ్యసించారు?" మాధవరావే మళ్ళీ ప్రశ్నించాడు. సత్యం, చిత్రాలను పరిశీలించడంలో మునిగిపోయివున్నాడు.

జరిగిన కథ

సత్యంకు చిన్నప్పటినించీ చిత్రకళ అంటే యిష్టం. శాంతి నికేతన్‌కు వెళ్ళి చిత్రకళ అభ్యసించాడు. అతని తమ్ముడు సూర్యం డాక్టరు పరీక్షకు చదివాడు. మేనమామ కూతురు తనను పెళ్ళి చేసుకోదలచలేదని తెలిసి వూరువిడిచి వెళ్ళిపోయాడు సత్యం. చాలాకాలం తర్వాత హైదరాబాదులో ఎగ్జిబిషన్ పెట్టాడు. ఒక మిత్రునిద్వారా, చిన్నప్పుడు తనకు చదువుచెప్పిన మాస్టారు కేశవరావుగారనీ, వాళ్ళమ్మాయి విమలనూ కలుసుకోవడం తటస్ించింది. వాళ్ళ ఆహ్వానంమీద వారింటికి సత్యం, అతని స్నేహితుడు మాధవరావూ భోజనానికి వెళ్ళారు.

"ఎవరి దగ్గరా అభ్యసించలేదు. తనకుతానుగానే తీరికన్నప్పుడల్లా అభ్యాసంచేస్తూ వుంటుంది. సహజమైన ప్రతిభవుంది." అన్నాడు కేశవరావు.

"అవును కొంచెం గైడెన్స్ వుంటే ... విమలగారి చేతిలో చాల మంచి కళాఖండాలు తయారయే అవకాశం వుంది." అన్నాడు సత్యం.

"అవును సత్యం! ఆ గైడెన్స్ ఏదో నువ్వే ఇవ్వకూడదూ?" అన్నాడు కేశవరావు.

విమల ఆత్రంగా సత్యం జవాబుకోసం చూసింది.

"అలాగేనండి! తప్పకుండా నా చేతనైన సహాయం చేస్తాను" అన్నాడు సత్యం మామూలుగానే. ఏలాంటి ఉద్వేగం లేదు. విమల కళ్లలో కదిలిన కాంతిరేఖల్ని మాధవరావు మాత్రమే చూశాడు.

సత్యం కళ్లు అకస్మాత్తుగా ఓ చిత్రంమీద నిలచిపోయాయి. ఆశ్చర్యంగా చూశాడు. గతం తన ముఖంమీది ముసుగు తొలగించుకొని సత్యం ఎదురుగా వచ్చి నిల్చుంది. సత్యం ఆలోచనల్లోకి జారిపోయాడు.

"ఏమిటోయ్ అంత శ్రద్ధగా చూస్తున్నావ్?" అంటూ మాధవరావు వచ్చాడు. అతని కళ్లూ ఆ చిత్రంమీదకే వెళ్ళాయి.

'ఒక మొరటు వ్యక్తి. తలగుడ్డా, మోకాళ్ళవరకు విరిచి కట్టిన పంచా, చొక్కాలేని ఛాతీ. చేతిలో పొడవుగా వున్న బాణాకర్ర పెదవులమీద క్రౌర్యాన్ని వెలువరించే చిరునవ్వూ— అతని చూపులు నేలవైపు వున్నాయి. కింద నడుం విరిగిన నాగరాజు. ప్రపంచాన్నే కాటెయ్యాలన్నంత కోపం వెలుగక్కుతున్న నాగరాజు పడగ గాలిలోకి నిలువుగా లేచివుంది. నడుం విరిగిన నాగరాజు అసహాయతతో మెలికలు తిరుగుతూ మరణ వేదన వ్యక్తం అవుతున్న శోకతో కనిపిస్తుంది."

"ఈ చిత్రం గుర్తుందా సత్యం? ఆరోజు నువ్వు క్లాసులో గీస్తుంటే నేను తీసుకున్నాను. తరువాత అమ్మాయి దాని ఆధారంతో ఈ బొమ్మను గీచింది. రంగులు వేసిన ఆమె మొదటి చిత్రం ఇదే" అన్నాడు కేశవరావు.

వారి హృదయాల్లో తనకు అంత స్థానం వుందా? విమలకు తనంటే అంత గౌరవమా? సత్యం కళ్ళలో నీరు తిరిగింది. అనుకోకుండా ఎదురైన ఆ ఆత్మీయతను తట్టుకోలేక పోతున్నాడు.

"అవును మాస్టారూ? ఈ చిత్రమే నాకు మీ ఆదరాభిమానాల్ని సంపాదించి పెట్టింది. ఆ రోజు నేను ఈ చిత్రం గీయకపోతే, క్లాసులో మీరు నన్ను మందలించకపోతే మనం ఇంత దగ్గరగా వచ్చి వుండేవాళ్ళంకాదు. నేను శాంతినికేతన్‌కు వెళ్ళేవాణ్ణికాదు. చిత్రకారుడు కావాలనే నా కోరిక అలాగే మిగిలిపోయి వుండేది." అన్నాడు సత్యం గద్గద స్వరంతో.

"నాదేముందోయ్! నీలో ప్రతిభవుంది. అది ఏదోవిధంగా బయటపడే మార్గాన్ని వెతుక్కునేది." అన్నాడు కేశవరావు.

మాధవరావు అడగ్గా కేశవరావు ఆ చిత్రం గీచిన నాటి సంఘటన నుంచి, సత్యం శాంతినికేతన్‌కు వెళ్ళేంతవరకు వివరించి చెప్పాడు.

భోజనాలయాక వెన్నెల్లో ఇంటిముందు, పూలమొక్కల మధ్యగా కుర్చీలు వేసుకొని కూర్చున్నారు.

చిత్రకళతో ప్రారంభమైన వారి సంభాషణ సాహిత్యం నుంచి రాజకీయాలవరకూ వచ్చింది. ఎన్నో విషయాలు మాట్లాడుకున్నారు. కేశవరావూ, మాధవరావే ఎక్కువ మాట్లాడుతున్నారు. మధ్య మధ్య ఎప్పుడోగాని సత్యం మాట్లాటం లేదు. విమల మౌనంగా కూర్చొని అందరి మాటలూ వింటున్నది.

"మాట్లాటం ఒక రోగం—వినటం ఒక కళ. చూడండి నేను ఇంత వాగుతున్నాను. వాళ్ళిద్దరూ ఏమైనా మాట్లాడుతున్నారేమో? ఎలాగయినా కళాకారులనిపించుకున్నారు." అన్నాడు మాధవరావు.

ఆ మాటలకు కేశవరావూ, సత్యం కూడా పకపకా నవ్వారు. విమల తలవంచుకొని చిరునవ్వు నవ్వింది.

"అవును! సత్యం! నువ్వు మీ ఊరు వదిలి ఎందుకొచ్చేశావ్? తమ్ముడు ఏం చేస్తున్నాడు? పెళ్ళయిందా? అమ్మా నాన్నా కులాసాగా వున్నారా? మీ అత్తయ్య కూతుర్ని నీకు ఇచ్చి శాంతినికేతన్ నుంచి రాగానే వివాహం చేస్తానన్నారు మీ నాన్నగారు?" అన్నాడు కేశవరావు.

సత్యం ముఖంలో గాబరా కనిపించింది. ఇలాంటి ప్రశ్నలు ఆ సమయంలో ఎదుర్కోవాల్సి వుంటుందని సత్యం ఊహించలేదు. అతని కళ్లలో లీలగా విషాదరేఖలు కదిలి నిలిచిపోయాయి.

విమల ఊపిరి బిగ బట్టుకొని సత్యం జవాబు కోసం చెవులు రిక్కించుకొని కూర్చుంది.

"నేను వెళ్ళిపోతాను." మీరు మాట్లాడుకోండి! అంటూ లేచాడు మాధవరావు. సత్యం తటపటాయించటం చూసి. తన ముందు జీవిత రహస్యాలు మాట్లాటం ఇష్టం లేదేమో ననుకున్నాడు.

"కూర్చోరా? నీ ముందు నాకు రహస్యాలేమిటి? గతాన్ని తిరగ దోడుకోవడం ఇష్టంలేక నీవు ఎన్నిసార్లు అడిగినా చెప్పలేదు. అంతే!" అన్నాడు సత్యం.

"నీ కంత బాధ కలిగించే విషయాలయితే ఇప్పుడొద్దులే." అన్నాడు కేశవరావు.


"లేదు! మాస్టారూ! చెబుతాను. మీలాంటి ఆప్తులకు చెప్పుకొంటేనైనా నా హృదయ వేదన కొంతవరకు ఉపశమిస్తుంది.

సత్యం తాను శాంతినికేతన్ నుంచి తిరిగి రావటం దగ్గర నుంచి, ఇల్లు విడిచేంత వరకూ జరిగిన విషయాలను చెప్పాడు. అందరూ మౌనంగా విన్నారు. వాతావరణం బరువుగా వుంది.

[సశేషం]

నగరంలో . . .

హైదరాబాదుకు రాష్ట్రపతిరాక



సికిందరాబాదు స్టేషన్‌లో రాష్ట్రపతికి స్వాగతం

భారత రాష్ట్రపతి శ్రీ వి. వి. గిరి సతీసమేతంగా సెప్టెంబరు 22 వ తేదీన హైదరాబాదుకు వచ్చారు. రాష్ట్రపతికి ఏటా కొన్ని రోజులపాటు దక్షణాది విడిదిగావుండే బొలారంలోని రాష్ట్రపతి నిలయంలో వీరువుంటారు. రాష్ట్రగవర్నరు శ్రీ ఖండూభాయ్ దేశాయ్, ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి, నగర మేయరు శ్రీ ఎన్. లక్ష్మినారాయణ, యింకా అనేక అధికార అనధికార ప్రముఖులు స్టేషన్‌లో రాష్ట్రపతికి స్వాగతంచెప్పారు.

ఆర్థిక స్వరాజ్యానికి కృ




రాష్ట్రపతికి జరిగిన పౌర సన్మానంలో వెండితో చేసిన చార్మినార్ నమూనను వారికి బహూకరించారు

రాష్ట్రపతి శ్రీ వి. వి. గిరికి సెప్టెంబరు 22న రవీంద్ర భారతిలో పురపాలక సంఘ కార్పొరేషను పౌరసన్మానం జరిపింది. ఆ సందర్భంలో రాష్ట్రపతి మాట్లాడుతూ మనమంతా కలిసికట్టుగా పనిచేసినప్పుడు "ఒక్క రాజకీయ స్వరాజ్యాన్నేగాక ఆర్థిక స్వరాజాన్నికూడా సంపాదించుకో గలిగామని సగర్వంగా చెప్పుకొనే స్థితికి రాగలం " అన్నారు.

సహాయక చర్యల సమీక్ష

తుఫానుకు గురిఅయిన గుంటూరు, ఖమ్మం, కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాలలో నిర్వహిస్తున్న సహాయక చర్యలను గురించీ, జరుపుతున్న మరమ్మత్తులు మొదలైన పనుల గురించీ, ముందు ముందు తీసుకోవలసిన చర్యలగురించీ చర్చించేనిమిత్తం పై నాలుగు జిల్లాలకు చెందిన కలెక్టర్లు, జిల్లా పరిషత్తు అధ్యక్షులు, శాసనసభ్యులు, తదితరుల సమావేశం ఒకటి హైదరాబాదులో సెప్టెంబరు 18 వ తేదీన జరిగింది. ఈ సందర్భంలో రెవెన్యూ



రెవెన్యూ మంత్రి శ్రీ పి. తిమ్మారెడ్డి ప్రసంగిస్తున్న దృశ్యం

మంత్రి శ్రీ పి.తిమ్మారెడ్డి మాట్లాడుతూ, రైతులు ఋణసౌకర్యాలను వినియోగించుకునే నిమిత్తం వారికి వీలు కలిగించేందుకై జాయింట్ పట్టాల విభజన చేయవలసిన అవసరాన్ని గూర్చి పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్‌కు అగ్రస్థానం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మొత్తం దేశంలోనే ట్యూబెక్టమీ శస్త్రచికిత్సలు నిర్వహించడంలో అగ్రస్థానంలో వుందనీ, స్టెరిలైజేషన్ శస్త్రచికిత్సలలో ఈ రాష్ట్రానిది ద్వితీయస్థానమనీ రాష్ట్ర విద్యాశాఖామంత్రి శ్రీ పి. వి. నరసింహారావు సెప్టెంబరు 18 వ తేదీన జూబ్లీహాలులో కుటుంబనియంత్రణ పక్షోత్సవాన్ని ప్రారంభిస్తూ తెలియజేశారు.

ఈ ప్రారంభోత్సవ సమావేశానికి అధ్యక్షత వహించిన రాష్ట్ర సమాచార, పౌరసంబంధశాఖామంత్రి శ్రీ అక్కిరాజు వాసు




హైదరాబాదులో కుటుంబ నియంత్రణ పక్షోత్సవాలు

దేవరావు మాట్లాడుతూ యిటీవలి కాలంలో గ్రామీణ ప్రాంతాల వారు కుటుంబనియంత్రణను గురించి ఆసక్తిగా తెలుసుకుంటున్నారని చెప్పారు.


శాసనమండలి అధ్యక్షుని విదేశ పర్యటన

ఆంధ్రప్రదేశ్ శాసనమండలి అధ్యక్షుడు శ్రీ పిడతల రంగారెడ్డి సెప్టెంబరు 12 వ తేదీన రెండు నెలలపాటు విదేశ పర్యటనకు బయలుదేరారు. అక్టోబరు 4 నుంచి 19 వరకు ట్రినిడాడ్‌లో జరగనున్న కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ సమావేశంలో వీరు పాల్గొంటారు. వీరికి బేగంపేట విమానాశ్రయంలో ముఖ్యమంత్రి, విధానసభ స్పీకర్, అనేకమంది శాసనసభ్యులు వీడ్కోలు చెప్పారు.



శాసనమండలి అధ్యక్షులు శ్రీ పి. రంగారెడ్డికి వీడ్కోలు

ఆంధ్రప్రదేశ్ సంక్షేమనిధి



ఆగస్టు 30 వ తేదీన ముఖ్యమంత్రి శ్రీ కె. బ్రహ్మానందరెడ్డి రాఫిల్ టికెట్టుతీస్తున్న దృశ్యం

ఆంధ్రప్రదేశ్ సంక్షేమనిధికి సంబంధించిన తొమ్మిదవ రాఫిల్ డ్రా నిజాం కాలేజీలో ఆగస్టు 30 వ తేదీన జరిగింది. అభివృద్ధి కార్యక్రమాలకు డబ్బు సమకూరుస్తున్న యీ నిధి నిర్వాహకులను ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి అభినందిస్తూ సంక్షేమకార్యక్రమాలద్వారా విద్యార్థులు వివిధ భాషా వర్గాలవారితో కలియడానికీ, తద్వారా దేశ సమైక్యతకు దోహదంచేయగలగడానికీ అవకాశం కలిగించాలని అన్నారు. ఈ సందర్భంలో విద్యామంత్రి శ్రీ పి. వి. నరసింహారావు మాట్లాడుతూ ఈ విధమైన సంక్షేమనిధివల్ల అనేకులకు ఉపాధి లభిస్తున్నదని చెప్పారు.



సెప్టెంబరు 6 వ తేదీన హైదరాబాదు వచ్చిన ఫ్రెంచి రాయబారి శ్రీ జీన్ దరిదాన్, స్త్రీ సంక్షేమ,యాత్రికశాఖ మంత్రిణి శ్రీమతి రోడా మిస్త్రీతో సంభాషించారు.

జిల్లాలనుండి

పోచంపాడు ప్రాజెక్టు సందర్శన



సెప్టెంబరు 21 వ తేదీన శాసన సభ్యులు, పత్రికా విలేఖరులు పోచంపాడు ప్రాజెక్టును సందర్శించారు. ఈ బృందంతో ఇరిగేషన్ మంత్రి శ్రీ శీలం సిద్దారెడ్డి, సమాచార పౌర సంబంధ శాఖ మంత్రి శ్రీ ఎ.వాసుదేవరావు, అటవీ శాఖ మంత్రి శ్రీ సాగి సూర్య నారాయణ రాజు, మధ్యతరహా ఇరిగేషన్ శాఖ మంత్రి శ్రీ పురుషోత్తమరెడ్డి ఉన్నారు.

పోచంపాడు ప్రాజెక్టుపై ఇంతవరకు రూ. 11 కోట్లు ఖర్చు అయిందని, ఈ ఏడాది ప్రభుత్వం రూ. 6 కోట్లు మంజూరు చేసిందని, మరో రూ. 2 కోట్లు మంజూరుచేసే ఆలోచన వున్నదనీ శ్రీ సిద్దా రెడ్డి తెలియజేశారు.

మైదుకూరులో పాలశీతల కేంద్రం

నంద్యాలరోడ్డులోని మైదుకూరు జంక్షన్‌లో ఐదు ఎకరాల స్థలంలో పాలశీతల కేంద్రాన్ని ఏర్పాటుచేయాలని పశుసంవర్ధక శాఖ నిర్ణయించింది.

మైదుకూరు, చాగలమర్రి, ఇతర పరిసర గ్రామాలలో సేకరించినపాలను యీ కేంద్రంలో శుద్ధిచేసి, కడపకూ, మార్కెటు సౌకర్యంగల ఇతరపట్టణాలకూ సరఫరాచేస్తారు.

ప్రజలనుండి విరాళాలు సేకరించి యీ కేంద్రానికి అవసరమైన భవనాన్ని నిర్మిస్తారు.

నల్లగొండలో ఖండసారి చక్కెర ఫ్యాక్టరీ

నల్లగొండజిల్లా పరిషత్తు స్థాయిసంఘం సమావేశానికి అధ్యక్షతవహించిన జిల్లాకలెక్టరు శ్రీ ఆర్ గ్రోవర్ ప్రసంగిస్తూ మిర్యాలగూడెం, హుజూరునగర్, కోదాడుల్లో అద్యతనభావిలో మూడు ఖండసారిచక్కెర ఫ్యాక్టరీలను నెలకొల్పుతారని అన్నారు.

చెఱకుగడ ఉత్పత్తికి ఇవి అనువైన ప్రాంతాలని ఇటీవల యీ ప్రాంతాలలో పర్యటించిన చెరకుగడ నిపుణులు అభిప్రాయ పడ్డారు చెఱకు విషయాల కమీషనరు.

భూవసతిలేని పేదలకు భూమి పట్టాల పంపిణీ

వరంగల్లు జిల్లా కలెక్టరు శ్రీ పి. కె. దొరైస్వామి ఇటీవల జనగామ తాలూకాలోని షామీర్‌పేట గ్రామానికి వెళ్లిన సందర్భంలో భూవసతిలేని పేదవారికి 19 భూమిపట్టాలను పంపిణీచేశారు. ఆయన బుచ్చన్నపేట, పోచన్నపేట, ముస్త్యాల గ్రామాలకుకూడా వెళ్లి అచట చెరువులను, చేలను, పొలాలను తనిఖీ చేశారు గురువన్నపేట గ్రామంలో ఆయన భూవసతిలేని వారికి 45 పట్టాలను పంచిపెట్టారు. విజ్ఞాపనలు విన్నారు. అర్జునపట్ల చెరువునుకూడా తనిఖీచేసి ఆయకట్టు అభివృద్ధిని గురించి తెలుసుకున్నారు. ఆ గ్రామంలో ఆయన 46 పట్టాపత్రాలను పంపిణీచేశారు. వెల్దండలో ఆయన 105 పట్టాలను పంచిపెట్టారు, పట్టాలు పొందినవారిలో హెచ్చుమంది హరిజనులున్నారు.

గిరిజన అభ్యుదయ కార్యక్రమాల్లో యిదొక నిర్మాణాత్మక కార్యక్రమంగా భావించబడుతుంది.

నెల్లిమర్ల పంచాయితి సమితిలో వనమహోత్సవం

నెల్లిమర్ల పంచాయితి సమితిలో ఎన్నికచేసిన గ్రామాలలో వనమహోత్సవం జయప్రదంగా జరుపబడినది. వివిధ విస్తరణ శాఖాధికారులు, బ్లాక్ అసిస్టెంటు పబ్లిక్ రిలేషన్సు ఆఫీసరు, విలేజి లెవెల్ వర్కర్లు గ్రామాలలో వివిధ రకములైన మొక్కలు నాటించి వనమహోత్సవ ప్రాముఖ్యత గురించి గ్రామస్తులకు వివరించారు.

పల్లెవాడ గ్రామంలో హరిజనులకు గృహాలు

ఖమ్మం జిల్లా పరిషత్తు అధ్యక్షులు శ్రీ జె. కొండలరావు, సాంఘిక సంక్షేమ శాఖ అదనపు జిల్లా అధికారి, శ్రీ డి. ధర్మాచారి, కల్లూరు పంచాయితీ సమితి అధ్యక్షుడు శ్రీ. వై. రంగారెడ్డి, యిటీవల పల్లెవాడ, లచ్చన్నగూడెం గ్రామాలను సందర్శించి 63 హరిజనుల కుటుంబాలకు, యిండ్ల నిర్మాణం పూర్తి చేసుకోడానికి రెండవ కిస్తుగా రూ. 6000 లు పంపిణీ చేశారు. రెండు గ్రామాలలోను యిండ్ల నిర్మాణం పనులు చురుకుగా కొనసాగుతున్నాయి.

విద్యార్థులచే దేవాలయం పునరుద్ధరణ

అనంతపురం జిల్లా, రాయదుర్గంలోని కొంతమంది విద్యార్థులు కలిసి భక్తబాల మండలిని ఏర్పాటు చేసుకొని జీర్ణస్థితిలో వున్న శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయాన్ని పునరుద్ధరించారు. పునరుద్ధరించిన తరువాత మొన్నటి గోకులష్టమి నాడు ఈ దేవాలయంలో భక్తులకు ప్రవేశం కల్పించారు.

గిరిజనులకు ఎద్దుల సరఫరా

వరంగల్ జిల్లా ఏటూరు నాగారం గిరిజన బ్యాంకులో 40 మంది గిరిజనులకు, రూ. 16000 లు ఖరీదు చేసే 40 జతల

ఎద్దులను ఉచితంగా సరఫరా చేశారు. గిరిజనుల ఆర్థిక పరిస్థితిని మెరుగు పరిచే నిమిత్తం ఈ కార్యక్రమం చేపట్టబడింది.

హరిజనులకు కాలనీ

గుంటూరు జిల్లా వినుకొండ సమితిలోని పెదకంచెర్ల గ్రామంలో రు 1,50,000 ల ఖర్చుతో నిర్మించనున్న హరిజన కాలనీకి ఆర్. డి. ఒ శ్రీ యన్. నాగభూషణరావు సెప్టెంబరు 9 వ తేదీన శంకుస్థాపన చేశారు. ఈ కాలనీ నిర్మాణానికి అవసరమైన మొత్తంలో లక్షరూపాయలు ప్రభుత్వంవద్దనుండి గ్రాంటుగాను రు. 50 వేలు ప్రజలనుండి విరాళాల రూపంలోను సేకరిస్తారు. ఈ కాలనీలో 125 హరిజన కుటుంబాలవారికి వసతి ఏర్పాటవుతుంది. సమితి అధ్యక్షులు శ్రీ కంచెర్ల ఆదిశేషయ్య, బి. డి. ఒ., యితర స్థానిక అధికార అనధికార ప్రముఖులు యీ సమావేశానికి హాజరైనారు.

హైబ్రిడ్ జొన్న పంట



అధిక పంట పండించిన శ్రీ దొండు వెంకటరెడ్డి

కడపజిల్లా రాయచోటి పంచాయతీ సమితిలోని గుట్టుపల్లె గ్రామానికి చెందిన అభ్యుదయ కర్షకుడు శ్రీ దొండు వెంకటరెడ్డి 1969-70 ఖరీఫ్ పంట కాలంలో 1.25 యకరాల్లో హైబ్రిడ్‌జొన్న పండించారు. సెంటుకు 34-36 కిలోగ్రాముల దిగుబడి సాధించినందుకు ఆయనను స్థానిక అధికారులు, అనధికారులు ప్రశంసించారు.

సిరిసిల్ల తాలూకాలోని గ్రామాలకు విద్యుచ్ఛక్తి

వేములవాడ బి.డి.ఓ. శ్రీ జి. రామచంద్రరావు ఇటీవల పంచాయతీ సమితి సిబ్బంది సమావేశంలో ప్రసంగిస్తూ కరీంనగర్ జిల్లా సిరిసిల్ల తాలూకాలో అన్ని గ్రామాలకూ విద్యుచ్ఛక్తి సరఫరా చేయడానికి సంబంధించిన పథకం సిద్ధం చేయబడుతున్నదని అన్నారు.

మహబూబ్‌నగర్ పంచాయతీ సమితికి బహుమతి

ప్రస్తుత సంవత్సరంలో కుటుంబనియంత్రణ శిబిరాలను నిర్వహించడంలో మహబూబ్‌నగర్ పంచాయతీ సమితికి ప్రథమ స్థానం లభించింది. జిల్లా కలెక్టరు శ్రీ వి.కె.ధర్, యీ సమితికి రూ. 250 ల రొక్కం బహుమతిని అందజేశారు. సమితి అధ్యక్షులు శ్రీ కె. రామకృష్ణారెడ్డి యీ బహుమతిని స్వీకరించారు.

గత సంవత్సరం కూడ యీ సమితి కుటుంబనియంత్రణ శిబిరాలను నిర్వహించడంలో గణనీయమైన కృషిచేసి అభివృద్ధి సాధించింది. 95 శాతం కుటుంబనియంత్రణ శస్త్ర చికిత్సలను నమోదుచేసిన కొత్తపేట గ్రామ పంచాయతీకి రూ. 2,000ల రొక్కం బహుమతిని కలెక్టరు అందజేశారు. సమితి అధ్యక్షులు, బ్లాకు అభివృద్ధి అధికారి మార్గదర్శకత్వంలో సమితి సిబ్బంది యిటువంటి శిబిరాలను నిర్వహించడంలో ఎక్కువ ఆసక్తి చూపారు.

వరంగల్లు సూపర్ బజారుకు కొత్త భవనం

వరంగల్లు సెంట్రల్ జైలుకు ఎదురుగా వున్న స్థలంలో సూపర్ బజారుకు సెప్టెంబర్ 3 వ తేదీన వరంగల్లు జిల్లా కలెక్టర్ శ్రీ పి. కె. దొరైస్వామి, శంకుస్థాపన చేశారు. ఈ సూపర్ బజారు భవనాల నిర్మాణానికి రూ. 2 లక్షలు ఖర్చవుతుందని అంచనా. 1969 డిశంబరు నాటికి నిర్మాణం పూర్తి కాగలదు. వచ్చే రిపబ్లిక్ దినోత్సవంనాటి నుంచి యీ సూపర్‌బజారు పనిచేయడం ప్రారంభిస్తుంది.

పెదపద్మాపురం గ్రామాలకు విద్యుద్దీపాలు

శ్రీకాకుళం జిల్లా సారవకోట సమితి, పెద పద్మాపురం గ్రామంలో ఇటీవల కొత్తగా వేసిన విద్యుద్దీపాలకు ఆ గ్రామ సర్పంచ్ శ్రీ ఎన్ని షన్ముఖరావు ప్రారంభోత్సవం చేశారు.

గాంధిజీ శతజయంతి సందర్భంలో హరిజన వాడలకు ప్రత్యేకమైన విద్యుద్దీపాలు వేయడానికి కృషిచేస్తున్నారు.

సారవకోట సమితిలో 80 గిరిజన కుటుంబాలకు ఎద్దుల సరఫరా

సెప్టెంబరు నెలలో శ్రీకాకుళం జిల్లా సావరకోట సమితిలోని 80 గిరిజన కుటుంబాలకు రూ. 15,500 ల విలువ చేసే 80 జతల ఎద్దులను, పాతపట్నం తాలూకా తహసిల్దార్ శ్రీ పి. వి. సుబ్రహ్మణ్యం, డిప్యూటి తహసిల్దార్ శ్రీ కె. దామోదర రావు గార్లు ఉచితంగా సరఫరా చేశారు.

PUBLISHED BY THE DIRECTOR OF INFORMATION AND PUBLIC RELATIONS, ANDHRA PRADESH, HYDERABAD.
PRINTED BY THE DIRECTOR OF PRINTING, GOVERNMENT OF ANDHRA PRADESH, AT THE GOVERNMENT CENTRAL PRESS, HYDERABAD.
1969

